thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 96 కరీంనగర్ ఆదివారం, 15 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు

న్యూఢిల్లీ : అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది.



# కఠిన నిర్ణయాలు తీసుకున్నా..

## సినీ పరిశ్రమ అభివృద్ధికి సహరిస్తాం సీఎం : రేవంత్

## అంగరంగ వైభవంగా గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొన్ని విషయాల్లో కఠిన నిర్ణయాలు తీసుకున్నా, సినీ పరిశ్రమ అభివృద్ధికి, ప్రోత్సాహానికి తోడ్పాటునందించటంతో పాటు, అందరికీ సముచిత స్థానం కల్పించడానికి ప్రయత్నిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా జరిగిన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2024 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విజేతలకు అవార్డులను అందించారు.

**సముచిత గౌరవం ఇవ్వాలనే..** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "సినీ పరిశ్రమను ప్రోత్సహించడానికి అవార్డులను ప్రదానం చేయాలని దిల్‌రాజుగారు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ప్రభుత్వం తన వంతు కృషి చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నంది అవార్డులను ప్రదానం చేశారు. తెలుగు సినీ పరిశ్రమలో నటీనటులు, సాంకేతిక నిపుణులకు తగిన గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో 1964లో నంది అవార్డులను తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఎవరు ఏపీ సీఎంగా ఉన్నా ఆ సంప్రదాయాన్ని కొనసాగించారు. తొలిసారి ఉత్తమ నటుడిగా అక్కినేని నాగేశ్వరరావు నంది అవార్డు అందుకున్నారు. అలాంటి గొప్ప కళాకారుడికి నాటి ప్రభుత్వం సముచిత గౌరవం ఇవ్వడాన్ని మనందరం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వివిధ కారణాలతో 14ఏళ్ల కిందట ఆగిపోయిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ కొనసాగించాలనే ఉద్దేశంతో మా ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' పేరుతో మీ ముందుకు తీసుకొచ్చాం"

**అందుకు అభినందిస్తున్నాం...** "గతంలో భారతీయ సినిమా అంటే బాలీవుడ్ అనేవాళ్లు. తెలుగు సినీ పరిశ్రమ అంటే చెన్నైలో ఉందని మాట్లాడుకునేవారు. కానీ, ఇప్పుడు భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు ఇండస్ట్రీ అని, అందుకు హైదరాబాద్ వేదికని మీరు నిరూపించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందిస్తున్నా. సినీ పరిశ్రమకు సంబంధించి మొదటి తరం ఎన్టీఆర్, ఏయన్నార్.. రెండో తరం.. కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు.. మూడోతరం చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున.. ఇప్పుడు ఇక్కడ నాలుగో తరం సినీ పరిశ్రమ ఇక్కడ ఉంది. వారిలో పవన్ కల్యాణ్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్ ఇంకా చాలా మంది ఉన్నారు. విద్యార్థిదశలో నాకు తెలిసిన వారు ఇప్పుడు ఇండస్ట్రీలో బాగా రాణిస్తున్నారు. ముఖ్యంగా బన్ని, వెంకట్, అశ్వనీదత్ అమ్మాయిలు, ఆయన అల్లుడు నాగ్ అశ్విన్ ఇలా చాలా మంది నాకు తెలుసు. వాళ్లంతా గొప్ప నటులు, దర్శకులు, నిర్మాతలుగా రాణించడం సంతోషంగా ఉంది"

**విజన్-2047లో ఫిల్మ్ ఇండస్ట్రీకి ఒక చాప్టర్...** "రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా కనిపిస్తుంది. కానీ, మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటుంది. మీ అభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది. ప్రభుత్వం నడిపేటప్పుడు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నా, అది మిమ్మల్ని ప్రోత్సహించడానికి, అభినందించడానికి, మీకు సముచిత స్థానం కల్పించడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. 'తెలంగాణ రైజింగ్- 2047'తో నినాదంతో ముందుకు సాగుతున్నాం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన మనం నిలవాలి. అన్ని రంగాల మాదిరిగానే ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా రాణించాలని మా ప్రభుత్వం ఆలోచన. 2047 నాటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అభివృద్ధి చెందాలి. ఈ రోజు ప్రపంచమే గుర్తించే విధంగా అద్భుతమైన సినిమాలు తీసే రాజమౌళిలాంటి దర్శకులు హాలీవుడ్‌ను ఈ గడ్డపైకి ఎందుకు తీసుకురావటం లేదు. మీకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతుంది. అందుకు మీకు ఏం కావాలో చెప్పండి. మీకు కావాల్సిన సదుపాయాల కల్పిస్తాం. 2047 విజన్ డాక్యుమెంట్‌లో ఫిల్మ్ ఇండస్ట్రీకి ఒక చాప్టర్ ఇస్తాం. అది రాయాల్సిన బాధ్యత సినీ ప్రముఖులకు ఉంది. ఇక్కడి నుంచి 22 సంవత్సరాలు క్రియా శీలక రాజకీయాల్లో ఉంటా. ఏ హెూదాలో ఉన్నా మీకు అండగా ఉంటా"

**అభివృద్ధి పథంలో కలిసి నడుద్దాం...** "గద్దరన్న అంటే ఒక చైతన్యం.. విప్లవం.. వేగు చుక్క.. ఆయన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. జయ జయహే తెలంగాణ అందించిన అందెశ్రీ, జై బోలో తెలంగాణ అందించిన గద్దర్ స్ఫూర్తితోనే పోరాటం చేశాం. అదే స్ఫూర్తితో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందించటానికి ప్రయత్నిస్తున్నాం. గద్దర్ అవార్డులను తీసుకున్న వారిని ఈ సందర్భంగా అభినందిస్తున్నా. తెలంగాణ అభివృద్ధిలో మీరు భాగస్వాములు కావాలి. గతంలో ఏమైనా అంశాలున్నా, వాటన్నింటినీ పక్కన పెట్టి అభివృద్ధి పథంలో కలిసి నడవాలి. 'కళ్లతో చూసేది కళ.. కళ్లతో అభినయించేది కళ.. కళ్లు మూసుకునేది కనేది కల.. కళ్లు మూసుకున్న వాళ్లని చైతన్య పరిచేది కళ' అని బాలకృష్ణ చెప్పారు. ఈ కళా చైతన్యమే తెలంగాణ అభివృద్ధికి స్ఫూర్తి. గద్దర్ కుటుంబానికి ఈ ప్రభుత్వం అండగా నిలబడుతుంది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కగారికి ఒక విజ్ఞప్తి హైదరాబాద్ పిల్లోడు రాహుల్ సిప్లిగంజ్‌ని పాతబస్తీ నుంచి ఆస్కార్ అవార్డు వరకూ రాణించాడు. అతన్ని అభినందించాలని, తగిన విధంగా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# వచ్చే ఎన్నికల్లో టీడీపీ తెలంగాణలో పోటీ చేస్తుంది




ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు తెలంగాణ రాజకీయాలపై మరోసారి దృష్టి సారించారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన, తెలంగాణలో టీడీపీని తిరిగి బలోపేతం చేసి, రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. టీడీపీ 1982 మార్చి 29న తెలంగాణలోని హైదరాబాద్‌లో స్వర్గీయ ఎన్టీఆర్ ఆధ్వర్యంలో స్థాపించబడింది. తెలంగాణలో పార్టీ గత వైభవాన్ని పునరుద్ధరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. తెలంగాణలో పుట్టిన ఈ పార్టీ ఇక్కడ కచ్చితంగా పనిచేయాలి. మేము త్వరలోనే పార్టీని పునర్వ్యవస్థీకరిస్తాం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తాం అని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో బలమైన రాజకీయ శక్తిగా ఉండేది. అయితే 2014లో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో పార్టీ రాజకీయ కొంచం కోల్పోయింది.

గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణలో టీడీపీ రాజకీయ కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ప్రస్తుతం తెలంగాణలో భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు ప్రధాన రాజకీయ పార్టీలుగా ఉన్నాయి. ఈ సమయంలో టీడీపీ తిరిగి రాజకీయంగా యాక్టివ్ కావడం రాష్ట్ర రాజకీయ సమీకరణలను ఎలా ప్రభావితం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

తెలుగు దేశం పార్టీ గత వైభవాన్ని తిరిగి సాధించేందుకు చంద్రబాబు వ్యూహాత్మక చర్యలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి.



## 16న రైతులతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి!

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 16న రైతులతో ముఖాముఖి కానున్నారు. 16వ తేదీన వ్యవసాయ యూనివర్సిటీలో జరగనున్న 'రైతు నేస్తం' కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారు. ఇక్కడి నుంచి రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రంలోని అన్ని రైతు నేస్తం కేంద్రాల్లో ఈ ముఖాముఖిని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సీఎస్ రామకృష్ణ ఆదేశించారు. ప్రతి ప్రాంతం నుంచి కనీసం 250 మంది రైతులు హాజరయ్యేలా చూసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్లకు సూచించారు. అలాగే ప్రస్తుతం ఉన్న 500రైతు నేస్తం కేంద్రాలకు తోడుగా అదనంగా మరో 1000రైతు నేస్తం కేంద్రాల్లో వీడియో కాన్ఫరెన్స్ అందుబాటులోకి తేవాలని సీఎస్ ఆదేశించారు. వానకాలం పంటల సాగు ప్రారంభమైన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరవ్వడంతో పాటు ఈనెలాఖరు కల్లా రైతు భరోసాను పంపిణి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. జూలైలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో మెజార్టీగా ఉండే రైతాంగానికి చేరువయ్యేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.

# గ్రామాల్లో మొదలైన సందడి!

## పల్లెబాట పట్టిన ఆశావహులు!




హైదరాబాద్ : పల్లె పోరుకు ప్రభుత్వం మళ్లీ సన్నాహాలు మొదలుపెట్టింది. వచ్చే నెలలో ఎన్నికలు ఉంటాయని సంకేతాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాంగా గ్రామపంచాయతీలో పొలిటికల్ సందడి మొదలైంది. 15న జరిగే క్యాబినెట్ సమావేశంలో ఎన్నికల నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. కార్యదర్శులు అప్పులు తెచ్చి పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగిస్తున్న తీరు కనిపిస్తోంది. చివరకు డీజిల్ కూడా పోయలేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించడంతో గ్రామాల్లో ఆశావహులు మళ్లీ ముందుకు వస్తున్నారు. గతంలోనే ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేసిన అధికారులకు మళ్లీ ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో సేకరించిన సమాచారంలో మార్పులుచేర్పులు ఉంటే సవరించి టీ-పోల్ పోర్టల్లో నమోదు చేయాలని ఆదేశాలు రావడంతో అధికారులు మళ్లీ దృష్టి సారించారు. గతంలో ఎన్నికల కోసం సిద్ధం చేసిన ఉద్యోగులు ఉన్నారా... కొత్త ఉద్యోగులు వచ్చారా.. అనే విషయాలపై ఇప్పటికే ఆరాతీసి కొత్తవారు వస్తే వారి వివరాలు టీ-పోల్‌లో అప్డేట్ చేయాలని ఆదేశాలు రావడంతో అధికారులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం చెప్పినట్లు జూలైలో ఎన్నికలు వచ్చినా అధికార యంత్రాంగం మాత్రం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సర్వంసిద్ధంగా ఉన్నారు. 2019 గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా నిర్వహించింది. ఈసారి కూడా మొదట్లో మూడు విడతలుగా ఏర్పాటుచేసినా రెండు విడతల్లోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశించడం, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉన్నారు.

**ఆశావహుల పల్లె బాట..** స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి సారించడంతో ఆశావహులు, మాజీ సర్పంచులు మళ్లీ పల్లె బాట పట్టారు. రిజర్వేషన్ల ప్రక్రియ తేలిన తర్వాతే ఎన్నికలు జరుగుతాయని భావించి పల్లెలకు దూరమైన ఆశావహులు పల్లెల్లో మళ్లీ మద్దతు కూడగట్టుకునే పనిలో పడారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సభలు సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆశావహులు పాల్గొంటున్నారు. మరోవైపు స్థానిక ఎన్నికల్లో ఆధిపత్యాన్ని చాటుకునే దిశగా బీఆర్ఎస్, బీజేపీలు తమ క్యాడరును అప్రమత్తం చేస్తున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతోనే బరిలోకి దిగే విధంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సిద్ధమవుతున్నాయి. మరోవైపు రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయి అనే విషయంలో సందిగ్ధత తొలగడం లేదు.

**వీడని రిజర్వేషన్ల సందిగ్ధత..** సామాజిక వర్గాల రిజర్వేషన్లు సందిగ్ధత మాత్రం వీడటం లేదు. ప్రధానంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పంచాయతీ తేలే వరకు స్థానిక ఎన్నికలు జరిగే సంకేతాలు కనిపించడం లేదు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎన్నికలను ఊరిస్తూ వాయిదాలు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం జనగణనతో కులగణన కూడా చేపట్టే అవకాశాలు ఉండడంతో గ్రామపంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే అని అభిప్రాయంతో ఆశావహులు నిరాశ చెందుతున్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచేందుకు సవరణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. సవరణ కావాలంటే పార్లమెంట్లో బిల్లు పాస్ చేయాల్సి ఉంటుంది. కేంద్రం ఈ ప్రక్రియ ఇంకా మొదలు పెట్టకపోయినా రాష్ట్ర ప్రభుత్వం జులైలో ఎన్నికలంటూ ఆశలు కల్పిస్తున్నారు. దీంతో ఎలక్షన్ల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు అయోమయంలో పడ్డారు. 2024జనవరి నెలలో సర్పంచులు, వార్డు సభ్యుల పదవి కాలం ముగిసి 16 నెలలు గడుస్తున్నా ఎన్నికలపై ఇప్పటికి గందరగోళ పరిస్థితి మాత్రం వీడటం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలతో పాటు మున్సిపల్ జిల్లా పరిషత్ మండల పరిషత్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే అంటూ అధికారులు, ఆశావహులు ఉన్నారు.





# తెలంగాణలో పుట్టిన వారికి భారీ శుభవార్త.. రూ. 20 లక్షలు.. అర్హులు వీళ్లే..!

అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, యూరోప్.. లాంటి దేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించాలని లక్షలాది మంది విద్యార్థులు కలలు కంటూ ఉంటారు. అలాంటి పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. సీఎం ఓవర్సీస్ పథకం కింద పేద, మధ్య తరగతి మైనారిటీ విద్యార్థులు ఫ్రీగా విదేశాలకు వెళ్లొచ్చు. ఇందుకు మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థుల కోసం సరికొత్త పథకాన్ని తీసుకొచ్చింది. ఈ స్కీమ్ కు 'సీఎం ఓవర్సీస్ స్కాలర్ షిప్ ఫర్ మైనారిటీస్' అని పెట్టింది. ఈ పథకం కింద మైనారిటీ విద్యార్థులు ప్రపంచంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ఫ్రీగా చదువుకోవచ్చు. ఈ పథకం విద్యార్థికి పూర్తి ఆర్థిక సాయం ప్రభుత్వమే అందిస్తుంది. 'సీఎం ఓవర్సీస్ స్కాలర్ షిప్ ఫర్ మైనారిటీస్' పథకం కింద ఎంపికైన 500 మంది మైనారిటీ విద్యార్థులకు రూ. 20 లక్షల ఆర్థిక సాయం అందించనుంది రాష్ట్ర ప్రభు త్వం. ఆర్థిక సాయం రూ. 20 లక్షలు లేదా విద్యార్థి అడ్మిషన్ లెటర్ మీద ఎంత ఫీజు ఉంటే అంత మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది. అంతేకాక మైనారిటీ విద్యార్థులకు విమాన ప్రయాణ టికెట్ కూడా ఉచితంగానే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఎకానమీ క్లాస్ టికెట్ అంది స్తుంది. విదేశాల్లో డాక్టరేట్, పీజీ చదవాలనుకునే విద్యార్థులకు ఇదో సువర్ణావకాశంగా భావించవచ్చు. మైనారిటీ కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కోసం అప్లై చేసుకోవాలనుకునే అభ్యర్థులకు అప్లికేషన్ లింక్ 8 జులై, 2025 న ప్రారంభం అవుతుంది. దరఖాస్తు చివరి తేదీ ఆగస్టు 7, 2025 వరకు ఉంటుంది. ఆన్ లైన్ విధానంలో ఈ పథకానికి అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకం అప్లై చేసుకోవడానికి ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, పాన్ కార్డు, డొమిసైల్ సర్టిఫికేట్, రెసిడెన్షియల్ సర్టిఫికెట్, మైనారిటీ సర్టిఫికేట్, మార్కుల మెమో, పాస్ ఫోటోలు, బ్యాంక్ పాస్ బుక్ అవసరం. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో విద్యను అభ్యసించవచ్చు.



# అడ్లూరికి ఫస్ట్.. వివేక్, వాకిటికి సెకండ్ ఫ్లోర్.. కొత్త మంత్రులకు చాంబర్లు కేటాయింపు

హైదరాబాద్ : తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రులకు సెక్రటేరియట్ లో చాంబర్లు కేటాయించారు. ఈ మేరకు సాధారణ పరిపాన శాఖ (జీఏడీ) ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు ఫస్ట్ ఫ్లోర్ లో 13, 14, 15, 16 నంబర్ రూంలు, మంత్రి వివేక్ వెంకటస్వామికి సెకండ్ ఫోర్ లో 20, 21, 22 నంబర్ రూంలు, మంత్రి వాకిటి శ్రీహరికిసెకండ్ ఫ్లోర్ లో 26, 27, 28 నంబర్ రూంలు కేటాయించారు. చాంబర్లు కేటాయించడంతో త్వరలోనే వీరు తమకు కేటాయించిన శాఖల బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కాగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఎస్సీ అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖలు కేటాయించగా వివేక్ వెంకట స్వామికి కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజీ శాఖలు వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, క్రీడలు, యువజన సేవల శాఖలు కేటాయించిన సంగతి తెలిసిందే.

# ఇప్పటికైనా కళ్లు తెరవండి.. గోదావరి-బనకచర్లను అడ్డుకోండి: హరీశ్‌రావు



హైదరాబాద్: కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా మారిందో.. గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలా ఉపయోగపడుతుందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తుంటే తెలంగాణ సీఎం, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. "బనకచర్ల ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంటే.. మన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ఏపీ ప్రభుత్వం ఈ నెలాఖరుకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోంది. ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం పెట్టడానికి రావట్లేదు. కేటీఆర్, ప్రతిపక్ష నేతలపై ఎలా కేసులు పెట్టాలనే దానిపైనే ప్రభుత్వానికి ధ్యాస తప్ప.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. గత రెండు కేంద్ర బడ్జెట్లు చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద.. తెలంగాణకు గుండు సున్నా. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే .. తెలంగాణకు సున్నా.. ఇదీ దిల్లీ పాలకుల వైఖరి. నిధుల్లో, నదుల్లో తెలంగాణకు అన్యాయం జరిగినా ఈ రాష్ట్రంలో ఉన్న 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది భాజపా ఎంపీలు నోరు విప్పడం లేదు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రుల నుంచి ఎలాంటి స్పందన లేదు. గోదావరి-బనకచర్లకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరిస్తోంది. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారు. 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం చంద్రబాబు 2008లో పెద్ద పోరాటం చేశారు. 200 టీఎంసీలతో అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలి. రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే భారాసకు ముఖ్యం. ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా మేం మద్దతిస్తాం. మీరు ముందుకు రాకపోతే భారాస పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది" అని హరీశ్‌రావు తెలిపారు.

# మరోసారి ఏఐజీ ఆసుపత్రికి కేసీఆర్



హైదరాబాద్: మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ శనివారం మరోసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. వైద్య పరీక్షల కోసం అక్కడికి చేరుకున్నారు. మరోవైపు సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా కేసీఆర్ శుక్రవారం కూడా ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆసుపత్రికి వచ్చిన ఆయన.. గంట పాటు అక్కడే ఉన్నారు. ఏఐజీ ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్‌కు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బంది లేకపోయినా.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.




**హైదరాబాద్: దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ హాజరయ్యారు. వైమానిక దళంలోని వివిధ విభాగాల్లో ప్రీ-కమిషనింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న ఫ్లైట్ క్యాడెట్‌లు ఇందులో పాల్గొన్నారు. పరేడ్ సందర్భంగా విమానాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.**

# కాళేశ్వరం కమిషన్ ఎదుట కాకమ్మ కథలు చెప్పారు: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



హైదరాబాద్: జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు ఇటీవల హాజరైన వ్యక్తులు.. క్యాబినెట్ నిర్ణయం మేరకే అంతా జరిగిందని చెప్పారని భాజపా నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. తప్పించుకోవడానికే ఇలా కాకమ్మ కథలు చెప్పారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ బహిరంగ విచారణ వద్దని అనడంలోనే అసలు ఉద్దేశం తెలుస్తోందన్నారు. బండారం బయటపడుతుందని అలా అడిగారని చెప్పారు. అప్పటి సీఎం కేసీఆర్ తప్పులు జరుగుతున్నా సరిచేయలేదని దుయ్యబట్టారు. "కాళేశ్వరం బ్యారేజీలు కుంగిన మాట వాస్తవం కాదా? తమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్ట్ లొకేషన్‌ను రాజకీయ కారణాలతోనే మార్చారు. అంచనాలు పెంచడంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమాధానాలు రాబట్టాలి.

గత ప్రభుత్వ అవినీతిని బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నాం. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదు. షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం" అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మూడోసారి సిట్ విచారణకు ప్రభాకర్‌రావు



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు సిట్ ఎదుట మూడోసారి విచారణకు హాజరయ్యారు. అమెరికా నుంచి వచ్చిన తర్వాత ఇప్పటికే ఆయనను సిట్ బృందాలు రెండుసార్లు సుదీర్ఘంగా ప్రశ్నించాయి. ఇవాళ మూడో సారి విచారణకు పిలిచింది. మరో వైపు శుక్రవారం ప్రణీత్‌రావును విచారించిన సిట్ అధికారులు ఆయన నుంచి నమోదు చేసిన వాంగ్మూలం ద్వారా ప్రభాకర్‌రావును ప్రశ్నించనున్నారు. ప్రణీత్ రావును కూడా ప్రభాకర్‌రావుతో కలిసి ప్రశ్నించే అవకాశం కనిపిస్తోంది. ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ చేశారు..? హార్డ్ డిస్క్‌లను ఎవరి ఆదేశాలతో ధ్వంసం చేయాల్సి వచ్చింది..? ఎంత మంది ఫోన్లు ట్యాపింగ్ చేశారు.. వారిలో అధికారులతో పాటు రాజకీయ నేతల ఫోన్లు కూడా ఉన్నాయా..? అనే కోణాల్లో వారిద్దరిని విచారించనున్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదు.. దాన్ని పూర్తిగా రద్దు చేయాలి: కూనంనేని




హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, దాన్ని పూర్తిగా రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దన్నారు. "కాళేశ్వరానికి అన్నీ నేనే అన్న కేసీఆర్ ఇప్పుడు సంబంధం లేదంటున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మించాక ఒక్క ఎకరాకు అదనంగా నీరు ఇవ్వలేదు.
ఎల్లంపల్లి ద్వారానే పంటకు నీళ్లు అందుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోంది. మావోయిస్టుల మృతదేహాలను చూసి కూడా కేంద్రం భయపడుతోంది. కేశవరావు మృతదేహాన్ని అప్పగించకపోవడం దారుణం" అని కూనంనేని అన్నారు.

# గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్ల నిధులు మంజూరు

హైదరాబాద్: ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన గద్దర్ ఫౌండేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. గద్దర్ జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం గద్దర్ ఫౌండేషన్‌కు రూ. 3 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ తరపున ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమం, సాంస్కృతిక రంగంపై తనదైన ముద్ర వేసిన గద్దర్ సేవలకు గుర్తింపుగా ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఇక ముందు గద్దర్ జయంతి వేడుకల కార్యక్రమాల నిర్వహణలోనూ గద్దర్ ఫౌండేషన్‌కు భాగస్వామ్యం కల్పిస్తూ మరో ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేసింది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుస్తాం



సిద్దిపేట జిల్లా: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెదక్ జిల్లాలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. ఇవాళ(శనివారం) గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అలాగే సిద్దిపేట రంగదాంపల్లి వద్ద అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ శ్రేణులు మెదక్ జిల్లాలో ఇంతటి ఘనస్వాగతం పలకడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. సన్నబియ్యం, నూతన రేషన్ కార్డుల మంజూరు వంటి కార్యక్రమాలతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై అపూర్వ స్పందన వస్తోందని ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికలనూ దృష్టిలో పెట్టుకొని గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగిరే విధంగా ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని అన్నారు. విభేదాలను పక్కన పెట్టి సమస్యలు పరిష్కారం చేసుకుందామని కోరారు. సిద్దిపేటలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మాటిచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకుందాం, వారానికి ఒక్కసారి సిద్దిపేటకి వస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు.




ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య నెలకొన్న భీకర యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంది. మిలిటరీ స్థావరాలే లక్ష్యంగా శుక్రవారం రాత్రి ఇరుదేశాలు పరస్పర దాడులకు దిగాయి. ఈక్రమంలో ఓ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నివాస సమీపంలోనూ వైమానిక దాడులు జరిగినట్లు తెలుస్తోంది.

దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. టెహ్రాన్‌లోని మోనిరియాలో ఈ వైమానిక దాడులు జరిగాయి. అక్కడే ఖమేనీ నివాసంతో పాటు ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఉంది. ఈ క్రమంలోనే అక్కడ దాడులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక మీడియా దీనికి సంబంధించిన వీడియోను విడుదల చేసింది.

**మిలిటరీ చీఫ్‌గా అమీర్ హతామీ..** ఇదిలాఉండగా.. ఇరాన్ మిలిటరీ చీఫ్‌గా అమీర్ హతామీని నియమించినట్లు ఖమేనీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బాఘేరి మృతిచెందిన విషయం తెలిసిందే. 2013 నుంచి 2023 వరకు హతామీ దేశ రక్షణ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో గురువారం అర్ధరాత్రి నుంచి ఇరాన్‌పై ఇజ్రాయెల్ పెద్దఎత్తున దాడులకు దిగింది.

ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలు, సైనిక ఉన్నతాధికారులే లక్ష్యంగా వందల క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడిలో టెహ్రాన్ పలు కీలకమైన మిలిటరీ అధికారులను, అణుశాస్త్రవేత్తలను కోల్పోయింది. దీనికి టెహ్రాన్ ప్రతిదాడులను కూడా చేసింది. టెల్‌అవీవ్ చేసిన దాడుల్లో 78 మంది ఇరాన్ పౌరులు మృతి చెందగా.. 329 మంది గాయపడ్డారు.

# ప్రావిన్సియల్ గవర్నరుగా నియమితుడైన తొలి భారతీయుడు రాఘవేంద్రరావు

## - జూన్ 15..ఈడ్పుగంటి రాఘవేంద్రరావు వర్ధంతి



ఈడ్పుగంటి రాఘవేంద్రరావు (1890 – జూన్ 15, 1942 భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రసిద్ధ జాతీయవాది, బహుభాషా కోవిదుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి. కేంద్ర ప్రభుత్వ సలహాదారుగా పనిచేసారు. బ్రిటీషు పాలనలో ఒక ప్రాంతము యొక్క ప్రావిన్సియల్ గవర్నరుగా నియమితుడైన మొట్టమొదటి భారతీయుడు రాఘవేంద్రరావు. 1935 మే 15 నుండి 1936 సెప్టెంబరు 11 వరకు రాఘవేంద్రరావు మధ్య పరగణాలు (సెంట్రల్ ప్రావిన్సెస్ – ఇప్పటి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, విదర్భ ప్రాంతం), బేరర్ ఆపద్ధర్మ గవర్నరుగా పనిచేశారు. ఆయన ఆ తరువాత మౌంట్‌బాటన్ వైస్రాయిగా పనిచేసిన కాలములో, ఎం.ఎస్. ఆనేతో పాటు వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో సభ్యునిగా నియమితులైనారు. ఆనేతో పాటు రాఘవేంద్రరావు ఆ కౌన్సిల్లో భారతీయ వస్త్రధారణతోనే ఇతర బ్రిటీషు సభ్యులతో పాటు కూర్చొని తన జాతీయవాదాన్ని చాటుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఈడ్పుగంటి రాఘవేంద్రరావు తండ్రి నాగన్న వ్యవహార కారణాల వలన నాగపూరు, బిలాస్ పూరులకు వెళ్ళడంతో రాఘవేంద్రరావు మధ్య ప్రదేశ్ లోనే పెరిగి పెద్దయ్యారు. హిందీ మాట్లాడే ప్రాంతంలో నివసిస్తున్న ఆయన ఒక ప్రైవేట్ ట్యూటర్ ద్వారా తెలుగు, సంస్కృతం నేర్చుకున్నారు. మెట్రిక్యులేషన్ తరువాత, అలహాబాద్ మరియు నాగపూర్లలో చదువు కున్నారు. అతను బార్–ఎట్–లా అధ్యయనం కోసం 1909 లో ఇంగ్లాండ్ వెళ్ళారు. భారతదేశం తిరిగివచ్చి బారిష్టరుగా జీవితము ప్రారంభించిన రాఘవేంద్రరావు తొలుత బిలాస్‌పూర్ చైర్మన్ గా ఎన్నికైనారు. 1926 వరకు స్వరాజ్య పార్టీలో పనిచేసిన రాఘవేంద్రరావు, పార్టీలోని మరాఠీ నాయకులతో విభేదించి బయటికి వచ్చారు.. ఆ తరువాత నాగపూరులో ప్రధానమంత్రి గానూ, గవర్నరు గానూ పని చేశారు. పదవిలో ఉన్నప్పుడు సైమన్ కమిషన్ బహిష్కరణలో పాల్గొనడం విశేషం. విద్యార్థి దశలోనే రాఘవేంద్రరావు జాతీయోద్యమం లోని తీవ్రవాదుల పట్ల ఆకర్షితుడయ్యాతు. వీరిలో ముఖ్యంగా వినాయక దామోదర సావర్కార్, శ్యాంజీ కృష్ణవర్మ వంటి వారి ప్రభావం ఆయనపై బాగా పడింది. రాఘవేంద్రరావు 1941 జూలైలో బ్రిటీషు ప్రభుత్వపు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో పౌరరక్షణ వ్యవహారాల సభ్యునిగా నియమితుడయ్యారు. చివరి దాకా పాలనా వ్యవహారాలలో తలమునకలై, అనారోగ్యానికి గురై, ఆరోగ్యం క్షీణించి 1942 జూన్ 25న 52 సంవత్సరాల వయసులో పరమ పదించారు. రాఘవేంద్రరావు పెద్ద కుమారుడు ఈడ్పుగంటి అశోక్ రావు బిలాసపూర్ మునిసిపల్ కార్పోరేషన్ కు 1982–84 మధ్య కాలంలో మొట్టమొదటి మేయర్ గా ఎన్నికయ్యారు. ఆయన 1980–1987 మధ్య కాలంలో మధ్య ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి కోశాధికారిగా ఉన్నారు. అశోక్ రావు 1991–98 మధ్య కాలంలో రెండు సార్లు బిలాసపూర్ నుండి మధ్య ప్రదేశ్ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు, 1993–97 మధ్య కాలంలో మధ్య ప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు. ఈడ్పుగంటి అశోక్ రావు గారి కోడలు ఈడ్పుగంటి వాణిరావు 'బిలాసపూర్' మునిసిపల్ కార్పోరేషన్ కు మేయర్ గా ఎన్నికైన ప్రథమ మహిళ కావడం విశేషం. ఆమె డిసెంబర్ 2009 సంవత్సరంలో మేయర్ గా ఎన్నికయ్యారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# వృద్ధుల పట్ల అధికమవుతున్న అనాదరణ

## - జూన్ 15... వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవం




బాల్య, కౌమార్య, యవ్వన, వృద్ధాప్యాలు జీవితంలో ఏ ప్రాణికయినా తప్పని సరిగా సంభవించే జీవన రేఖలు. 'ఎండుటాకును చూసి పచ్చటాకు నవ్వింది' అని తెలుగులో ఒక సామెత. పండిపోయి చెట్టు నుంచి రాలే ఎండు టాకును చూసి చెట్టు రెమ్మలకు వేలాడే పచ్చటాకు నవ్వింది. అది గమనించిన ఎండుటాకు పచ్చటాకును చూసి, రేపు నీకు కూడా నా గతే కదే.. అని పకపక మంటూ రాలి పోయిందట. మనిషి జీవిత చక్రంలో వచ్చే మార్పులు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తి తుదిశ్వాస ఉన్నంత వరకు, ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. వృద్ధాప్యము లేదా ముసలి తనము మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్ధారించడానికి వయోపరిమితి లేనప్పటికి, మనిషి శరీరము రోగనిరోధక శక్తిని క్రమక్రమంగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యంగా చెప్పవచ్చు. నేడు పిల్లలుగా, యువజనులుగా, నడి వయస్సులుగా పాత్రలు పోషిస్తున్న అందరూ జీవితం కొనసాగితే వృద్ధుల బృందంలోకి అడుగు పెట్టే పరిస్థితి రాక తప్పదు. యవ్వన దశలో వారు సమాజానికి అవసరమైన సమస్త ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొని రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు తమ వంతు కృషి చేసి ఉంటారు. పనులు మాని, లక్ష్యాలు పూర్తి చేసుకుని ఉత్పత్తికి దూరమై విశ్రాంతి తీసుకుంటూ జీవన చరమ దశను ముగిద్దామని దీర్ఘ సెలవులో ఉంటున్న జాతి నిర్మాతలే వృద్ధులు. తన కుమారులకు, కుమార్తెలకు, మనుమళ్ళకు, ముని మనుమలకు సలహాలు ఇచ్చే వయస్సు కూడా ఇదే. ఐక్య రాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఇప్పుడు 60 ఏళ్ల వయసును కలిగి ఉన్నారు. 2050 నాటికి ప్రపంచం లోని ప్రతి అయిదు మందిలో ఒకరు 60 ఏళ్లు ఆ పైబడి వయసును కలిగి ఉంటారట. 2150వ సంవత్సరానికి ప్రపంచంలో ప్రతి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు ముదుసలిగా ఉంటారట. సీనియర్ సిటిజన్లుగా పేరు పడిన ఈ వయోవృద్ధుల అవసరాలు తీర్చే కృషిలో వ్యక్తులూ, సమాజమూ పునరంకితం అయ్యేందుకు గాను ప్రపంచ వ్యాప్తంగా కృషి జరుగుతున్నది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కూడా వృద్ధుల సంక్షేమానికి కొన్ని జాతీయ ప్రణాళికను, కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గత 2007లో వృద్ధుల కోసం పోషణ, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే, ఈ చట్టాలు అమలుకు పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదన్నది తెలిసిన సత్యమే. వృద్ధుల సమస్యల పరిష్కారానికి సమాజంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలి. వేధింపులు, ఆరోగ్య సమస్యల నుంచి వృద్ధులను దూరంగా ఉంచేలా కుటుంబ సభ్యులంతా చొరవ చూపాలి. జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశ కావడంతో– వారిలో శారీరక మార్పులను ఆపడం ఎవరితరం కాదు. వృద్ధాప్యం అన్నది శరీరానికే కానీ మనసుకు కాదని ప్రతివారూ తెలుసు కోవాలి. ప్రస్తుతం అరవయ్యేళ్ళ వయసు దాటిన వారు దేశంలో 15 కోట్ల మేరకు ఉంటారని అంచనా. వీరిలో సుమారు కోటిన్నర మందికి పైగా ఒంటరి జీవితం సాగిస్తున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు, ఔషధాలు అందుబాటు లోకి రావడంతో ఆయుర్దాయం పెరుగుతోంది. దీంతో వృద్ధుల సంఖ్య అదే స్థాయిలో అధిక మవుతోంది. ప్రపంచంలో ఎక్కువ మంది వృద్ధులు ఉన్న దేశంగా చైనా మొదటి స్థానంలో ఉంది. అక్కడ 60 ఏళ్లకు పైబడినవారు 16.7 కోట్ల మంది, 80 ఏళ్లకు పైబడిన వారు పది లక్షల మంది ఉన్నారు. 80 ఏళ్లకు పైబడిన వారి 'సూపర్ సీనియర్ సిటిజన్స్' అంటారు. జపాన్‌లో నాటికి 30 శాతం మంది 60 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు. 2050 నాటికి 64 దేశాలు 30 శాతం వృద్ధులతో నిండి పోతాయట! అంటే వృద్ధుల జనాభా 120 కోట్లకు చేరుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం వృద్ధులుంటారని ఐక్యరాజ్య సమితి చెబుతోంది. 2050 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా 30 కోట్లపైనే ఉండే అవకాశముంది. మన దేశంలో ప్రతి ఐదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురి అవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధుల సంరక్షణ వారి పిల్లల కనీస బాధ్యత. వయసుడిగిన దశలో తమ వారసుల నుంచి వారు కోరుకునేది ప్రేమ పూర్వక పలకరింపు, ఆదరణ, అభిమానాలే తప్ప– ఆడంబరాలు, విలాసాలు కాదు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలే కాదు, ఆర్థిక, సామాజిక సమస్యలు వారిని చుట్టు ముడుతాయి. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సి ఉండాలి. 60 ఏళ్లు పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగం చేసుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారే కాదు, సంపన్న కుటుంబాల లోనూ వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి తమ పని పూర్తయిందను కుంటున్నారు. రేపు తమదీ ఇదే బతుకు అయ్యే అవకాశం ఉన్నదని వారు మరచి పోతున్నారు. సంతానం ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా పిల్లలు కళ్లముందున్నప్పటికీ కొందరు వృద్ధులు అనాథలుగా మారుతున్నారు. ఆవేదనతో మానసిక క్షోభను అనుభ విస్తున్నారు. సంపాదన అనే వ్యామోహంలో పడి కొందరు యువకులు తల్లిదండ్రుల ప్రేమను పోగొట్టు కుంటున్నారు. మరికొంత మంది బంధాలను దూరం చేసు కుంటున్నారు. జాతీయ స్థాయిలో వృద్ధుల స్థితిగతులపై 'హెల్పేజ్ ఇండియా' వెలువరించిన నివేదికలో అనేక ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. సొంత కుటుంబ సభ్యుల నుంచే నిరాదరణ ఎదురవు తోందంటూ 56 శాతం వృద్ధులు స్పందించారు. కుమారుల్లో 57 శాతం, కోడళ్లలో 38 శాతం పెద్దవారిని ఆదరించడం లేదట. తమ హక్కుల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై వృద్ధుల్లో కొంతవరకు అవగాహన ఉన్నప్పటికీ, కుటుంబ గౌరవం మంట గలుస్తుందన్న భయంతో పోలీసులను ఆశ్రయించటం లేదన్నది 52 శాతం వృద్ధుల స్పందన. వృద్ధులపై వేధింపుల నిరోధానికి కేంద్రం ఒక చట్టం చేసింది. 'తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ నిర్వహణ చట్టం'గా వ్యవహరించే దీని గురించి చాలామంది వృద్ధులకు తెలియదు. గ్రామీణ వృద్ధుల్లో 45 శాతం మంది దీర్ఘకాల అనారోగ్యాలతో బాధ పడుతున్నారని జాతీయ నమూనా సర్వే తెలిపింది. ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్ ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్నవారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే– రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొంద గలుగుతాం అని యువత గుర్తించాలి. వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# భారత చరిత్రకు శాస్త్రీయ స్వరూపం ప్రసాదించిన మేధావి...కె.ఎ. నీలకంఠ శాస్త్రి

## భారత చరిత్రకు శాస్త్రీయ దిశనిచ్చిన పాండిత్యపు ప్రతిభ - జూన్ 15...నీలకంఠ శాస్త్రి వర్ధంతి



కె.ఎ. నీలకంఠ శాస్త్రి, పూర్తి పేరు కేత్తూరు అక్కన్న నీలకంఠ శాస్త్రి. భారతీయ చరిత్ర పరిశోధనలో అత్యంత గౌరవనీయమైన పేరు. 1892 మే 12న తమిళనాడులోని కులీత్తలై పట్టణంలో జన్మించిన ఆయన, సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో బాల్యానికే సంస్కృతం, తమిళం, ఇంగ్లీషు వంటి భాషలపై అవగాహనను అలవర్చు కున్నారు. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో విద్యాభ్యాసం చేసి, చరిత్ర విజ్ఞానంలో అసాధారణ ప్రతిభను ప్రదర్శించారు. నీలకంఠ శాస్త్రి జీవితం మొత్తం చరిత్రకు అంకితమైనది. 1913లో మద్రాసు హిందూ కాలేజీలో ఉపన్యాసకుడిగా తన బోధనా ప్రయాణం ప్రారంభించి, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, అన్నామలై విశ్వవిద్యాలయం, తిరుచ్చి హిందూ కళాశాల, మైసూరు విశ్వవిద్యాలయం వంటి విశిష్ట విద్యాసంస్థల్లో చరిత్ర బోధనకు సమర్పితుడిగా పనిచేశారు. ఆయన విద్యార్థులకు చరిత్ర పట్ల గాఢమైన ఆసక్తిని, శాస్త్రీయ దృక్పథాన్ని నూరిపోశారు. ఆయన బోధన శైలి లోతైన విజ్ఞానాన్ని సరళంగా వ్యక్తీకరించే విశిష్టతను కలిగినది. నీలకంఠ శాస్త్రి రచనల ప్రధాన లక్ష్యం భారత చరిత్రను పాశ్చాత్యుల ఆధిపత్య భావనల నుండి విముక్తం చేసి, స్వదేశీ సాంస్కృతిక, ధార్మిక, రాజకీయ సందర్భాలను ఆధారంగా చేసుకొని ఆవిష్కరించడం. ఆయన రాసిన "%ూ ఎఱర్‌శతీఎ శీట ూశీబ్ష్ర ×అఎఱు: ఖీతీశీఎ ూతీవష్ట్రఱర్‌శతీఱష ుఱఎవం్‌ శ్‌ ష్త్రవ ఖీఎశ్రీశ్రీ శీట ఎఱయఱఝఱఝుష్త్రుతీ%" అనే గ్రంథం దక్షిణ భారత చరిత్రపై సమగ్ర, శాస్త్రీయ అవగాహనను అందించడంలో చారిత్రక మైలురాయిగా నిలిచింది. చోళ, చాళుక్య, పల్లవ, విజయనగర సామ్రాజ్యాల పాలన, సాంస్కృతిక ప్రభావం, విదేశీ సంబంధాలు, సామాజిక అభివృద్ధి వంటి అంశాలను ఆధారాలతో సహా విశ్లేషించిన తీరు అభినందనీయమైనది. The Colas, Studies in Chola History and Administration%μμ, aa%The Pandyan Kingdom%μμ, aa%Age of the Nandas and Mauryas%μμ, aa%Sources of Indian History%μμ, aa%Foreign Notices of South India%μμ, aa%An Advanced History of India%μμ వంటి ఆయన ఇతర గ్రంథాలూ భారతీయ చరిత్రకారులకు మార్గదర్శిగా నిలిచాయి. చరిత్రను సంఘటనల శ్రేణిగా కాకుండా, ఆర్థిక, సాంస్కృతిక, సాహిత్య, ధార్మిక విభిన్న కోణాలనుండి సమగ్రంగా విశ్లేషించటంలో ఆయన చూపిన విశ్లేషణాత్మకత ఆయన రచనల ప్రత్యేకత. దక్షిణ భారత చరిత్రను ఖచ్చితంగా, ఆధారపూర్వకంగా పునర్నిర్మించడంలో ఆయన పురాణాలు, శిలాశాసనాలు, శాసనాలు, సాహిత్య ఆధారాలను సమర్థంగా ఉపయోగించారు. నీలకంఠ శాస్త్రి రచనలు చరిత్రకు ప్రామాణిక ఆధారాలైన శాసనాలు, శిలాశాసనాలు, సాహిత్య రచనలు, పురావస్తు ఆధారాలను పటిష్టంగా ఉపయోగించుకుని రూపొందించబడ్డాయి. ఆయన రచనలు విద్యావేత్తలకే కాక సామాన్య పాఠకులకు కూడా అర్థమయ్యే విధంగా రచించబడ్డాయి. ఆయన పరిశోధన దృష్టికోణం లోతుగా ఉండి, ప్రాచీన భారత రాజ్యాల పాలనా విధానాలపైనా, సామాజిక వ్యవస్థలపైనా స్పష్టమైన అవగాహన నిచ్చింది. చోళుల నౌకాదళ వ్యూహాలు, విదేశీ సంబంధాలు, కర్ణాటక ప్రాంతాలపై విజయనగరుల ప్రభావం వంటి అంశాలు ఆయన రచనలలో విశ్లేషణాత్మకంగా ప్రతిఫలించాయి. నీలకంఠ శాస్త్రి రచనల శైలీ ఎంతో పరిశీలనాత్మకమైనది. అతిశయోక్తుల నుండి దూరంగా ఉండే ఆయన రాస్తున్నప్పుడు నిష్పక్షపాతతకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. భాషలో సరళత, సమాచారంలో ప్రామాణికత, విశ్లేషణలో లోతు ఆయన రచనల ప్రధాన లక్షణాలు. భారత చరిత్రను ప్రపంచానికి శాస్త్రీయంగా పరిచయం చేయడంలో ఆయన పాత్ర అపారమైనది. నీలకంఠ శాస్త్రి రచనా శైలిలో స్పష్టత, విపులత, శాస్త్రీయ విశ్లేషణ ఉండటం ఆయన ప్రత్యేకత. చరిత్రను ఆయా సమాజాల మానవీయ ప్రవృత్తుల ప్రతిబింబంగా చూస్తూ, శిలాశాసనాల నుంచి సాహిత్య సమితుల వరకు విస్తృతంగా ఆధారాలను సమీకరించారు. ఈ దృష్టితోనే ఆయనను దక్షిణ భారత చరిత్ర పరిశోధనకు "పితామహుడు"గా అభివర్ణించటం సముచితమే. కొంతమంది విమర్శకులు ఆయన రచనలలో పాలకుల పట్ల గౌరవ దృక్పథం ఎక్కువగా ఉందని, సంస్కృతీ పరమైన విలువలకు అధిక ప్రాధాన్యం ఉన్నదని అభిప్రాయపడినా, ఆయన ఆధారసమృద్ధి, శాస్త్రీయపరత, చారిత్రక దృష్టి అనేక పండితుల ప్రశంసలను పొందాయి. ఆయన రచనలు నేటికీ పరిశోధకులకు, విద్యార్థులకు, చరిత్ర అభిమానులకు ఆధార గ్రంథాలుగా నిలుస్తున్నాయి. 1957లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ అవార్డును ప్రదానం చేయడం, ఆయన ప్రతిభకు ప్రభుత్వ స్థాయిలో గౌరవాన్నిచ్చిన సంఘటన. ఆయన మద్రాసు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్, వివిధ దేశీయ, అంతర్జాతీయ చరిత్ర సదస్సుల్లో ప్రాతినిధ్యం వహించడం, చరిత్ర శాఖలలో సలహాదారుగా పనిచేయడం ఆయన ప్రాభవాన్ని సూచించే ఉదాహరణలు. 1975 జూన్ 15న ఆయన పరమపదించారు. అయితే ఆయన రచనలు భారత చరిత్రారచనలో శాశ్వత దీపశిఖలుగా మిగిలిపోయాయి. చరిత్రను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలంటే, నీలకంఠ శాస్త్రి రచనలు మార్గదర్శకంగా ఉపయోగపడతాయి. భారతీయ చరిత్రకు శాస్త్రీయ రూపమిచ్చిన మహానుభావుడిగా, దక్షిణ భారత చరిత్రను జాతీయ చరిత్రాంశంగా నిలబెట్టిన మేధావిగా ఆయన స్మరణీయుడిగా నిలిచిపోయారు. చరిత్ర అంటే కేవలం గడచిన యుగాల కథలు మాత్రమే కాదు %–% అది భవిష్యత్ నిర్మాణానికి ఉపాధి, విజ్ఞానం, మార్గదర్శనం. నీలకంఠ శాస్త్రి జీవితం, రచనలు ఈ వాక్యానికి నిదర్శనంగా నిలిచాయి. ఆయనను చరిత్రాపరంగా స్మరించుకోవడం అంటే, శాస్త్రీయతకు, పరిశోధనకు, సాంస్కృతిక చైతన్యానికి గౌరవం చెల్లించడమే. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# తండ్రి సంతానానికి మార్గదర్శకుడుగా ఉండాలి - అంతర్జాతీయ పితృ దినోత్సవం సందర్భంగా




ప్రతి సంవత్సరం జూన్ నెలలోని మూడవ ఆదివారం నాడు అంతర్జాతీయ పితృ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ వ్యాప్తంగా 52 దేశాలు తండ్రుల గౌరవార్థం ఈ దినోత్సవాన్ని పాటిస్తున్నాయి. అమెరికాకు చెందిన "సోనోరా స్మార్ట్ డాడ్" అనే మహిళ ఆలోచనకు సాకారంగా 1910లో మొదటిసారి "ఫాదర్స్ డే" ను గుర్తించి జరుపు కున్నారు. ఆ తరువాత అలా అలా ఈ నాన్నల "వందన దినోత్సవము"నకు ఆదరణ పెరుగుతూ వచ్చింది. ప్రపంచ దేశాలు 1972 నుంచి ప్రతి సంవత్సరం జూన్ లో వచ్చే మూడో ఆదివారాన్ని పితృ వందన దినోత్సవముగా ప్రకటించుకొని జరుపు కుంటున్నాయి. పితృదినోత్సవ సందర్భంగా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బాధ్యతాయుతులైన తండ్రులందరికి శుభాకాంక్షలు తెలుపు కోవడం ఒక సాంప్రదాయంగా మారింది. ఎండకు నీడలా.. వానకు గొడుగులా.. ఆకలికి అన్నంలా.. దాహానికి చెలిమలా.. చేనుకు కంచెలా.. ఇలా ఎన్ని విధాలుగా పోల్చినా నాన్న విలువ పెరుగుతుందే తప్ప కొలతలకు అందేది కాదు. అయితే ఇక్కడ ఉదహరించిన బాధ్యతాయుతులైన మంచి తండ్రులు. అంటే ఎవరు? వారెలా ఉంటారు? లేదా ఏమి చేస్తే మంచి తండ్రులవుతారో తెలుసుకోడానికి ఇదొక మంచి సందర్భం. అలా తెలుసుకునే ముందు అసలు బిడ్డ యొక్క పరిణామ క్రమపు ఆంత్రోపాలజీ ని గమనించడం విధాయకం. భూమి మీద పుట్టే ప్రాణి కోటిలో ఒక్క మానవ జాతిలోనే పుట్టిన బిడ్డకు కొన్ని సంవత్సరాల దాకా సంరక్షణ అవసరమవుతుంది. బిడ్డ పుట్టిన క్షణం నుంచి తొమ్మిది నెలల వయసు వచ్చేవరకు తల్లి ఒడిలోనే ఉండడం లేదా తల్లిని మాత్రమే గుర్తు పట్టడం జరుగుతుంది. ఆ సమయంలోనే బిడ్డను ఆడించడానికి, లాలించడానికి తల్లి వాడే పదాలు మాతృభాషగా పరిణామం చెందాయని పాలజిస్టులు చెపుతారు. అలా (భాషను) పదాలను ఉపయోగిస్తూ ఆదిమానవులు గుహలలో నివసించే కాలంలో, బిడ్డను తండ్రికి లేదా తండ్రిని బిడ్డకు పరిచయం చేసేది తల్లి. బిడ్డకు పరిసరాలను గుర్తించే వయసు వచ్చిన నాటినుండి, స్వతంత్రంగా జీవించే వయసు (ఆహారాన్ని సంపాదించుకునే వయసు) వచ్చేదాకా, ఆ తండ్రి బిడ్డకు సంరక్షకుడిగా, ఆహార సంపాదనకు అవసరమైన వేట నేర్పే గురువుగా ఉండేవాడు. మనిషి ఆటవిక దశనుంచి బుద్ధి జీవుడిగా మారిన క్రమంలో, బిడ్డ జీవితంలో ఒక్క తండ్రే కాక మరికొంత మంది ఆవశ్యకత ఏర్పడింది. చాణుక్యుడు ఉటంకించిన దానిని బట్టి ఎవరెవరిని తండ్రిగా గౌరవించాలో ఈ క్రింది విధంగా చెప్పబడింది.

**"అన్న భయత, యస్య కన్యా వివాహిత జనిత చౌపనేత చ, పంచైతే పితరః స్మృతః"**

1. అన్నదాత : ఆకలేసినపుడు అన్నం పెట్టి ప్రాణం నిలబెట్టిన వారు తండ్రిగా గౌరవింపదగిన వారు.
2. భయత్రాత : జీవితపు ప్రయాణంలో ఎదురయ్యే ధన, మాన, ప్రాణ హాని సమయంలో కాపాడినవారు తండ్రిగా గౌరవింప దగినవారు.
3. కన్యాదాత : ఒక వ్యక్తి (మగవాడు) తండ్రిగా మారగలిగే భాగ్యాన్ని కలిగించగలిగే కన్యను భార్యగా ఇచ్చిన వ్యక్తీ (మామగారు) తండ్రిగా గౌరవింప దగినవారు.
4. జనిత : జన్మనిచ్చిన/ ఉద్యోగమిచ్చిన/బ్రతుకు తెరువు నేర్పిన వారు తండ్రిగా గౌరవింప దగినవారు.
5. ఉపనేత : మంత్రోపదేశము చేసిన వారు/విద్యా బుద్ధులు నేర్పినవారు తండ్రిగా గౌరవింప దగినవారు.

పై వాటిలో ఒక్క కన్యాదానము తప్ప మిగిలిన అన్ని భాద్యతలను ఒకే వ్యక్తి ఏకకాలంలో నిర్వర్తించ గలిగితే వారే ఉత్తమ తండ్రులు. పిల్లలు శైశవ దశ నుంచి కౌమారము దాకా వినడం చదవడం ద్వారా కాక, అనుకరణ ద్వారా ఎక్కువ విషయాలు గ్రహిస్తారు అని, కౌమారము నుంచి యుక్త వయసు దాకా తాము ఇష్టపడే వారిని అనుసరిస్తారని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందరూ మానసిక శాస్త్రవేత్తలు అంగీకరించే విషయం. ఒకతరం నుంచి మరోతరం తాను పుట్టి పెరుగుతున్న కుటుంబం నుంచి అనుకరించేదే "జీన్స్" అని అనుకోవచ్చు. కుటుంబ పెద్దగా ఒక తండ్రి భాద్యతాయుతమైన నడవడిక తరువాతి తరానికి అలవాటు అవుతుంది అన్నది విశదమవుతోంది. కాలక్రమేణా మనిషి బుద్ధి జీవుడు అవుతున్నకొద్దీ బిడ్డకు జీవన విధానాన్ని నేర్పడంలోను, జ్ఞాన సముపార్జనలోను, బాధ్యతాయుతులైన పౌరులుగా మెలగడం లోనూ ఆ తండ్రి బిడ్డకు మార్గదర్శిగా ఉండడం మొదలయింది. తప్పటడుగులు వేస్తూ నడక నేర్చుకునే దశలో ఉన్న బిడ్డకు "సంరక్షకుడి"గా, విద్యార్జన అన్నది కష్టంగా కాక ఇష్టంగా మార్చే క్రమంలో "గురువు"గా, తప్పు చేసినపుడు దండించే దశలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటూ మంచిని ప్రభోదించి తప్పు చెయ్యడం వల్ల వచ్చే చెడు పరిణామాలను మాత్రమే తెలియజేసి సన్మార్గంలో నడిపించే దశలో "ప్రవచనకర్త"గా, యుక్తవయసులో జీవనోపాధికి అవసరమయ్యే విజ్ఞానాన్ని విపులీకరించే దశలో సమకాలీన "మిత్రుడి"గా, నడి వయసులో వచ్చే ఇబ్బందులను చాకచక్యంగా ఎదుర్కోవడంలో సలహానివ్వగలిగే "చతురుని"గా ఉంటూ ఒక మనిషి జీవన క్రమంలో తండ్రి పాత్ర అత్యంత కీలకం. అనగా తండ్రి తన సమయాన్ని పిల్లలకోసం వెచ్చించడం అన్నది ఖచ్చితంగా అవసరం. అందుకే ప్రపంచంలో ఏ గొప్ప వ్యక్తి చరిత్ర చూసినా, ఆ వ్యక్తి యొక్క తండ్రి తన సమయాన్ని పిల్లలతో గడుపుతూ వారిని, విజయం వైపు నడిపించడం చూస్తాం. అందువల్లనే అపర కుబేరులైనా, వారి వారసుల తండ్రులు ధనార్జనలో పడి, పిల్లలకోసం సమయాన్ని కేటాయించలేని తండ్రుల సంతానం, అందువల్లే కొంత శృతి తప్పిపోవడాన్ని ఈ మధ్య గమనిస్తున్నాం. బిడ్డలచే కీర్తించబడాలంటే ఆ తండ్రికి సహనము, సమయస్ఫూర్తి, సంయమనము మెండుగా ఉండాలి. అంతే కాక బిడ్డల కోసం ఖచ్చితంగా సమయాన్ని కేటాయించగలగాలి. తన ఇంటిలో బిడ్డల ఎదుగుదలకు అవసరమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచగలగాలి. తాను సమకూర్చలేని వాటిని గురించి ఏంతో సంయమనంతో బిడ్డలకు విశదికరించ గలగాలి. ఇవన్నీ అనుకున్నంత సులభంగా అలవడవు. కాబట్టే ప్రపంచంలో కొంతమందే మంచి తండ్రులు కాగలుగుతారు. మిగిలినవారు తండ్రులుగా మాత్రమే మిగిలిపోతారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## సంపాదకీయం

### బీజేపీ సంబరాల మీద నీళ్ళు చల్లిందా ?

దేశంలో బీజేపీ తొలిసారి అధికారంలోకి వచ్చి కేవలం 13 రోజులు మాత్రమే ఉంది. ఆ తరువాత 13 నెలలు, మరోసారి నాలుగున్నరేళ్ళు పాలించింది. అయితే పూర్తి టెర్మ్ ఫుల్ మెజారిటీతో బీజేపీ తన పాలన తొలిసారి పూర్తి చేసుకుంది నరేంద్ర మోడీ హయాంలోనే. 2014 నుంచి 2019 మధ్యలో అది సాధించింది. ఇక 2019 నుంచి 2024లో మరోసారి అంతకు మించిన మెజారిటీతో ఫుల్ టెర్మ్ పూర్తి చేసుకుంది బీజేపీ. ఇక 2024 ఎన్నికల్లో మూడవసారి ఫుల్ మెజరిటీకి కాస్తా దూరంలో ఉన్నా మిత్రపక్షాలు ఆదుకోవడంతో కేంద్రంలో మళ్ళీ మోడీ ప్రభుత్వం ఏర్పాటు అయింది. అలా 11 ఏళ్ల పాటు పాలన బీజేపీది నిర్విఘ్నంగా సాగుతూ వస్తోంది. దాంతో ఈ నెల 9 నుంచి 11 ఏళ్ళ బీజేపీ పాలన మీద దేశవ్యాప్తంగా సంబరాలు స్టార్ట్ అయ్యాయి. డెబ్బై రోజుల పాటు దేశం నలుమూలలలో బీజేపీ విజయాలను ఈ సందర్భంగా ప్రచారం చేయాలని ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించి ఆ ప్రకారం పార్టీ అంతా అలెర్ట్ అయి జనంలోకి వస్తోంది. ఈ విధంగా బీజేపీ సమరోత్సాహంతో ఉన్న వేళ అహ్మదాబాద్ నుంచి బయలుదేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ విమానం కేవలం 59 సెకన్ల వ్యవధిలోనే కుప్పకూలిపోవడం కనీ వినీ ఎరగని తీరులో ప్రమాదం జరగడం నిజంగా షాకింగ్ న్యూస్ గా మారింది. బీజేపీ ఉత్సాహంతో చేసుకుంటున్న వేడుకల మీద నీళ్ళు చల్లినట్లుగా ఈ దుర్ఘటన ఉందని అంటున్నారు. బీజేపీ ఆపరేషన్ సిందూర్ గురించి గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. అయితే దేశీయ విమానం అందులో ప్రఖ్యాత సంస్థకు చెందినది అయిన ఒక భారీ సాంకేతికత కలిగిన విమానం ఇలా కుప్ప కూలడం 250 మంది దాకా మరణించడం అంటే ఇది ప్రపంచమే ఉలిక్కి పడేలా చేసింది అని అంటున్నారు. అతి పెద్ద విమాన ప్రమాదాలలో ఒకటిగా ఇది నిలిచింది అని అంటున్నారు. దీంతో ఈ పెను ప్రమాదం దేశీయ విమానయాన రంగం మీద పెను ప్రభావం చూపిస్తోంది. అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తున్నామని చెప్పుకుంటున్న వేళ ఎక్కడ చూసినా విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తూ మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేస్తున్న సందర్భంలో జరిగిన ఈ ఘోరకలి అందరినీ ఆలోచనలో పడేస్తోంది. అంతే కాదు భద్రతాపరమైన సందేహాలను తావు ఇస్తోంది అని అంటున్నారు. ఒక ప్రఖ్యాత సంస్థ నడిపే విమానాలు అంతర్జాతీయంగా నిత్యం పదుల సంఖ్యలో నడిచే విమానాలు ఉన్న నేపథ్యంలో ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరిన సెకన్ల వ్యవధిలో కుప్ప కూలడం అంటే భద్రతాపరమైన తనిఖీల మీదనే నిపుణుల నుంచి సందేహాలు వస్తున్నాయని అంటున్నారు. సరే దాని మీద పూర్తి నివేదికలు దర్యాప్తులు జరిగిన తరువాత చర్యలు ఉండొచ్చు. కానీ బీజేపీ 11 ఏళ్ళ పాలన మీద ఉత్సాహపూరితంగా సాగుతున్న కార్యక్రమాలకు మాత్రం కొంత ఉత్సాహం తగ్గించేలా ఈ దుర్ఘటన జరిగింది అని అంటున్నారు.

# చిరు ప్రాయంలోనే ప్రజాదరణ పొందిన సంగీత దర్శకుడు చక్రి - జూన్ 15... చక్రి జయంతి



ఆత్మ విశ్వాసం, స్వయంకృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అనడానికి సంగీత దర్శకుడు చక్రి జీవితం ఒక ఉదాహరణ. చక్రి అలియాస్ చక్రధర్ జిల్లా (1974 జూన్ 15 – 2014 డిసెంబర్ 15) తెలుగు చలనచిత్ర సంగీత దర్శకుడు, రచయిత, గాయకుడు, నటుడు. జూన్ 15, 1974న వరంగల్ మహబూబాబాద్ మండలం కంబాలపల్లిలో జన్మించారు. చక్రికి సంగీత జ్ఞానం అబ్బదానికి కారణం తల్లిదండ్రులే, ఉపాధ్యా యుడైన చక్రి తండ్రి వెంకట నారాయణ కళాకారుడు కూడా. బుర్రకథలు స్వయంగా రాసుకొని ప్రదర్శించే వారు. చక్రి తల్లి విద్యావతి గాయని చిన్నప్పట్నుంచీ చక్రి బాగా పాడేవారు. కొడుకు మనోభీష్టాన్ని గౌరవించి తల్లిదండ్రులు కూడా బాగా ప్రోత్సహించారు. కంబాలపల్లిలో పదవ తరగతి వరకూ చదువుకున్న చక్రి... అక్కడే ఫ్లూట్ నేర్చుకున్నారు ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకూ మహబూబాబాద్లో చదువుతూ.. అక్కడే వయోలిన్, కర్ణాటక సంగీతం అభ్యసించారు అప్పట్లో మహబూబా బాద్ చుట్టుపక్కల ఎలాంటి కార్యక్రమాలు జరిగినా... చక్రి సంగీత విభావరి ఉండాల్సిందే. చక్రి ట్రూప్ పేరు 'సాహితీ కళాభారతి'. చక్రిని టీచర్ చూడాలనేది తండ్రి ఆకాంక్ష. కానీ... చక్రికి మాత్రం ఉద్యోగాలపై ఆసక్తి ఉండేది కాదు. ఒకరి ముందు చేతులు కట్టుకొని నిలబడలేను అంటూ నిర్మొహ మాటంగా చెప్పేవారు. స్నేహితుల ఒత్తిడి వల్ల చివరకు హైదరాబాద్ బస్సెక్కారు చక్రి. హైదరాబాద్ మహానగరంలో ఏం చేయాలో తెలీక చివరకు పదివేలు ఖర్చు పెట్టి పండు వెన్నెల అనే మ్యూజిక్ ఆల్బమ్ చేశారు. పేరైతే వచ్చింది కానీ... డబ్బులు మాత్రం రాలేదు. భుక్తి కోసం ప్రైవేటు ఉద్యోగాలు కూడా చేశారు. ఖాళీ దొరికినప్పుడల్లా ఏదో ఒక ప్రైవేటు ఆల్బమ్స్ చేస్తుండేవారు చక్రి. అలా... మూడేళ్లల్లో 30 మ్యూజిక్ ఆల్బమ్స్ చేశారు. చక్రి జీవితంలో మేలి మలుపు 'చిరునవ్వు ' మ్యూజిక్ ఆల్బమ్. సన ఆడియో వారు చిరంజీవి పుట్టినరోజు ప్రత్యేకంగా ఓ ఆల్బమ్ చేయాలనుకొని చక్రిని సంప్రదిం చారు. స్వతహాగా చిరంజీవి వీరాభిమాని అయిన చక్రి ఆ ఆల్బమ్ చేయడానికి అంగీక రించారు. చిరంజీవి పాత పాటలనే రీమిక్స్ చేసి, ఆల్బమ్ చేయాలనేది సన ఆడియో వారి ఆలోచన. అయితే... చక్రి తానే స్వయంగా రాసి, స్వర పరుస్తానని చెప్పి, 5 పాటలతో 'చిరునవ్వు' అల్బమ్ని రూపొందించారు. ఆ ఆల్బమ్ విన్న చిరంజీవి... చక్రిని ఎంతో మెచ్చు కున్నారు. చిరు పుణ్యమా అని చక్రికి సినిమా అవకాశాలు రావడం మొదలైంది. పూరి జగన్నాథ్ బాచి (2000) చిత్రంతో సంగీత దర్శకునిగా చక్రి సినీ సంగీత ప్రస్థానం మొదలైంది. ఏ సంగీత దర్శకుని వద్ద సహాయకుగా చేయకుండానే సంగీత దర్శకుడైన ఘనత చక్రికి దక్కుతుంది. ఆ తరువాత పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన అనేక చిత్రాలకు చక్రి దర్శకత్వం వహించారు. అంతకు ముందే పిల్లలు కాదు పిడుగులు చిత్రంలో ఒక పాటకు సంగీతం అందించారు. దేనికైనా రెడీ చిత్రంలోనూ 3 పాటలకు చక్రి సంగీతం అందించారు. సత్యం సినిమాకు ఉ త్తమ గాయకుడిగా చక్రి ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. 85 చిత్రాలకు చక్రి సంగీత దర్శకత్వం వహించారు. బాచి సినిమాతో సంగీత దర్శకుడిగా చక్రి తన కెరీర్ను ప్రారంభించారు. సింహా సినిమాకు చక్రి నంది అవార్డు అందుకున్నారు. చక్రి సంగీతం అందించిన చివరి చిత్రం ఎర్రబస్సు. ఇడియట్, అమ్మానాన్న తమిళ అమ్మాయి, సత్యం, శివమణి, దేశముదురు, గోపి గోపిక గోదారి, నేనింతే, మస్కా సరదాగా కాసేపు, చక్రం, ఆంధ్రావాలా, ఇట్లు శ్రావణి, భగీరథ, ఢీ, రంగ ది దొంగ చిత్రాలకు చక్రి సంగీత దర్శకత్వం వహించారు. చిన్న వయస్సులోనే చక్రి పలు హిట్సాంగ్స్ అందించారు. కొత్త గాయనీ, గాయకులు ఎంతో మందిని చక్రి టాలివుడ్కు పరిచయం చేశారు. శ్రీమన్నారాయణ, జై బోలో తెలంగాణ సినిమాలకు చక్రి సంగీతం అందించారు. తెలంగాణ మలిదశ తెలంగాణ ఉ ద్యమం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో వచ్చిన 'జై బోలో తెలంగాణ' చిత్రానికి ప్రత్యేక స్థానముంది. యావత్ తెలంగాణ జాతిని లక్ష్యం వైపుగా కార్యోన్ముఖుల్ని చేసింది. చక్రి కెరీర్లో చేసిన చిత్రాలన్నీ ఓ ఎత్తయితే 'జై బోలో తెలంగాణ' చిత్రం ఒక ఎత్తుగా భావించ వచ్చు. భక్తి సంగీతం సమకూర్చిన సినిమాల్లో అత్యంత ప్రజాధారణ పొందినవి.. ఇడియట్, అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి, సత్యం. తెలుగులోనే కాక తమిళం, కన్నడంలో కూడా చక్రి సంగీతం సమకూర్చాడు. ఆయన సంగీతం అందించిన చివరి చిత్రం విష్ణు మంచు, కేథరీన్ థెరీసా హీరో హీరోయిన్లుగా నటించిన ఎర్రబస్సు. గాయకునిగా కూడా దాదాపు 150 పాటలు పాడారు చక్రి. సత్యం సినిమా కోసం ఆయన పాడిన 'ఓ మగువా నీతో స్నేహం కోసం... 'పాటకు గాయకునిగా ఫిలింఫేర్ అవార్డు అందుకోగా, సింహాకి సంగీత దర్శకునిగా నంది అవార్డు అందుకున్నారు చక్రి. సత్యం, ఎవరైతే నాకేంటి, రంగ ది దొంగ.. తదితర చిత్రాల్లో నటించారు కూడా. చక్రి తండ్రి వెంకట నారాయణ స్ఫూర్తితో తన పుట్టిన రోజైన 'జూన్ 15 'ను వివిధ సేవా కార్యక్రమాలతో జరుపుకునే వారు. రక్తదానాలు, అన్నదానాలు, పండ్ల పంపిణీ చేసే వారు. ప్రేమ, ఆధ్యాత్మిక, విషాద గీతా లైనా సంగీతాన్ని స్వరపరిచి సంగీత ప్రియులకు చిరకాలం గుర్తుండి పోయేలా సంగీతంలో తనకంటూ ఒక ట్రేడ్ మార్క్ కలిగిన చక్రి డిసెంబర్14 రాత్రి చక్రికి గుండె పోటు రావడంతో అపోలో ఆసుపత్రి లో చేరి, 2014, డిసెంబర్ 15న తుదిశ్వాస విడిచారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఆధునిక కవిత్వ మార్పులకు ఆద్యుడు శ్రీ శ్రీ - జూన్ 15 మహాకవి శ్రీ శ్రీ వర్ధంతి




ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావుగా లబ్ద ప్రతిష్టులైన శ్రీశ్రీ (ఏప్రిల్ 30, 1910 %-% జూన్ 15, 1983). విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వారిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షులుగా, సినిమా పాటల రచయితగా ఆయన సుప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది, నాస్తికులు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందారు. నేను సైతం ప్రపంచాగ్నికి సమిదనొక్కటి ఆహుతిచ్చానని గర్జించిన.. విప్లవ కవి.. సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన మహాకవి. తెలుగు పాటకు కావ్య గౌరవం కల్పించిన మహాకవి. తెలుగు పాటకు తొలిసారి జాతీయ స్థాయిలో అవార్డు తెచ్చిన మహనీయుడు. శ్రీశ్రీ పుట్టిన దినం గురించి, ఫిబ్రవరి 1, 1910 న జన్మించానని ఆయన విశ్వసించినా, పరిశోధకులు కొందరు 1910 ఏప్రిల్ 15న జన్మించారని పేర్కొన్నా, విశాఖపట్నం పురపాలక సంఘం వారు ఖరారు చేసిన తేదీనే 1910 ఏప్రిల్ 30 అని విరసం వారు స్పష్టీకరించారు. శ్రీరంగం సూర్య నారాయణకు దత్తుడగుట వలన ఇతను ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నంలో చేసారు. 1925లో ఎస్ ఎస్ ఎల్ సీ వుత్తీర్ణుడు అయినారు. అదే సంవత్సరం వెంకట రమణమ్మను పెళ్ళి చేసుకున్నారు. 1931 లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బియ్యే (జంతుశాస్త్రము) పూర్తి చేసారు. 1935లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎస్ కాలేజీలో డిమాన్ స్ట్రేటరుగా చేరారు. 1938లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీ లో, మిలిటరీలో, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుండి 1940 వరకు ఆయన రాసిన మహా ప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి మహా ప్రస్థానం అనే పుస్తకంగా ప్రచురించారు. తెలుగు సాహిత్యపు దశనూ, దిశనూ మార్చిన పుస్తకం అది. 1947లో మద్రాసుకు తిరిగి వచ్చి అక్కడే స్థిరపడ్డారు. తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ మరిన్ని గొప్ప రచనలు చేసారు. ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు రాసారు. 1949లో ఒక బాలికను దత్తత తీసుకున్నారు. 1956లో సరోజను రెండవ భార్యగా వివాహ మాడారు. 1955 సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్టుల తరఫున శ్రీశ్రీ చురుగ్గా ప్రచారం నిర్వహించారు. హనుమాన్ జంక్షన్లో ఒక ప్రచార సభలో, ఆయన ఆరోగ్యం దెబ్బతిని, కొన్ని నెలల పాటు ఆసుపత్రిలో ఉండవలసి వచ్చింది. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో, శ్రీశ్రీ, వావిలాల గోపాలకృష్ణయ్యతో కలిసి, ఖమ్మంలో సమైక్య వాదాన్ని వినిపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. శ్రీ శ్రీ ఎన్నో పురస్కారాలు పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి "రాజా లక్ష్మీ ఫౌండేషను" అవార్డు తదితరాలు. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పనిచేసారు. 1970లో ఆయన షష్టిపూర్తి ఉత్సవం సందర్భంగానే అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. 18 వ ఏట 1928 లో "ప్రభవ" అనే కావ్య సంపుటిని ప్రచురించారు. 1950 లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైంది. మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షువర్షీయసి మొదలైన కవితల సంపుటి అది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవి చేసింది. తరువాత మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలు రచించారు. 1952 లో ప్రారంభమైన ఆయన సినీ గేయ ప్రస్థానం 1982 వరకు నిరాటంకంగా కొనసాగింది. దాదాపు 50 చిత్రాల వరకు సినీ సాహిత్యాన్ని అందించారు. తెలుగు వారిని ఉ ర్రూతలూగించిన ఎన్నో గొప్ప సినిమా పాటలను అయన రచించారు. అల్లూరి సీతా రామరాజు సినిమాకు రాసిన "తెలుగు వీర లేవరా.." అనేది శ్రీశ్రీ రాసిన ఆణిముత్యాల్లో ఒకటి. రెండవ భార్య సరోజతో కలిసి సినిమాలకు మాటలు రాసారు. తెలుగులో ఆహుతి డబ్బింగ్ సినిమా మాటలు పాటలు రాశారు. బి.విఠలాచార్యతో పరిచయం కలిగిగాక, అయన కన్నడలో తీసిన కన్యాదానం అనే సినిమాను తెలుగులో కూడా నిర్మించదలచి శ్రీశ్రీని రచయితగా నియమించుకున్నారు. శ్రీ శ్రీ మైసూరులో వుండి ఒక్కరోజులో 12 పాటలు వ్రాశారు. ఇది ప్రపంచ చలనచిత్ర లోకంలో ఒక రికార్డు! మనసున మనసై (డాక్టర్ చక్రవర్తి) హలో హలో ఓ అమ్మాయి (ఇద్దరు మిత్రులు) నా హృదయంలో నిదురించే చెలి (ఆరాధన) తెలుగువీర లేవరా (అల్లూరి సీతారామరాజు) పాడవోయి భారతీయుడా (వెలుగు నీడలు) శ్రీ శ్రీ గీతాలలో కలికి తురాయిలు. ప్రాసకూ, శ్లేషకు శ్రీశ్రీ పెట్టింది పేరు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీశ్రీ మేటి. "వ్యక్తికి బహువచనం శక్తి" అనేది అతను సృజించిన మహత్తర వాక్యమే! తెలుగు సాహిత్యంలో సామాన్యుడి కష్టనష్టాల గురించీ, పేదసాదల జీవితాలని ప్రతిబింబించే కవిత్వాన్ని రాసిన మొదటి కవిగా ఆయన ఆంధ్రులందరికీ చిరస్మరణీయుడు. తెలుగు సాహిత్యంలో ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. కదిలేదీ, కదిలించేదీ, పెనునిద్దర వదిలించేదీ, పరిపూర్ణపు బతుకిచ్చేదీ, కావాలోయి నవకవనానికి', అని ఎలుగెత్తి అభ్యుదయ కవిత్వపు నిజలక్షణాలన్నీ నిర్వచించాడు శ్రీ శ్రీ. కవిత్వాన్ని పాత పరిధులని దాటించి, కొత్త పరిధుల్లోకి దూకించాడు. గణబద్ధ ఛందస్సులకి స్వస్తి చెప్పి, అతి ప్రాచీనమయిన మాత్రాబద్ధ ఛందస్సులకి నూతన యవ్వనం ప్రసాదించాడు అనువదించినా, అనుసరించినా తనవైన శైలీ, గొంతూ ద్వారా శ్రీశ్రీ మహాకవిగా పరిణతి చెందాడు. అందుకు పాశ్చాత్య ఆధునిక రచయితల ప్రభావం ఎంతో దోహదం చేసింది. కమ్యూనిజం, సోషలిజం, సమానత్వం, సమసమాజ నిర్మాణం వంటివి శ్రీశ్రీ గారి ప్రధాన కవితా వస్తువులు. తెలుగే మన జాతీయ భాష కావాలనేది తన అభిమతం అన్నారు. ఇది భాషా దురభిమానంతో అంటున్న మాటకాదని, తెలుగు భారతదేశం అంతకీ జాతీయభాష కాగల అర్హత గలదని జె.బి.యస్.హాల్డేన్ అన్నారని, సంస్కృత పదాలను జీర్ణించుకున్న కారణంచేత, అటు ఉత్తరాదివారికీ, ద్రావిడ భాషా కుటుంబంలో ఒకటి కావడంవల్ల ఇటు దక్షిణాది వారికీ, తెలుగు నేర్చుకోవడం చాలా సులభమని హాల్డేన్ పండితుని వాదనతో శ్రీ శ్రీ ఏకీభవిస్తున్నా నన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నామమాత్రాలైన వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు - జూన్ 15... వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవం

కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయోవృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారతదేశములో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050నాటికి వీరిసంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. మనరాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టుకుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది. దేశములో నెలకొన్న పరిస్థితులవల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారము అవుతున్న రోజులివి. అదేక్రమము లో వృద్ధులపట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు పరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటమే కాకుండా




కొందరు శారీరక హింసకూ పాల్పడుతుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంపద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందుపరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొదించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్ముకు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్టంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోకపోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.

**"సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు"...** జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ నడుస్తోంది. వృద్ధుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నీరు సురక్షితమేనా!

గోదావరిఖని : ఏటా వర్షాకాలం వస్తూ వెంట అంటు వ్యాధులు, రోగాలను తీసుకురావడం సాధారణమైపోయింది. ఇందుకు ప్రధాన కారణం కలుషిత నీరు. వర్షాకాలం నేపథ్యంలో అందరూ తాగునీటి వనరుల నాణ్యతపై దృష్టి సారించాలి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మిషన్ భగీరథ పథకంతోపాటు స్థానిక సంస్థల ద్వారా చాలా గ్రామాల్లో తాగునీరు సరఫరా చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం శరవేగంగా సమాయత్తం కావాలి. జలాశయాలు, ట్యాంకులు, నల్లాల వద్ద నీటి నమూనాలను సేకరించి తప్పనిసరిగా పరీక్షలు చేయాలి. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ అయితే వెంటనే చర్యలు తీసుకోవాలి.

**ప్రజా కుళాయిలు**

గ్రామాల నుంచి నగరాల వరకు అనేక చోట్ల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రజా కుళాయిలను గాలికి వదిలేస్తున్నారు. వీటి నాణ్యత, పర్యవేక్షణ విషయాన్ని అధికారులు పూర్తిగా మరిచారు. మురికి వాడలు, బస్టాండ్ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. వీటి నుంచి సరఫరా అయ్యే నీటికి నాణ్యత పరీక్షలు చేయడం లేదు. ముఖ్యంగా పాఠశాలల కుళాయిల్లో నీటిని పరీక్షించాలనే బాధ్యతను అందరూ విస్మరించారు. నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థుల ఆరోగ్యం ప్రభావితమవుతుంది.

**లీకేజీల సమస్యలు**

నిర్లక్ష్య ధోరణితో, నాసిరకమైన సామగ్రితో పైపులైన్లు వేసి పూడ్చడంతో లీకేజీలు జరిగి నీరు కలుషితమవుతుంది. అధికలోతులో, డ్రైనేజీల లోపల వేసిన పైపులు లీకేజీకి గురైతే గుర్తించే అవకాశం ఉండదు. అటువంటి సందర్భాల్లో ఆ పైపుల నుంచి సరఫరా అయ్యే నీటిని తాగితే రోగాలకు ఆహ్వానం పలికినట్లే. వర్షాకాలంలో కలుషితమయ్యే నీటి వల్లే డయేరియా, టైఫాయిడ్, కామెర్లు, రకరకాల జ్వరాలు, వాంతులు, విరేచనాలు వస్తుంటాయి. ఇవి కొన్నిసార్లు వెంటనే తగ్గిపోయినా, మరికొన్ని సందర్భాల్లో ప్రాణాపాయ స్థితికి తీసుకెళ్తాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గ్రామ పంచాయతీ, మున్సిపలిటీ, కార్పొరేషన్‌లలోని సంబంధిత సిబ్బంది ఏటా నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేయాలి గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ అధికారులు పరీక్షలు నిర్వహించాలినీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలిఫిల్టర్ బెడ్‌లు, గృహాల వద్ద ఉండే నల్లాల నుంచి నమూనాలు సేకరించాలిలీకేజీ సమస్యలు ఉంటే మరమ్మతు చర్యలు తీసుకోవాలి వర్షాకాలమంతా ప్రతిరోజు క్లోరిన్ టెస్టు కిట్ల ద్వారా నాణ్యత స్థాయిని పరిశీలిస్తూ ఉండాలి

**నెలకు మూడు సార్లు శుద్ధి –** అరుణశ్రీ, పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ వంద రోజుల ప్రణాళికలో నీటి పరీక్షలు చేయడం ప్రత్యేకంగా చేర్చాం. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని ట్యాంకులను ప్రతినెల 1, 11, 21 తేదీల్లో మూడు సార్లు శుభ్రం చేయాలని ఆదేశించాం. గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ ఆయాలు, ఏఎన్ఎంలకు నీటి నమూనాలు సేకరించి పరీక్షలు చేసే విధానంపై శిక్షణ ఇచ్చాం.

# మహిళా శక్తి.. ఆర్థిక వృద్ధి

ధర్మారం: నేటి తరం మహిళామణులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సహకారం తోపాటు బ్యాంకు లింకేజీ, గ్రామ సంఘాల వద్ద ఆర్థిక వనరులు కూడగట్టుకున్న మహిళా సంఘాల ప్రతినిధులు.. క్యాంటీన్ల నిర్వహణతో స్వయం ఉపాధి పొందడంతోపాటు నాణ్యమైన భోజనం అందించడంలో సఫలమయ్యారు.

**పెరిగిన ఆత్మవిశ్వాసం**

ధర్మారానికి చెందిన మేడవేని లహరిది నిరుపేద కుటుంబం. ఇద్దరు పిల్లలు. కుటుంబ పోషణకు ఉపాధిహామీ, వ్యవసాయ పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల గురించి తెలుసుకొని.. నలుగురు స్థానిక మహిళలతో కలిసి క్యాంటీన్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాలతో ప్రధాన రహదారి పక్కనున్న మండల పరిషత్తుకు చెందిన రెండు దుకాణాలను.. అద్దె లేకుండా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ కేటాయించారు. ఓ వంట మనిషిని నియమించుకున్నారు. ఐదుగురు భాగస్వాములు నెలకు రూ.9 వేల



చొప్పున వేతనం తీసుకుంటున్నారు. దీంతో తమ కాళ్లపై తాము నిలబడేలా ఆత్మవిశ్వాసం పెరిగిందని లహరి చెబుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 15 వరకు**

ఆయా జిల్లా అధికారుల ప్రోత్సాహంతో పెద్దపల్లి జిల్లాలో 4, కరీంనగర్‌లో 3, సిరిసిల్లలో 3, జగిత్యాలలో 5 చొప్పున ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసుకున్నారు. అద్దె భారం పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. పెట్టుబడికి బ్యాంకు లింకేజీ, గ్రామ సంఘాల వద్ద రుణాలు తీసుకున్న నిర్వాహకులు.. సకాలంలో కిస్తులు చెల్లించడంతోపాటు క్యాంటీన్లకు వచ్చేవారి అభిరుచులకు తగ్గట్టుగా వేర్వేరు రకాల ఆహార పదార్థాలను అందిస్తున్నారు. ఆహార పదార్థాల తయారీకి కావాల్సిన బియ్యం, పప్పులు తదితర సరకులను స్థానిక రైతుల నుంచే సేకరిస్తున్నారు.

**ఆర్థికంగా ఎదుగుతున్నాం– గంగాధర ఉమ**

క్యాంటీన్ ప్రారంభించి ఎనిమిది నెలలు కావస్తోంది. ప్రారంభంలో నిర్వహణ కాస్త ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఆర్థికంగా ఎదుగుతున్నాం. వివిధ రకాల అల్పాహారం, భోజనం తయారు చేస్తున్నాం. అభిరుచులకు తగ్గట్టుగా వంటలు తయారుచేసి అందిస్తున్నాం. స్థానికంగా ఆదరణ బాగుంది. మండల పరిషత్తుకు చెందిన రెండు షట్టర్లను ఎలాంటి అద్దె లేకుండా జిల్లా కలెక్టర్ ఇప్పించారు.

**మెరుగైన శిక్షణ ఇప్పించాం– నాగేశ్వరరావు, డీపీఎం సెర్ప్, పెద్దపల్లి**

క్యాంటీన్లు నిర్వహిస్తామని ముందుకు వచ్చినవారికి సెర్ప్ ఆధ్వర్యంలో రెండు వారాలు శిక్షణ ఇప్పించాం. భోజనం, వివిధ రకాల వంటకాల తయారీపై నిపుణులతో శిక్షణ ఇచ్చాం. క్యాంటీన్‌కు వచ్చేవారితో వ్యవహరించాల్సిన తీరు, ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించాం. ప్రారంభించిన అన్నిచోట్లా విజయవంతంగా నడుస్తున్నాయి.

# ఈ-దాఖిల్‌కు మోక్షమెప్పుడో..?



హైదరాబాద్: రాజధాని పరిధిలోని వినియోగదారుల కమిషన్లలో సదుపాయాల లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సాంకేతిక బృందం, ఆధునిక ఉపకరణాలు లేక పాత పద్ధతిలోనే అర్జీలు తీసుకోవాల్సి వస్తోంది. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు విధానం 'ఈ–దాఖిల్' అమలుకు అవకాశమున్నా నిధుల మంజూరులో జాప్యంతో ఫిర్యాదు స్వీకరణతో పాటు విచారణపై ప్రభావం పడుతోంది. ఫలితంగా 90 రోజుల్లో కేసు పరిష్కరించే పరిస్థితి లేదు.

**వ్యయ, ప్రయాసలతో వెనకడుగు...**

రాజధానిలో సేవాలోపాలపై రోజూ 5–10 ఫిర్యాదులు 4 జిల్లా కమిషన్లలో నమోదవుతున్నాయి. హైదరాబాద్ జిల్లావాసులైతే నాంపల్లి చంద్రవిహార్‌లోని వినియోగదారుల కమిషన్లలో, ఉమ్మడి రంగారెడ్డి జిల్లావాసులైతే ఎల్బీనగర్‌లోని కమిషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. జిల్లా కమిషన్లు దూరంగా ఉండటంతో అక్కడివరకు వెళ్లాలా? అని అనేక మంది వెనకడుగు వేస్తున్న పరిస్థితి. హైదరాబాద్‌లోని సంస్థలపై ఫిర్యాదు చేస్తున్న ఇతర రాష్ట్రాలవాసులు వర్చువల్ విచారణ చేపట్టాలంటూ విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.


**మోసపోయి గగ్గోలు..**

ఈ–దాఖలు విధానం ఇక్కడ అమలవుతోందంటూ జరుగుతున్న ప్రచారంతో కొందరు నకిలీ వెబ్‌సైట్లలో వివరాలు నమోదుచేస్తున్నారు. రుసుములు చెల్లించి ఫిర్యాదు చేయగా..స్పందన లేకపోవడంతో మోసపోయినట్టు గ్రహించి లబోదిబోమంటున్నారు. కన్జ్యూమర్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసినా తదుపరి ప్రక్రియ పూర్తి చేసే పరిస్థితి లేదు. ఒకసారి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదైన వెంటనే సాంకేతిక బృందం నంబర్ కేటాయిస్తారు. అనంతరం విచారణ ప్రారంభమవుతుంది.

**నిధుల మంజూరులో జాప్యం**

ఈ–దాఖిల్ విధానం అమలుకు రెండేళ్ల క్రితమే కమిషన్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలందాయి. నిధుల మంజూరులో జాప్యం జరుగుతోందంటూ సిబ్బంది చెబుతున్నారు. ఆన్‌లైన్ విధానం అమలుకు హైదరాబాద్‌లోని మూడు జిల్లా కమిషన్లు, రంగారెడ్డి జిల్లా కమిషన్‌లో ఐదుగురు చొప్పున సాంకేతిక బృందం అవసరం. 15 అధునాతన కంప్యూటర్లు, డేటాను నిక్షిప్తం చేసే వ్యవస్థ ఏర్పాటుచేయాలి. సర్వర్ గదులు, సిబ్బందిని నియమించాలి.

# ఒప్పిస్తారా.. పారిశ్రామికవాడ రప్పిస్తారా?



బొంరాస్‌పేట : కొడంగల్ నియోజకవర్గంలో బహుళ పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణ కొలిక్కి వస్తోంది. దుద్యాల మండలం పోలేపల్లి, హకీంపేట, లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండాల్లో భూమిని సేకరించాలని నిర్ణయించి భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. పరిశ్రమలొస్తే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పలువురు రైతులు స్వచ్ఛందంగా తమ భూములను ప్రభుత్వానికి అప్పగించారు. పోలేపల్లి మినహా మిగతా గ్రామాల్లోని కొందరు అన్నదాతలు మాత్రం సమ్మతించడంలేదు. రోటిబండ తండాలోని 40 ఎకరాలు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. వారిని ఒప్పించడం ఎలాగని అధికారులు, ప్రజా ప్రతినిధులు తర్జనభర్జన పడుతున్నారు.

**శంకుస్థాపన వాయిదా**

మెజార్టీ రైతులు భూములివ్వడంతో పారిశ్రామికవాడ ఏర్పాటుకు జూన్ 2వ తేదీన శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. పూర్తిస్థాయిలో భూ సేకరణ పూర్తికాకుండా శంకుస్థాపన చేస్తే భవిష్యత్తులో ఏవైనా ఆటంకాలు వస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని విరమించుకున్నట్లు తెలిసింది. మొదట్లో ఔషధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రకటించి భూ సేకరణకు ప్రయత్నిస్తే రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైన విషయం విదితమే. దీంతో ప్రభుత్వం పారిశ్రామిక వాడ వైపు మొగ్గింది. ఎకరాకు రూ.20 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇల్లు, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ప్రకటించడంతో పలువురు తమ పొలాలను అప్పగించారు.

**రెండు మూడు నెలల్లో పూర్తి చేస్తాం:** ఇంకా భూమి ఇవ్వని రైతులను ఒప్పించి రెండు మూడు నెలల్లో భూ సేకరణ పక్రియ పూర్తిచేస్తాం. – కిషన్ నాయక్, తహసీల్దార్, దుద్యాల.

**రూ.95.20 కోట్ల పరిహారం**స్వచ్ఛందంగా భూములిచ్చిన అన్నదాతలకు ప్రభుత్వం రూ.95.20 కోట్ల పరిహారం అందించింది. పోలేపల్లిలో 71.39 ఎకరాల అసైన్డ్ భూమి సేకరించారు. హకీంపేటలో 351.10 ఎకరాల అసైన్డ్ భూమికిగాను 200 ఎకరాలు, 146.34 ఎకరాల పట్టా భూమిలో 120 ఎకరాలు ఇచ్చారు. లగచర్లలో 110.32 ఎకరాల అసైన్డ్ భూమిలో 75 ఎకరాలు ఇవ్వడానికి సమ్మతించారు. ఈ గ్రామంలో 497 ఎకరాల పట్టా భూమికి 190 ఎకరాలు ఇవ్వడానికి రైతులు ఒప్పంద పత్రాలు అందజేశారు.

**భూసేకరణ గణాంకాలు**

సేకరించాల్సిన భూమి: 1177.35 ఎకరాలు
అసైన్డ్ భూమి: 532.81
పట్టా భూములు: 643.34
సేకరణ పూర్తయింది: 900కుపైగా ఎకరాలు.
సేకరించాల్సింది: 200 ఎకరాలకుపైగా
అందజేసిన పరిహారం: రూ.95.20 కోట్లు

# అవాంతరాలు అధిగమిస్తేనే.. స్వశక్తి



పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోంది. ఆదాయం రెట్టింపు చేసేందుకు సౌర విద్యుత్తు ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించడంతోపాటు మహిళా శక్తి భవనాలను నిర్మించేందుకు ఆర్థిక చేయూతనిస్తోంది. అయితే భవనాల నిర్మాణం చాలా చోట్ల ప్రారంభ దశకే పరిమితమైంది. గడువులోపు నిర్మాణాలు పూర్తి చేయడం ప్రశ్నార్థకంగా మారింది. ఇకనైనా పనుల్లో వేగం పెంచితేనే ప్రగతి సాధ్యం కానుంది.

ప్రతి జిల్లాకు రెండు సౌర విద్యుత్తు ప్లాంట్లు మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వ భూములను గుర్తించారు. ఒక్కో చోట రెండు మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కానుంది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి, కాల్వశ్రీరాంపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ముష్టిపల్లి, కోనరావుపేట మండలం ధర్మారం, జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం తాటిపల్లి, పెగడపల్లి మండలం నందగిరి, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దత్తోజిపేట, వీణవంక మండలం గన్ముకులలో స్థలాలను ఎంపిక చేశారు. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.ఉమ్మడి జిల్లాలో పెట్రోలు బంక్‌ల నిర్మాణం ప్రక్రియ స్థలాల గుర్తింపునకే పరిమితమైంది. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పక్కన, కరీంనగర్ జిల్లాలో జింకల పార్కు, అంబేడ్కర్ స్టేడియం ప్రాంతాల్లో స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ స్థల ఎంపిక కొలిక్కి రావాల్సి ఉంది. జగిత్యాల పట్టణం, సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో స్థలాలు ఎంపిక పూర్తయింది. ఆయిల్ కంపెనీలు ఆమోదిస్తే పనులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో మహిళా శక్తి భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా రాఘవపూర్‌లో పనులు ప్రారంభించలేదు. జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంప్‌లో పునాది దశలో, సిరిసిల్ల ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా పిల్లర్ల వరకు పనులు కొసాగుతున్నాయి. ఒక్కో భవనానికి రూ.5 కోట్లు కేటాయించగా ఆశించిన స్థాయిలో ప్రగతి కనిపించడం లేదు.

**ఇలా సాగితే గడువులోపు గగనమే**

సౌర విద్యుత్తు, పెట్రోల్ బంక్‌ల ప్రారంభానికి గడువు ఇంకా నాలుగు నెలలు కూడా లేదు. ఇప్పటికీ పనులకు శ్రీకారం చుట్టకపోవడంతో గడువులోపు పూర్తికావడం కష్ట సాధ్యమే. వానాకాలం కావడంతో వర్షాలు కురిసే సమయంలో పనులు ముందుకు సాగడం కష్టమవుతుంది. అధికారులు భూములు గుర్తించిన ప్రాంతంలో పనులు ప్రారంభించడానికి వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పెట్రోల్ బంక్‌ల నిర్మాణానికి ఆయిల్ కంపెనీల నుంచి సత్వరమే అనుమతి వచ్చే విధంగా చూడటంతోపాటు సౌరవిద్యుత్తు ప్లాంట్లకు బ్యాంకర్ల నుంచి రుణం ఇప్పించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలి. మహిళా శక్తి భవనాల నిర్మాణానికి వర్షాలు అడ్డంకిగా మారే అవకాశాలున్నాయి. ఈ ఇబ్బందులు తలెత్తకుండా పనులు వేగిరం చేస్తేనే గడువులోగా పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

**యూనిట్ల నిధుల వివరాలు**

మహిళా శక్తి భవనం : రూ. 5 కోట్లు
సౌర విద్యుత్తు యూనిట్లు : ఒక్కో మెగావాట్‌కు రూ. 3.50 కోట్లు
పెట్రోల్ బంక్ : రూ. 35 లక్షలు

# ఉద్యోగాల ఎర.. మోసగాళ్ల దగా

ఆదిలాబాద్ : ప్రభుత్వ ఉద్యోగాలపేరిట కొందరు మోసగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారు. తమకు ఉన్నత స్థాయిలో అధికారులు తెలుసని, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి దగా చేస్తూ రూ.లక్షల్లో కాజేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నేరుగా ప్రకటనలు ఇచ్చి అర్హత పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఉన్న వారికి మాత్రమే ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపడుతుంది. కొందరు ఇలాంటి మోసగాళ్ల బారిన పడి అత్యాశతో డబ్బులను ఇచ్చి నిండా మునుగుతున్నారు. తర్వాత మోసం తెలిసి లబోదిబోమంటున్నారు. కొందరు ఫిర్యాదు చేయడానికి వెనుకాడటం మోసగాళ్లకు కలిసొస్తోంది.

**సచివాలయంలో అందరూ తెలుసని..**

రాష్ట్ర సచివాలయంలో తనకు తెలిసిన అధికారులున్నారని, ఆబ్కారీ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నకిలీ గుర్తింపు కార్డు, నియామక ఉత్తర్వులు అందజేసి పలువురిని మోసం చేసి రూ.80 లక్షల వరకు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి మోసం చేశాడు. ఆసిఫాబాద్ పట్టణంలోని ఒక బాధితుడు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో మోసం వెలుగుచూసింది. బాధితుడి కూతురికి ఉద్యోగం ఇప్పిస్తానని అతడు రూ.7.05 లక్షలు వసూలు చేశాడు. నకిలీ ప్రొసీడింగ్



కాపీలిచ్చాడు. సదరు వ్యక్తి ఆదిలాబాద్ పట్టణంతో పాటు మంచిర్యాల, నిర్మల్ ప్రాంతాల్లోనూ ఇదే విధంగా మోసం చేసినట్లు తెలిసింది.

**రూ.లక్ష తీసుకొని..**

డీఆర్‌డీఓలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పోతుపల్లి ప్రశాంత్ రూ.రెండు లక్షలకు బేరమాడి రూ.ఒక లక్ష తీసుకున్నాడు. ఏడాది దాటినా ఉద్యోగం ఇప్పించకపోవటంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించటంతో ఫిబ్రవరిలో కేసు నమోదైంది. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

**తహసీల్దార్ కార్యాలయంలో కొలువంటూ..**

పట్టణానికి చెందిన అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తి కుమారులిద్దరికి ఎమ్మార్వో కార్యాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఖానాపూర్‌కు చెందిన జావిద్‌ఖాన్ అనే నిందితుడు రూ.రెండు లక్షల చొప్పున మొత్తం రూ.నాలుగు లక్షలు తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగాలు ఇప్పించకపోగా అడిగితే బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

# నిబంధనలు బలాదూర్.. అక్రమాలే బరాబర్

ఆదిలాబాద్ : చేయితడిపితేచాలు నిషేధిత భూముల్లోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసేస్తారు. నిరభ్యంతరపత్రంలేని అసైన్డ్ భూముల్లోని ప్లాట్లను ఆమోదిస్తారు. చివరకు ఏజెన్సీ ప్రాంతంలోనూ ఆస్తులను గిరిజనేతరులపేరిట రిజిస్ట్రేషన్ చేసేస్తారు. ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారింది. ఇటీవల ఓ సబ్‌రిజిస్ట్రార్‌పై ఆశాఖ ఉన్నతాధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఈ కార్యాలయ వ్యవహారం మరోమారు చర్చనీయాంశంగా మారింది. అనధికారిక లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వం 2020 ఆగస్టునుంచే లేఅవుట్లపై నిషేధం విధించింది. లింకు డాక్యుమెంట్లు ఉన్న ప్లాట్లు అంటే ఒకసారి రిజిస్ట్రేషన్ చేసిన వాటినే ఆమోదించాలని ఆదేశాలున్నాయి. లేకపోతే డీటీసీపీ అనుమతి ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయాలి. ఇక్కడ మాత్రం అలాంటి నిబంధనలేమి పట్టించుకోవడం లేదు. 2020 కంటే ముందున్న లేఅవుట్‌లో పదిశాతం రిజిస్ట్రేషన్ జరిగితే మిగతా ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించగా కొత్త అక్రమ లేఅవుట్‌లకు సైతం ఎల్ఆర్ఎస్ తీసుకొని రిజిస్ట్రేషన్ చేస్తుండటం గమనార్హం.

**కొన్ని అక్రమాలను పరిశీలిస్తే..**

జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ శివారు సర్వే నెం.68లో 535 ఎకరాల పైచిలుకు భూమి ఉంది. అది వక్ఫ్‌బోర్డ్ భూమి అని రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. తీరా నిర్మల్‌జిల్లా పరిధిలోకి వచ్చే ఖానాపూర్ శివారులోని భూమి అని రెవెన్యూ అధికారులు గుర్తించి నివేదించారు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాక నిషేధిత జాబితాలోనే ఆ సర్వే నెంబరు ఉంచాల్సి వచ్చింది. అధికారులు మాత్రం ఒకటి రెండు ప్లాట్లు గుట్టు చప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేసేశారు.

మావల శివారు సర్వే నెం.170 పరిధిలోని రెండు ఎకరాల్లో అసైన్డ్



భూమికి ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) రాదు. అధికారులు మాత్రం అందులోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయడంతో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.మావల శివారులోని సర్వే నెం.181 పరిధిలో 5 ఎకరాల భూమికి ఎన్‌ఓసీ లేకున్నా ఆ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేశారు. అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఏజెన్సీ ఏరియాలో నివాసాలు (భవనాల)కు రిజిస్ట్రేషన్ చేయరాదని నిబంధనలున్నాయి. ఆదిలాబాద్ మండలంలో ఏజెన్సీ పరిధిలోకి వచ్చే యాపల్‌గూడలో ఇంటి నెంబరుతో గిఫ్ట్ సెటిల్‌మెంట్ పేరిట తండ్రి నుంచి కుమారుడికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇది తప్పని తెలిసినా సంబంధిత సబ్‌రిజిస్ట్రార్‌పై ఉన్నతాధికారుల దర్యాప్తు లేదు.

ఖానాపూర్ శివారు పరిధిలోకి వచ్చే సర్వే నెం.68లో ఇటీవల ఏకంగా 40 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయడం దుమారం రేపింది. పైగా ఇరువురి మధ్య కేసులున్నా దర్జాగా రిజిస్ట్రేషన్ చేయడం.. అసలు పట్టాదారు వచ్చి ఫిర్యాదు చేయడంతో తప్పు సరిదిద్దుకునే పనిలో అధికారులున్నారు. ఆ రిజిస్ట్రేషన్లు చెల్లుబాటు కావని చెబుతున్నా బాధ్యులపై మాత్రం చర్యల్లేవు.

# బాల్యం బందీ

హైదరాబాద్: మహానగరంలో బాలకార్మికుల వ్యవస్థ కొనసాగుతూనే ఉంది. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో దాడులు చేసిన ప్రతి సారి వారిని గుర్తిస్తున్నారు. పటిష్టమైన చట్టాలున్నా... బాలలతో పనిచేయించుకోవడం చట్ట విరుద్ధమైనా ఏటా వేల సంఖ్యలో వారిని గుర్తిస్తుండటం గమనార్హం. హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల పరిధుల్లో ఏటా వేలమంది బాలకార్మికులను గుర్తించి వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చడం లేదంటే సీసీఐ హోంలకు చేరుస్తున్నారు. బాలలతో పాటు బాలికలు కూడా కార్మికులుగా మగ్గుతుండటం గమనార్హం. 14 ఏళ్లలోపు బాలలతో పనిచేయించుకోవడం నిషేధమైనా యధావిధిగా వివిధ పనులకు వారిని ఉపయోగించుకుంటున్నట్లు పోలీసుల ప్రత్యేక దాడుల్లో బయటపడుతున్నాయి. బాలకార్మిక వ్యతిరేక దినం సందర్భంగా కథనం.

**ప్రత్యేక కార్యక్రమాలు**

గతేడాది అక్టోబర్ 21 నుంచి నవంబరు 20 వరకు ఉమెన్ సేఫ్టీ



వింగ్ 66 మంది బాలకార్మికులను కాపాడింది.

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గతేడాది 1507 మందిని గుర్తించి విముక్తి కలిగించారు. వారిలో 1187 మందిని తల్లిదండ్రులకు అప్పగించారు. మరో 320 మందిని సీసీఐ హోంలో చేర్పించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 2024లో ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్‌లో 613 మందిని గుర్తించగా అంతకుముందు ఏడాది 200 మందిని గుర్తించారు.

హైదరాబాద్ నగర పోలీసులు జువైనల్‌బ్యూరో, ఏహెచ్‌టీయూ విభాగాలతో కలసి ఆపరేషన్ స్మైల్‌లో 25 బృందాలు తనిఖీలు చేసి 632 మంది బాలకార్మికులకు విముక్తి కలిగించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో 524 మంది బాలలను సంరక్షించారు.

తెలంగాణ కార్మికశాఖ 37.70 లక్షల జరిమానా విధించి కేసులు నమోదు చేసింది. గతేడాది ఫిబ్రవరిలో ఆరురోజులపాటు జువైనల్ బ్యూరో బృందం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి హైదరాబాద్‌లో భిక్షాటన చేస్తున్న 155 మంది పిల్లలను సంరక్షించారు.

# హైదరాబాద్ మెట్రోలో చిల్లర కష్టాలు

హైదరాబాద్ : మెట్రోరైలు ఛార్జీల పెంపుతో కొత్త సమస్య వచ్చిపడింది. ఇదివరకు రూ.10, 15, 25.. గరిష్ఠంగా రూ.60 వరకు ఛార్జీలు ఉండేవి. రూ.5 నాణేల లభ్యతతో చిల్లర పెద్ద సమస్యగా ఉండేది కాదు. ఇటీవల ఛార్జీలు పెంచి, 10 శాతం రాయితీ అనంతరం ధరలు రూ.11, 17, 37, 56... రూ.69కి సవరించారు. తగ్గింపుతో ఊరట లభించినా... చిల్లర లేక ప్రయాణికులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కార్డు, ఆన్‌లైన్ చెల్లింపులు చేసే ప్రయాణికులకు సమస్య



లేదు. నగదు చెల్లించి టికెట్ కొనేవారికి చిల్లర సమస్యలు ఎదురవుతున్నాయి. మెట్రోలోని మరుగుదొడ్ల వద్ద ఇదే ఇబ్బంది తప్పడం లేదు. చిల్లర లేక నిర్దేశిత మొత్తం కంటే అధికంగా తీసుకుంటున్నారని వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. టీ సవారీ యాప్, ఇతర ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుని కార్డు రీఛార్జ్ చేసుకునే వారినీ తరచూ సాంకేతిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయి. టాపప్‌చేసినా ఆ మొత్తం కార్డులో చూపించడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి.

# విద్యుత్తు అమ్మకం.. పెరగనున్న ఆదాయం

గోదావరిఖని: సింగరేణి సంస్థ మిగులు విద్యుత్తు అమ్మకానికి అనుమతులు రావటంతో ఆర్థిక వనరులు పెరగనున్నాయి. సంస్థ మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో నిర్మించిన విద్యుత్తు కేంద్రం నుంచి 1200 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. ఇందులో రాష్ట్రానికి సరఫరా చేయగా మిగులు విద్యుత్తు ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్‌లో అమ్ముకోవడానికి అనుమతులు వచ్చాయి. సింగరేణి జైపూర్‌లో 600 మెగావాట్ల రెండు యూనిట్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ అవసరాల మేరకే ఉత్పత్తి చేస్తోంది. సామర్థ్యం పెంచుకోవటానికి అవకాశం ఉన్నప్పటికీ విద్యుత్తు విక్రయానికి ప్రభుత్వం నుంచి ఇన్నిరోజులు అనుమతి రాలేదు. తాజాగా రావటంతో సింగరేణి దేశవ్యాప్తంగా అవసరమున్న రాష్ట్రాల గ్రిడ్‌లకు విద్యుత్తు సరఫరా చేయవచ్చు.

**పేరుకుపోయిన బకాయిలు**

సింగరేణి విద్యుత్తును రాష్ట్ర ప్రభుత్వానికి సరఫరా చేస్తున్నా ఆదాయం రావటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యుత్తు బిల్లులు పేరుకుపోయాయి. ఇప్పటివరకు సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్తు సరఫరా సంస్థ రూ.వేల కోట్లు బకాయి పడింది. సింగరేణి రాష్ట్ర అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్తు కేంద్రంలో రూ.6,700 కోట్లతో మరో 800 మెగావాట్ల ప్లాంటు నెలకొల్పేందుకు ప్రణాళికలు వేశారు. ప్రాజెక్టు నివేదికలు కూడా తయారు చేశారు. దీంతో మిగులు విద్యుత్తుతో పాటు ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది.

**సంప్రదింపులు షురూ..**

విద్యుత్తు డిమాండ్ ఉన్న వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో యాజమాన్యం సంప్రదింపులు జరుపుతోంది. రోజుకు 28 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసే సింగరేణి.. ఏటా 10 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంది. గత ఏడాది రాష్ట్రానికి 7,986.30 మిలియన్ యూనిట్ల విద్యుత్తును సరఫరా చేసింది. ఇంకా రెండు వేల మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఇతర రాష్ట్రాల అవసరం మేరకు ఉత్పత్తి చేయనుంది.

# వానొస్తే.. వణుకొచ్చినట్టె



హైదరాబాద్: ఈ ఏడాది మండు వేసవి మేలోనే నగరం చల్లబడింది. 31 రోజుల్లో సుమారు 20 రోజులు సాయంత్రం, రాత్రి వేళల్లో వానలు కురిశాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్ కష్టాలు షరామామూలే. విద్యుత్తు సరఫరా అంతరాయం.. రోడ్లకు అడ్డంగా చెట్ల కొమ్మలు పడ్డాయి. మేలో సగటు వర్షపాతం 9.30 సెంటీమీటర్లు నమోదైంది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు వానలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ వర్షాకాల ప్రణాళికను సిద్ధం చేసింది. అమలులోనే వెనుకపడింది.

**హైడ్రా యంత్రాంగానికి బాధ్యతలు**

గతంలో ఎన్నడూ లేనివిధంగా రుతుపవనాల కాలాన్ని ఎదుర్కొనే కార్యాచరణను హైడ్రాకు అప్పగించడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే జూన్ సగానికి వస్తోంది. వరద రోడ్లపై నిలవకుండా చేసే కార్యక్రమాలు ఇప్పటికీ పూర్తికాలేదు. అత్యవసర పనులు మాత్రమే చేపడతామని, పూడికతీత పనులతో తమకు సంబంధం లేదని హైడ్రా ప్రకటించడం కొసమెరుపు

**ఆక్రమణలు.. జాప్యం**

రహదారులపై వరద నిలవడానికి ప్రధాన కారణం ఏళ్ల తరబడి పూడికతీత సక్రమంగా జరగకపోవడం.. నాలాలు ఆక్రమణకు గురై కుంచించుకుపోవడమే. ఈ ఏడాది వరద కాలువల నిర్మాణాలు, మరమ్మతులకు రూ.వందల కోట్లు కేటాయించారు. ఇప్పటికి 40 శాతం పనులే పూర్తయ్యాయి. కొన్నింటికి టెండర్లను పిలవగా పలు కారణాలతో రద్దు చేశారు. సుమారు రూ.300 కోట్ల విలువైన 520 పనులు అమలు దశలో ఉన్నాయి. ఈ పనుల టెండర్లలోనూ మాయాజాలం జరిగింది. కొన్ని పనులు ఎక్కువ ధరలకు దక్కించుకొని.. జాప్యం చేస్తున్నారు. రెండు పర్యాయాలు టెండర్లను రద్దు చేసి మళ్లీమళ్లీ పిలిచారు.ఏటా పూడికతీత ప్రహసనంగా మారుతోంది. గుత్తేదారులకు కాసులు కురిపిస్తోంది. తీసేది.. తరలించేది అంతా కాకి లెక్కలే. కొందరు భవన నిర్మాణ వ్యర్థాలను సైతం పూడికగా చూపించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల స్థానికులు ఫిర్యాదు చేయడంతో కొంతమంది గుత్తేదారులను బ్లాక్‌లిస్టులో పెట్టారు.

**అత్యవసర బృందాలు**

వానాకాలం నేపథ్యంలో హైడ్రా వరద నియంత్రణ బృందాలను సిద్ధం చేసింది. ఈ మేరకు 130 అత్యవసర బృందాలను అందుబాటులోకి తెస్తోంది. ఒక్కో బృందంలో 12 మంది ఉంటారు. ఈ బృందాలు 51 డీఆర్‌ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాయి. నీరు నిలిచే ప్రాంతాలు.. వరద ముంపును తొలగించి వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా హైడ్రా ఆధ్వర్యంలో ఈ బృందాలు చర్యలు తీసుకుంటాయి. మురుగు కాల్వల్లో చెత్త, పూడిక తీత పనులు మాత్రం జీహెచ్‌ఎంసీ పరిధిలోనే కొనసాగుతాయని, ఎక్కడైనా అవసరం ఉంటే.. జీహెచ్‌ఎంసీ హైడ్రాకు సహకారం అందిస్తుందని హైడ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

వరద కాలువల పొడవు: 1302 కి.మీ.
మొత్తం పనులు: 890
వ్యయం (2024–25): రూ.501.32 కోట్లు
పూర్తయినవి: 373
చేసిన ఖర్చు: రూ.209.25 కోట్లు
నాలాల్లో తీయాల్సిన పూడిక: 951.71 కి.మీ.
జూన్ వరకు తీసినది: 518 కి.మీ.
మొత్తం పూడికతీత పనులు: 203
వ్యయం: రూ.55.04 కోట్లు

# చెవులకు చిల్లులు.. చర్యలకు మీనమేషాలు



హైదరాబాద్: పరిమితికి మించి నమోదవుతున్న ధ్వనులతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆధునిక పోకడ లతో వాహనాల సైలెన్సర్లు, హారన్లు మార్చి ఆకతాయిలు రద్దీ కూడళ్లలో, సున్నిత ప్రాంతాల్లో శబ్దాలు చేస్తూ హల్‌చల్ చేస్తున్నారు. ట్రాఫిక్, పోలీస్ విభాగాలు నిఘా పెంచినా వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. పరిమితికి మించి నమోదవుతున్న శబ్దాలను గుర్తించేందుకు సౌండ్ టెస్టింగ్ యంత్రాలు ఏర్పాటు చేయాలని భావించారు.

**రెండేళ్ల క్రితం ప్రకటన**

వేర్వేరు దేశాల్లో ధ్వనుల నియంత్రణకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించిన అధికారులు జర్మనీ సాంకేతికతతో రూపొందించిన ‘సౌండ్ టెస్టింగ్’ యంత్రాలను తీసుకొస్తామని రెండేళ్ల క్రితం ప్రకటించారు. కూడళ్లలో వీటిని ఏర్పాటు చేస్తే, అధిక ధ్వనులు చేసే వాహనాలను స్కాన్ చేసి జరిమానా విధించడంతో పాటు వాహనదారులను సంక్షిప్త సందేశాలతో హెచ్చరించవచ్చు. ఇప్పటి వరకు వీటిని ఏర్పాటు చేసే ప్రయత్నం లేదు. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించలేదు. ఫలితంగా ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, పాఠశాలలున్న ప్రాంతాల్లోనూ అధిక ధ్వనులు నమోదవుతున్నాయి. పీసీబీ విడుదల చేసిన నివేదిక ప్రకారం నివాస ప్రాంతాలైన జూబ్లీహిల్స్, తార్నాక, సున్నిత ప్రాంతమైన జూపార్కు, గచ్చిబౌలి ప్రాంతాల్లో శబ్ద తీవ్రత ఎక్కువగా ఉంది.

**శబ్దకాలుష్యం పెరిగితే...**

గుండె కొట్టుకునే వేగం, రక్తపీడనం పెరుగుతుంది.

శబ్ద తీవ్రత 65 డెసిబుల్స్ దాటితే గుండె జబ్బులు, చెవుడు రావొచ్చు కొందరు పనిచేసే శక్తిని కోల్పోతారు. నిద్రలేమి, తలనొప్పి, అలసటతో ఇబ్బందిపడతారు.

# చెల్లింపులు నిలిచి.. అభివృద్ధి తడబడి



సిరిసిల్ల: పురపాలికల అభివృద్ధి.. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా సద్వినియోగం చేసుకోలేక.. గుత్తేదారులకు పాత బకాయిలు చెల్లించక అభివృద్ధి కుంటుపడింది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు, సామాజిక భవనాల నిర్మాణాలు తదితర పనులకు టీయూఎఫ్‌ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లో విడతలుగా నిధులు కేటాయించారు. పనుల ప్రగతి ఆధారంగా ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించి చెల్లింపులు జరుపుతూ ఉండాలి. గుత్తేదారులు కొన్ని పనులు దాదాపు పూర్తి చేయగా.. కొన్ని బిల్లులు రాక నిలిచిపోయాయి. రెండేళ్లుగా ఇదే పరిస్థితి. దీంతో కొత్త పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు.

**ఉలుకు పలుకు లేదు..**

పురపాలికల్లో 2022–23లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.13 కోట్ల మేరకు బిల్లులను ఏప్రిల్‌లో విడుదల చేసింది. పట్టణ ప్రజారోగ్యశాఖ విభాగం పనుల ఎంబీ రికార్డులు, క్షేత్రస్థాయిలో పనుల ప్రగతిని పరిశీలించి 15 రోజుల్లో ప్రభుత్వానికి యూసీ (యుటిలైజ్ క్లియరెన్స్) ఇవ్వాలి. నిధులు వచ్చి రెండు నెలలు పూర్తవుతున్నా అధికారుల్లో ఉలుకు.. పలుకు లేదు. పట్టణంలో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు అధికారులు సాహసం చేయడం లేదు.

**చివరి దశలో అసంపూర్తి**

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధుల కేటాయింపు జరిగింది. 2022–23లోనే రూ.50 కోట్ల విలువైన పనులు జరిగాయి. కొన్ని పూర్తికాగా చాలా వరకు అసంపూర్తిగా మిగిలాయి.

వేములవాడ పట్టణంలో కోరుట్ల బస్టాండ్ నుంచి భీమేశ్వర గార్డెన్, మల్లారం కూడలికి నడకదారుల నిర్మాణానికి రూ.2.30 కోట్ల విలువైన పనులు జరిగాయి. మినీ స్టేడియం నిర్మాణానికి రెండు విడతలుగా రూ.7.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ రెండు చోట్ల 70 శాతం పనులు జరిగినా మొదటి విడత బిల్లులే రాలేదు. దీంతో గుత్తేదారులు పనులు నిలిపేశారు.

సిరిసిల్ల పట్టణంలో పది సామాజిక భవనాలకు ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారులు కొన్ని 50 శాతం, మరికొన్ని 90 శాతం పూర్తి చేశారు. బిల్లులు రాకపోవడంతో అన్నీ అసంపూర్తి దశలో వదిలేశారు.

పట్టణ పేదలకు రగుడు, పెద్దూరు, శాంతినగర్‌లోని పంపిణీ చేసిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో మౌలిక వసతుల కల్పనకు రూ.5.04 కోట్లు మంజూరయ్యాయి. అంతర్గత రహదారులు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేశారు. పాత బస్టాండ్ నుంచి వెంకంపేట రహదారి విస్తరణకు రూ.2.40 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయి రెండేళ్లు గడుస్తుంది. రెండు చోట్ల బిల్లుల చెల్లింపుల్లో అసంపూర్తిగానే జరిగాయి.

వేములవాడ–సిద్దిపేట బాహ్య వలయ రహదారిలో కేంద్రీయ విద్యుత్తు దీపాలు, పచ్చదనం ఏర్పాటుకు రూ.2.80 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారుకు సగానికిపైగా బిల్లుల బకాయిలు ఉండటంతో విద్యుత్తు సరఫరా లేక దీపాలు వెలగడం లేదు. పట్టణంలో కొత్తచెరువు నుంచి మొదటి బైపాస్ వరకు రూ.15 కోట్లతో సీసీ కాల్వ నిర్మాణానికి టెండర్లు పిలిస్తే గుత్తేదారులు ముందుకు రావడంలేదు. పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటేందుకు రూ.3 లక్షలతో ఎర్రమట్టి సరఫరా చేసేందుకు ఇప్పటికీ మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# మహిళా సంఘం.. ధాన్యం కొనుగోళ్లలో ఆదర్శం

సిరిసిల్ల : మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. ఇందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద అతివలు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. వీటితోపాటు ధాన్యం కొనుగోళ్ల అవకాశాన్ని మహిళా సంఘాలకు కల్పించింది. ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లలో అన్నదాతలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, మిల్లులకు తరలిస్తున్నారు. జిల్లాలో వీరికి గత వానాకాలం సీజన్‌లో 44 కొనుగోలు కేంద్రాలను కేటాయించగా, ఈ యాసంగి సీజన్‌లో 192 కొనుగోలు కేంద్రాలను కేటాయించడం విశేషం.

**రూ.6.47 కోట్ల కమీషన్**

ఐకేపీ ఆధ్వర్యంలో ఈ యాసంగి సీజన్‌లో 189 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు. గ్రామ సమైక్య సంఘాల ద్వారా 4 మహిళా సంఘాల సభ్యులతోపాటు ఒక బుక్ కీపర్ (మగ) కలిసి కేంద్రాలను నిర్వహించారు. ఈ యాసంగిలో 20,24,116 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. వీటిలో సన్న ధాన్యం వాటా 72,857 క్వింటాళ్లు. వీటి విలువ మొత్తం రూ.469.60 కోట్లు. జిల్లా వ్యాప్తంగా 32,556 మంది రైతుల దగ్గర ఐకేపీ నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. సభ్యులకు క్వింటాకు రూ.32 చొప్పున కమీషన్ లభిస్తుండగా, మొత్తం రూ.6,47,75,712ల కమీషన్ వచ్చింది.

**శిక్షణ సద్వినియోగం**

మహిళా సంఘాల సభ్యుల ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అవసరమైన శిక్షణను డీఆర్డీవో ఆధ్వర్యంలో ఇచ్చారు. బుక్ కీపింగ్, డాటా ఎంట్రీ,



తేమశాతం చూడడం, తూకం వేసిన సంచులకు నంబర్లను వేయడం, ధాన్యం నాణ్యతను పరిశీలించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వీటితోపాటు డీఆర్డీవో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలును ప్రతిరోజు మానిటరింగ్ చేశారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు విజయవంతంగా కొనుగోళ్లను పూర్తి చేశారు.

**189 సంఘాలు.. 20,24,116 క్వింటాళ్లు**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 246 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో పీఏసీఎస్ 46, డీసీఎంఎస్ 1, మెప్మాకు 7 కేంద్రాలతోపాటు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఐకేపీకి 192 కొనుగోలు కేంద్రాలను కేటాయించారు. వీటిలో 189 కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేశారు. తమకు లాభం చేకూర్చేలా బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ మహిళా సంఘాల సభ్యులు ఇటీవల కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారిని సన్మానించారు. విజయవంతం చేసినందుకు మహిళా సంఘాల సభ్యులను సైతం కలెక్టర్ సన్మానించి అభినందించారు. రానున్న సీజన్‌లలో మరిన్ని కేంద్రాలను కేటాయిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**సమన్వయంతో పని చేశారు– శేషాద్రి, డీఆర్‌డీవో**

మహిళా సంఘ సభ్యులకు కేటాయించిన కేంద్రాల్లో కొనుగోళ్లు విజయవంతంగా పూర్తయ్యాయి. సభ్యులందరూ సమన్వయంతో కష్టపడి పని చేశారు. వారు ఆర్థికంగా లాభాలు పొందేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. రాబోయే సీజన్‌లోనూ కేంద్రాలను నిర్వహించడానికి సన్నద్ధం కావాలి.

# సర్కారు బడుల్లో నర్సరీ తరగతులు

కరీంనగర్ : నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ఏర్పాటుకు ప్రభుత్వం నాంది పలికింది. ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైన పూర్వ ప్రాథమిక విద్యను ఇక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేయనుంది. పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని 210 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖ ఎంపిక చేసిన ఈ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను బాలలకు బోధించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 81 పాఠశాలల్లో ఈ తరగతులు ప్రారంభం కానున్నాయి.

**మూడు జిల్లాల్లో..**

కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ఏర్పాటు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దపల్లి జిల్లాలో అత్యధికంగా 46 పాఠశాలల్లో, జగిత్యాల జిల్లాలో 32 పాఠశాలల్లో ఏర్పాటు చేస్తుండగా కరీంనగర్ జిల్లాలో 3 పాఠశాలల్లో ప్రారంభించనున్నారు. వేసవి సెలవులకు ముందే ఈ తరగతుల ఏర్పాటుకు ఆయా జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రాలున్న



పాఠశాలల వివరాలను జిల్లా విద్యాశాఖల అధికారులు రాష్ట్ర విద్యాశాఖకు పంపించారు. ప్రస్తుతం కొత్తగా ప్రారంభిస్తున్న ప్రీ ప్రైమరీ తరగతుల్లో అయిదేళ్ల వయస్సు నిండిన బాలలకు ప్రవేశాలను కల్పించనున్నారు. అయితే బోధకులు, ఇతర సౌకర్యాలపై ఉన్నతాధికారులు మార్గదర్శకాలు విడుదల చేయాల్సి ఉంది.

**ప్రాథమిక పాఠశాలలు బలోపేతం**

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాలు సన్నగిల్లడంతో బాలల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రైవేటు పాఠశాలలపై మక్కువ పెరగడంతో ప్రవేశాలు కొరవడి పలు పాఠశాలలు మూతపడ్డాయి. ముఖ్యంగా అంగన్‌వాడీల్లో అక్షరాలు దిద్దుతున్న బాలలు అయిదేళ్లు నిండగానే ప్రైవేటు బాటపడుతున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వ బడుల్లోనే ప్రీప్రైమరీ తరగతులను ఏర్పాటు చేయడంతో బాలల ప్రవేశాలు పెరిగే అవకాశముంది. బడిబాట కార్యక్రమాల్లోనూ అయిదేళ్లు నిండిన బాలలకు సర్కారు బడుల్లో ప్రవేశాలు కల్పించేలా ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేస్తున్నారు.

# నకిలీలలు.. నమ్మకద్రోహులు

హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.. బంధువుల అబ్బాయితో పెళ్లి నిశ్చయమైంది. కొద్దిరోజులకు అతడి ప్రవర్తన సరిగాలేదని వివాహం రద్దు చేసుకున్నారు. కక్షగట్టిన అతడు నిశ్చితార్థం ఫొటోలను మార్ఫింగ్ చేసి వేధించాడు. ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరు నెలలైనా బాధితురాలు కోలుకోలేకపోయింది. ప్రస్తుతం మానసిక నిపుణుడి వద్ద కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. అమ్మాయిల బలహీనత.. నిస్సహాయతను ఆసరా చేసుకొని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. నగరంలో ప్రతి నెలా పోలీసులకు మహిళల నుంచి 10కిపైగా ఇలాంటి ఫిర్యాదులు వస్తుంటాయి. అధికశాతం సోషల్ మీడియా వేదికగా జరుగుతున్నాయి. **మొదట స్నేహం.. ఆపై మోసం**

పేరు తెచ్చుకోవాలనే తపనతో అమ్మాయిలు రీల్స్, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. అక్కడే నకిలీ ఫొటోలు, సమాచారంతో ప్రబుద్ధులు వల విసురుతున్నారు. ఓ ఇంజినీరింగ్ విద్యార్థినికి వల వేసిన వ్యక్తి ఆమె నగ్నవీడియోలు సేకరించి బెదిరించి రూ.లక్ష వసూలు చేశాడు. తనతో గడిపేందుకు హోటల్‌కు రమ్మనడంతో పోలీసులను ఆశ్రయించింది. ప్రైవేట్ ఉద్యోగినికి ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తి ప్రేమ పేరిట దగ్గరయ్యాడు. హోటల్‌కు రప్పించుకొని రహస్యంగా వీడియోలు తీసి బెదిరించి రూ.లక్ష నగదు, మరో యువతిని సమకూర్చాలని షరతు విధించాడు.



షీటీమ్స్‌ను ఆశ్రయించటంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.

**మ్యాట్రిమోనీ.. డేటింగ్ యాప్‌లు**

ఒంటరిగా ఉండే కొందరు డేటింగ్‌యాప్‌లలో స్నేహాలతో ఉపశమనం పొందవచ్చని భావిస్తున్నారు. ఇక్కడ మాయగాళ్లు నకిలీ ప్రొఫైల్స్‌తో మహిళలను ఆకట్టుకొని.. ప్రేమ, పెళ్లి అంటూ నమ్మించి ఏవో సాకులు చెబుతూ సొమ్ము కాజేస్తున్నారు. కాబోయే భార్యకు కానుకలు పార్సిల్ చేస్తున్నామంటూ మురిపిస్తారు. విమానాశ్రయం, నౌకాశ్రయం నుంచి కస్టమ్స్ అధికారులమంటూ ఫోన్ చేసి.. పన్నులంటూ రూ.లక్షలు వసూలు చేస్తారు. ఏటా ఇలా 20-30 ఫిర్యాదులు వస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**ధైర్యంగా ఫిర్యాదు చేయండి**

- డాక్టర్ లావణ్యానాయక్ జాదవ్, డీసీపీ, నగర మహిళ భద్రతా విభాగం మోసగాళ్లు నకిలీ ప్రొఫైళ్లతో నమ్మకం కలిగించి ఇబ్బందులకు గురిచేస్తారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వారితో పరిమితిగా ఉండాలి. వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. బలమైన పాస్‌వర్డులు ఉపయోగించాలి. వేధింపులు ఎదురైనప్పుడు ధైర్యంగా షీటీమ్స్ హెల్ప్‌లైన్ డయల్ 100, వాట్సాప్ నంబర్ 94906 16555కు ఫిర్యాదు చేయండి.

# రూ.1,839 కోట్ల పనులకు టెండర్లు

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో పైవంతెనలు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ కోసం చేపట్టిన హెచ్- సిటీ ప్రాజెక్టులో మొదటిసారి కొన్ని పనులు టెండరు దశ పూర్తి చేసుకున్నాయి. గతేడాది డిసెంబరు 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.7వేల కోట్ల పనులకు శంకుస్థాపన చేయగా.. తాజాగా రూ.1,839 కోట్ల విలువైన పనులకు టెండరు ప్రక్రియ పూర్తయింది.

**మేఘా, కేఎన్‌ఆర్..**



కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లలో స్టీలు బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులను మేఘా సంస్థ దాదాపు దక్కించుకున్నట్టేనని అధికారులు చెబుతున్నారు. సాంకేతికంగా ఆ సంస్థ అర్హత సాధించిందని, మరో రెండ్రోజుల్లో అధికారికంగా ఎంపిక చేస్తామన్నారు. ఖాజాగూడ, ట్రిపుల్‌ఐటీ చౌరస్తాల్లో నిర్మించ తలపెట్టిన పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు, అంజయ్యనగర్, గచ్చిబౌలి రహదారుల విస్తరణకు ఒకే ప్యాకేజీ కింద టెండర్లు పిలవగా, కేఎన్‌ఆర్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఈ సంస్థ అంచనా వ్యయం మీద 4.68 శాతం అదనపు మొత్తంతో కాంట్రాక్టు పొందినట్లు, మేఘా సైతం అదనపు మొత్తానికి టెండరు వేసినట్టు యంత్రాంగం చెబుతోంది. కేబీఆర్ పార్కు చుట్టూ పైవంతెనల నిర్మాణంపై న్యాయస్థానం యథాతథస్థితి ఉత్తర్వులున్నాయి. టెండరు ప్రక్రియ వరకే అనుమతి ఉందని అధికారులు పేర్కొన్నారు.

# ప్రజారోగ్యానికి.. పొగ

హైదరాబాద్ 'ఘాటు వాసలు రావడానికి ప్రత్యేక సమయం అంటూ ఏదీ ఉండదు. సాయంత్రం, రాత్రుళ్లు, తెల్లవారుజామున, వర్షాలు కురిసినప్పుడు, దట్టంగా మేఘాలు కమ్ముకున్నప్పుడు వస్తుంటాయి. ఆ సమయంలో గంట నుంచి రెండు గంటల పాటు ఊపిరి పీల్చుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. శ్వాసకోశ సమస్యలున్న వారి పరిస్థితి మరీ దారుణం. కళ్లు ఎర్రబడటం, అలర్జీలు వంటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. 'జనవాణి - కాలుష్య నివారిణి'కి మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం' - బాచుపల్లి, మల్లంపేట వాసులు

వందకు పైగా పరిశ్రమలు..బాచుపల్లి, మల్లంపేట పరిసర ప్రాంతాల్లో 100కి పైగా బల్క్‌డ్రగ్, ఫార్మా, రసాయన పరిశ్రమలున్నాయి. వాటిల్లో ఉత్పత్తులు తయారు చేస్తున్నప్పుడు విడుదలయ్యే పొగను శుద్ధి చేయకుండా వదులుతుండటమే ఘాటువాసనలకు ప్రధాన కారణం.

నిబంధనలు తూచ్‌నిబంధనల ప్రకారం పరిశ్రమల నుంచి పొగను నేరుగా గాలిలో విడుదల చేయకూడదు. ముందుగా ప్రత్యేక ఛాంబర్లలోకి పంపించి శుద్ధి చేసిన తర్వాత ప్రత్యేక గొట్టాల ద్వారా విడుదల చేయాలి. ఈ గొట్టాలు లోపల జిగ్‌జాగ్ తరహాలో ఉండాలి. అప్పుడే కాలుష్య కారకాలను గ్రహించే వీలుంటుంది. చాలా పరిశ్రమల్లో ఇవి నిబంధనలు మేరకు లేవనేది బహిరంగ రహస్యం.

# పేదల ముంగిట ఆధునిక వైద్యం




వికారాబాద్ : వికారాబాద్ పట్టణంలో దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనంలోనే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కొనసాగుతోంది. ఇరుకైన గదులు, వైద్యులు, సిబ్బంది కూర్చోడానికి కూడా సరియైన స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించడంతోపాటు, రోగులకు ఆధునిక వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సోమవారం కొత్త భవనం ప్రారంభించింది. పాత భవనాన్ని కొత్తదాన్లోకి మారుస్తారు. తద్వారా పేదల ముంగిట విలువైన వైద్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో

**వైద్య కళాశాల మంజూరుతో తిరిగిన దశ**

మూడు సంవత్సరాల క్రితం వికారాబాద్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు కావటంతో జిల్లా వైద్య సేవల దశ తిరిగింది. ఇందులో భాగంగా జనరల్ ఆసుపత్రికి కొత్త భవనాన్ని నిర్మించారు. వైద్య కళాశాలకు నిబంధనల ప్రకారం 350 పడకలు తప్పని సరి. కొత్త భవనంలో 300 పడకలుంటాయి. పాత ఆసుపత్రిలో 50 పడకలున్నాయి. దీంతో 350 పడకలు సమకూరుతాయి.

ఇక్కడ జనరల్ సర్జరీలు, మేజర్ సర్జరీలు నిర్వహిస్తారు.

ఐసీయూ యూనిట్, వెంటిలేటర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు.

ఇప్పటి వరకు రోగులు ఏ చిన్న సమస్యతో ఆసుపత్రికి వచ్చినా ఇక్కడ సరైన సౌకర్యాలు లేక హైదరాబాద్‌కు సిఫారసు చేసేవారు. ఇక నుంచి అలాంటి అవసరం ఉండదు. సూపర్ స్పెషాలిటీస్ సేవలు అవసరం ఉన్న వారిని మాత్రం హైదరాబాద్ సిఫారసు చేస్తారు. ఆసుపత్రికి అవసరం ఉన్న పరికరాల కొనుగోలు ప్రక్రియను 45 రోజుల్లో పూర్తి చేయాలని భవనం ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్యాధికారులకు సూచించారు.

ముందుగా ఓపీ సేవలు ప్రారంభిస్తాం

- డాక్టర్ రాంచంద్రయ్య, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్

కొత్తగా ప్రారంభించిన ఆసుపత్రి భవనంలో ముందుగా ఓపీ (బయటి రోగులు) సేవలను త్వరలో ప్రారంభిస్తాం. అనుకూలతను బట్టి ఒక్కొక్కటి తరలిస్తాం. రోగులకు నిరంతరం వైద్యులు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఇదీ సమాచారం

కొత్త ఆసుపత్రిలో పడకలు.. 300

భవన నిర్మాణానికి వ్యయం.. రూ. 23.75 కోట్లు

క్రిటికల్ కేర్ యూనిట్‌కు.. రూ.16 కోట్లు

# చల్లని మాటలు.. చెల్లని తీరు




హైదరాబాద్: ఎండ మండిపోతుంటే గచ్చిబౌలి నుంచి నిజాంపేట్ వెళ్లేందుకు ఏసీ బస్సు (మియాపూర్-2 డిపో) ఎక్కా. బస్సులో అపరిశుభ్రం, పని చేయని ఏసీతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యా. గాలి రాక, చల్లదనం లేక ఉక్కిరిబిక్కిరయ్యా'

నగరానికి చెందిన జ్ఞానేశ్వర్ ఆర్టీసీ ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదు. నగరంలో ఏసీ బస్‌షెల్టర్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. ఏసీలు, ఫ్యాన్లు లేవు. బస్‌స్టాప్‌లో వేచి ఉండలేక ఎండలోనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది.

**బేగంపేట్‌కు చెందిన ఓ ప్రయాణికురాలి ఆవేదన**

ఈనాడు, బస్‌షెల్టర్లకు అనుమతులిచ్చేది జీహెచ్‌ఎంసీ. ఏర్పాటు చేసి లాభాలు పొందేవి ప్రైవేటు ఏజెన్సీలు. ప్రయాణికుల కోసం బస్సులు ఆపేది ఆర్టీసీ.. ఈ మూడు సంస్థల సమన్వయ లోపం ప్రయాణికులకు శాపంగా మారుతోంది. ఏసీ షెల్టర్లు, బస్సుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బస్‌షెల్టర్ల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ కొన్ని ప్రైవేటు ఏజెన్సీలకు ఎనిమిదేళ్ల క్రితం అనుమతులిచ్చింది. నిబంధన ప్రకారం పదేళ్ల గడువు కాగా, మరో ఐదేళ్లు పొడిగించే వెసులుబాటు ఉంది. కొన్ని షెల్టర్లు జిరాక్స్ కేంద్రాలు, జ్యూస్ సెంటర్లుగా మారిపోయాయి. అనేక ప్రాంతాల్లో వాటి ముందే దుకాణాలు ఏర్పాటు చేశారు. విరిగిన బెంచీలు, పనిచేయని ఏసీలు దర్శనమిస్తున్నాయి. కేపీహెచ్‌బీ లాంటి చోట్ల ఏసీ షెల్టర్లు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి.

**ఆదరణ ఉన్నా..**

నగరంలో ఆర్టీసీ ఏసీ బస్సులకు ఆదరణ ఉంది. శంషాబాద్ విమానాశ్రయానికే 53 ఏసీ బస్సులను నడుపుతున్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి ఐటీకారిడార్‌కు 70 ఏసీ బస్సులు ఉన్నాయి. వీటన్నింటిలో 65 శాతం ఆక్యుపెన్సీ ఉంటోంది. నిర్వహణ లోపంతో ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెతున్నాయి. ముఖ్యంగా ఏసీ మొరాయింపు, శుభ్రత పాటించడం లేదని వాపోతున్నారు. ప్రధానంగా మియాపూర్-2 డిపో బస్సుల నిర్వహణపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి. **ఏసీ బస్సు షెల్టర్లు ఇవే..**

ఖైరతాబాద్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, బోరబండ, కేపీహెచ్‌బీ, ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్, కొండాపూర్, మలేషియన్ టౌన్‌షిప్, కోఠి, తార్నాక, మదీనాగూడ శిల్పారామం, విద్యానగర్, బేగంపేట.

**గ్రేటర్ పరిధిలో..**

బస్సులు: 2,800

ప్రయాణికులు 20 లక్షలు

బస్సు షెల్టర్లు 1370

అదనంగా కావాల్సిన బస్సులు 400


వెంటనే కావాల్సినవి 180

# సరిహద్దు దాటొచ్చి.. చీకటి దందా

హైదరాబాద్ : భారత్‌లోకి అక్రమంగా చొరబడ్డ బంగ్లాదేశీయులకు ఆధార్, జనన ధ్రువపత్రాలతో పాటు పాస్‌పోర్టులూ వచ్చేస్తున్నాయి. దొడ్డిదారిన దేశంలోకి ప్రవేశించిన వారికి ఇలా జారీ అవడం కలకలం రేపుతోంది. నగరంలో నివసించే విదేశీయులు, అసాంఘిక శక్తులపై నిఘా పెడుతున్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది. స్థానికులుగా చెలామణి అవుతూ వ్యభిచార ముఠాలు, రౌడీషీటర్లుగా నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. బంగ్లాదేశీయులు నగరంలో తిష్ట వేయడానికి ప్రధాన కారణం వారి ఆహార్యం, అలవాట్లు కొంత మనలా ఉండడం ఒకటైతే.. పోలీసులు చూసీచూడనట్లు వదిలేయడం మరొకటనే విమర్శలున్నాయి.కొందరు బంగ్లాదేశీయులు అక్రమంగా నివాసం ఉంటున్నట్లు తెలిసినా పట్టించుకోవడం లేదు. దీంతో వారు స్థానికుల సాయంతో అక్రమంగా జనన ధ్రువపత్రాలు, ఆధార్ సంపాదిస్తున్నారు. వీటి సాయంతో పాస్‌పోర్టు తీసుకుంటున్నారు. ఇక్కడ గుర్తింపు పత్రాలు వచ్చాక క్రమంగా కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఖైరతాబాద్, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో నగర పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యభిచార ముఠాలోని సభ్యులు బంగ్లాదేశీయులే కావడం గమనార్హం. ఏటా వందల సంఖ్యలో గంజాయి, డ్రగ్స్ రవాణా, వ్యభిచారం తదితర కేసుల్లో పోలీసులకు దొరికిపోతున్నారు.

**డంకీ రూట్లలో దేశంలోకి ప్రవేశం**

నగరానికి వచ్చే బంగ్లాదేశీయులు ఎక్కువగా డంకీ రూట్ల ద్వారా దేశంలోకి ప్రవేశిస్తున్నట్లు గుర్తించారు. దట్టమైన అడవులు, కొండలు, నదుల మీదుగా.. పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తారు.



అక్కడి నుంచి రైలు, బస్సు మార్గాల్లో హైదరాబాద్ చేరుకుంటున్నారు.రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే దాదాపు 5 వేల వరకు రోహింగ్యాలు అంతకు రెట్టింపు బంగ్లాదేశీయులు ఉన్నట్లు సమాచారం.

**ఇటీవలి సంఘటనలు**

పోచారంలో అక్రమంగా ఉంటున్న బంగ్లా దేశస్థుడిని ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్‌లో ఆధార్, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు సంపాదించి నగరానికి వచ్చాడు.

ఫిబ్రవరిలో రంజాన్ షేక్ పేరున్న వ్యక్తి ఢాకా వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చాడు. తనిఖీల్లో అక్రమంగా వచ్చిన బంగ్లాదేశీయుడిగా గుర్తించారు. ఇద్దరు బంగ్లా దేశీయులు అక్రమంగా హైదరాబాద్ వచ్చి ఇక్కడి స్నేహితుల సాయంతో గుర్తింపు పత్రాలు సంపాదించారు. స్థానిక యువతుల్ని వివాహమాడి దుబాయ్ తీసుకెళ్లే యత్నంలో అధికారులకు చిక్కారు.

# తూకాల్లో జాప్యం.. అన్నదాతల దైన్యం

ఎల్లారెడ్డిపేట : కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర రవాణా వాహనాలు, హమాలీ సమస్యలు రాకుండా చూసుకోవాలి. ఐకేపీ ఏపీఎంలు నిత్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలి. జిల్లాలో ప్రతి మండలంలో అధికారులు చొరవ తీసుకొని, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు జరిగేలా చూడాలి.

తరచుగా నిర్వహిస్తున్న సమీక్ష సమావేశాల్లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాలివి.జిల్లాలో యాసంగి సీజన్‌లో పండించిన వరిధాన్యం విక్రయానికి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను అత్యధికంగా ఐకేపీ మహిళా సంఘాలకు కేటాయించారు. నేటికీ తూకాల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుండగా అన్నదాతలు దైన్య స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అనేక కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు మృగ్యమయ్యాయి. వివిధ మండలాల్లో హమాలీ కూలీల కొరత రైతులను వేధిస్తోంది. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణను క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలాచోట్ల ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, ఇతర సిబ్బంది కార్యాలయం గడప దాటడం లేదనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. కొనుగోళ్ల క్రతువును మహిళా సంఘాలకే వదిలేస్తుండగా బుక్ కీపర్‌లే పెద్ద దిక్కుగా మారుతున్నారు. ఆకాశం మేఘావృతమైనప్పుడల్లా ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని వివిధ కేంద్రాల్లో వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. తడిసిన ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టేందుకు కర్షకులు చెమటోడ్చుతున్నారు.

**1.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**

జిల్లాలో ఈ నెల 13 వరకు 24,294 మంది రైతుల నుంచి రూ. 393 కోట్ల విలువ చేసే 1,69,618 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 1,62,710 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేర్చగా 6908 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను తరలించాల్సి ఉంది. 242 కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోళ్లు సాగగా వీటిలో 12 కేంద్రాలను మూసివేశారు. ఇందులో 1,0894 మంది రైతులకు చెందిన 72,610 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ. 168.46 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

**కుప్పగా పోసి 16 రోజులు**

నా సొంత భూమితోపాటు మరికొంత వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకొని సన్నరకం వరి సాగుచేశాను. మొత్తం ఏడెకరాల వరిని కోసి, జక్కుల చెరువు పక్కన ఐకేపీ కేంద్రంలో ఆరబెట్టాను. కుప్పగా పోసి 16 రోజులవుతోంది. రాచర్ల బొప్పాపూర్ ఐకేపీ కేంద్రాలకు చుట్టుపక్కల మరో నాలుగు గ్రామాల రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చారు. తూకాలను వేగవంతం చేయాలి.

**ల్యాగల వినోద్‌రెడ్డి, రైతు, రాచర్ల బొప్పాపూర్**

అకాల వర్షాలకు తడుస్తోంది

నాకున్న మూడెకరాల్లో దొడ్డురకం వరి సాగుచేశాను. నెలరోజుల క్రితం కోతలు చేపట్టి జక్కుల చెరువులో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. నిర్ణీత తేమశాతం వచ్చేంత వరకు ఎండబెట్టాను. 25 రోజులవుతున్నా తూకానికి నోచుకోవడం లేదు. అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోతోంది. రేయింబవళ్లూ కేంద్రంలోనే ఉండాల్సి వస్తోంది.

బొమ్మనవేణి చంద్రం, రైతు రాచర్ల బొప్పాపూర్

# ఆ జాబితా ఏమైనట్లు?

కరీంనగర్ : జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థ పరిధిలో కొత్త రేషన్‌కార్డుల జారీ విషయంలో గందరగోళం తొలగడం లేదు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసిన వారికి ఇప్పటివరకు రాకపోగా, మీసేవ, రెవెన్యూ కార్యాలయాల్లో అందించిన వారికి మాత్రం కొత్తగా రేషన్‌కార్డులు రావడం, ఈ నెలలో బియ్యం కూడా తీసుకోవడంతో.. మిగతా అర్హులైన వారిలో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది జనవరి 21, 22 తేదీల్లో వార్డు సభలలో ప్రదర్శించిన రేషన్ కార్డుల జాబితాలోని లబ్ధిదారులకు ఏ ఒక్కరికి రేషన్‌కార్డు జారీ కాలేదు. ఇంతకీ ఆ జాబితా ఏమైందో, అది ఎక్కడి నుంచి వచ్చిందో తెలియకుండా మారింది. మంజూరు కాని జాబితాను తీసుకొచ్చి వార్డు సభల్లో అతికించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**సర్వేల పేరుతో కాలయాపన**

రేషన్ కార్డులు లేని వారికి, కొత్త రేషన్‌కార్డుల జారీ చేసేందుకు ఈ ఏడాది జనవరి రెండో వారంలో నగరపాలిక పరిధిలోని వార్డు అధికారులు సర్వే చేశారు. నగరంలోని 60 డివిజన్లతోపాటు విలీన కాలనీల్లో ఇంటింటా తిరుగుతూ వివరాలను నమోదు చేసుకున్నారు. ఆ సమయంలో ఎవరికైతే రేషన్‌కార్డు లేదని పేర్కొన్నారో వారి వివరాల జాబితా ఆధారంగా వివరాలను పౌరసరఫరాల శాఖ సేకరించింది. ఆ వివరాల ఆధారంగానే సర్వే నిర్వహించారు. నగరవ్యాప్తంగా 18,964 పేర్లతో కూడిన జాబితాను వార్డు అధికారులు, మెప్మా, శానిటేషన్ ఉద్యోగుల ద్వారా విచారణ చేపట్టారు. వీటన్నింటిని అధికారులు ఆన్‌లైన్ చేసి పౌరసరఫరాల శాఖకు పంపించారు. తీరా రేషన్‌కార్డులు ఏవీ కూడా ఆమోదం కాకపోవడంతో అధికారులు కంగుతిన్నారు. వారం రోజులుగా ఇంటింటా తిరుగుతూ మళ్లీ విచారణ



ప్రారంభించారు. ఆ యాప్ కూడా సక్రమంగా పని చేయడం లేదని వార్డు అధికారులు చెబుతున్నారు.

అర్హులు అర్జీలు ఇచ్చినా.. ప్రజాపాలనలో పేర్లు ప్రకటించినా ఇప్పటి వరకు కార్డు రాలేదని తెలుసుకొని దరఖాస్తుదారులు మండిపడు తున్నారు. వీరంతా స్థానిక మాజీ కార్పొరేటర్ల ఇళ్లచుట్టూ, నగరపాలిక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. మీసేవలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి మాత్రం వారం కిందటి వరకు వచ్చాయి. ప్రస్తుతం నమోదు మాత్రమే చేస్తుండగా రేషన్‌కార్డులను మాత్రం రెవెన్యూ అధికారులు పరిశీలించడం లేదు. సర్వేల పేరుతో కాలయాపన చేయడం తప్ప మరోటి లేదని, ముందుగానే మీసేవలో దరఖాస్తు చేసుకోమని అధికారులు సూచనలు చేస్తే ఈ ఇబ్బందులే ఉండేవి కావనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సర్వే చేస్తున్నామని.. వార్డు అధికారుల ద్వారా 40 శాతం పూర్తయిందని జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ అవుతాయని పేర్కొన్నారు.

చురకలు



# మత్స్యం.. కృత్రిమ ఆవాసం

విజయనగరం : మత్స్య సంపద పెంపొందించేదుకు సముద్ర తీర జలాల్లో కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనలో వంద శాతం సబ్సిడీతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి జిల్లాలో అయిదు ప్రాంతాలను ఎంపిక చేశామని, సుమారు ఆరు వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు. సముద్ర తీర జలాల్లో త్రికోణ ఆకారంలో ఉన్న సిమెంటు దిమ్మలను ఏర్పాటు చేస్తారు. వీటినే కృత్రిమ రీఫ్‌లు అంటారు. కొన్ని రోజులకు దిమ్మలకు ఉప్పునీటి వల్ల నాచుపడుతుంది. దాంతో చేపలు నాచును తినడంతో పాటు ఇక్కడే గుడ్లు పెట్టి మత్స్య సంపదను అభివృద్ధి చేస్తాయి. దీంతో



మత్స్యకారులు వేటకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. డీజిల్ ఖర్చు, సమయం ఆదా అవుతాయి.

**ఈ అయిదు ప్రాంతాల్లో..**

చింతపల్లి, చింతపల్లి-బర్రిపేట, తమ్మయ్యపాలెం-ఎ, తమ్మయ్యపాలెం-బి, తిప్పలవలసల్లో రూ.1.75 కోట్లతో కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని సీఎంఎఫ్‌ఆర్‌ఐ(విశాఖపట్నం) సాంకేతిక సహకారంతో సిద్ధం చేస్తున్నారు. ఈ అయిదు యూనిట్లలో రెండు వందలు చొప్పున వెయ్యి దిమ్మలు పెట్టనున్నారు.

**పనులు ప్రారంభమయ్యాయి..**

**– ఎం.విజయకృష్ణ, మత్స్యశాఖ ఇన్‌ఛార్జి డీడీ, విజయనగరం**

రీఫ్‌ల ఏర్పాటు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇవి చేపలు, సముద్ర జీవులకు ఆవాసాలుగా మారుతాయి. దీంతో తీర ప్రాంతంలో మత్స్యసంపద వృద్ధి చెందుతుంది. స్థానికంగానే చేపలు అందుబాటులో ఉంటాయి. మత్స్యకారులు అందరూ వీటిని గమనించి, ఉపాధికి బాటలు వేసుకోవాలి.

# వారెవ్వా.. ఎరెవ్వా 4.0

కాకినాడ : ఆరున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్‌ఎంసీ)లో ఎరెవ్వా 4.0 వేడుకలకు వైద్య విద్యార్థులు సన్నద్ధమయ్యారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, విజ్ఞానానికి పదునుపెట్టేలా పలు సాంకేతిక సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలతో గురువారం నుంచే ఉత్సవం ప్రారంభ కానుంది. ఈనెల 12, 13, 14 తేదీల్లో జీజీహెచ్‌తో పాటు రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంఈ డా.జి.రఘునందన్, డా.నరసింహం తదితరులు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు

**దేశవ్యాప్తంగా కళాశాలల నుంచి..**

ఆర్‌ఎంసీ ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ నేతృత్వంలో ఎరెవ్వా 4.0 నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లుచేశారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ వైద్య కళాశాలల నుంచి ఎంబీబీఎస్ విద్యార్థులు 800 మంది వరకు హాజరుకానున్నారు. అతిథులకు గోదారి రుచులు అందించడంతోపాటు సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

**బృందాలుగా ఏర్పడి..**

కార్యక్రమ కన్వీనర్, వైస్ ప్రిన్సిపల్ డా.శశి సారథ్యంలో 50 మంది వైద్య విద్యార్థులు బృందాలుగా ఏర్పడి అతిథి సత్కారం చేయనున్నారు.




కన్వెన్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తోట హరికృష్ణప్రసాద్, కోశాధికారిగా డా.ఉమామహేశ్వరరావు, డా.సత్యవతితోపాటు పబ్లిక్ రిలేషన్ కార్యదర్శిగా నిరంజన్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వి.వెంకటగణేష్, కె.లోహిత వ్యవహరిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చినవారికి వసతి సౌకర్యంతో పాటు ఆహారం, స్థానిక రవాణా ఇతర సదుపాయాలు కల్పించనున్నారు.

**విభిన్న విభాగాల ద్వారా..**

హ్యాండ్స్-ఆన్ క్లినికల్, వర్క్‌షాప్స్-ప్రాక్టికల్ అనుభవం.. ఇలా విభిన్న విభాగాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. మొత్తం 22 విభాగాల్లో 26 వర్క్‌షాపులతో పాటు 11 పోటీలు జరగనున్నాయి. క్లినికల్ స్కిల్స్ అభివృద్ధి దిశగా జరిగే కార్యక్రమంలో జీజీహెచ్‌లోని అన్ని విభాగాల వైద్యులు భాగస్వాములవుతారు. ఎమర్జెన్సీ కేసులపై ఎలా స్పందించాలి, గుండెపోటు, ఆత్మహత్య కేసులు, రోడ్డు ప్రమాదాలు తదితర విభిన్న అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు.

# సీమ ద్వారం.. పరిశ్రమ నాదం



కర్నూలు : తుంగభద్ర.. కృష్ణమ్మ ప్రవహిస్తున్న నేల.. విలువైన ఖనిజాలు ఉన్న ఖిల్లా.. హైదరాబాద్-బెంగళూరు నగరాల మధ్యనున్న ప్రాంతం.. ఒకప్పుడు 'సిరి'సంపదలతో తులతూగిన సీమ ముఖ ద్వారం.. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ఇసుమంత అభివృద్ధి చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సీమ పారిశ్రామిక ప్రగతి దిశగా అడుగులు వేస్తోంది. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను రూ.2786.10 కోట్లతో అభివృద్ధి చేసే పనులకు అడుగులు పడుతున్నాయి. 2,624.64 ఎకరాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ఇటీవల టెండర్లు పిలిచారు. పనులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్'(నిక్‌డిట్)తో ఒప్పందం కుదుర్చుకొంది. తొలిదశ పనుల్లో భాగంగా పారిశ్రామికవాడలోని 517 ఎకరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులను మొదలుపెట్టనున్నారు. ఇక్కడ పదివేల ఎకరాలు అందుబాటులో ఉండటంతో దశలవారీగా మిగిలిన భూముల్లోనూ పలు రకాల పరిశ్రమలు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

**'పోగు' ఉపాధి పేగు**

చేనేతపురిలో పారిశ్రామిక వెలుగులు కాంతులీననున్నాయి. ఇక్కడ కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో బనవాసిఫారం వద్ద టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు 77 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.20 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఓ పారిశ్రామికవేత్త ముందుకొచ్చారు. 25 ఎకరాల్లో పరిశ్రమలను నెలకొల్పనున్నారు.

**సౌర.. పవన విద్యుత్తు**

ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల పరిధిలో 1680 మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయి. వాటి నిర్మాణం పూర్తైతే ఆ ప్రాంతంలోని పలువురికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దీంతోపాటు ఆయా సంస్థలు కూడా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంది.

**నియోజకవర్గానికో ఎంఎస్‌ఎంఈ పార్కు**

ఓర్వకల్లు మండలం గుట్టపాడు క్లస్టర్‌లో 167 ఎకరాల్లో ప్లాట్లు వేయగా.. డోన్ నియోజకవర్గం జగదుర్తిలో 25 ఎకరాల్లో పార్కును అభివృద్ధి చేశారు. ఈ రెండు ఎంఎస్‌ఎంఈ పార్కులకు సంబంధించిన ప్లాట్లను ఇప్పటికే ఏపీఐఐసీ వారు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఒక ఎకరాకు పది మందికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు.

మంత్రాలయం నియోజకవర్గంలో 30 ఎకరాల్లో, కోడుమూరులో 50 ఎకరాలు, ఆలూరులో 10 ఎకరాల్లో, ఆళ్లగడ్డలో 40 ఎకరాల్లో త్వరలో ఎంఎస్‌ఎంఈ పార్కులు రాబోతున్నాయి.

బ్రాహ్మణపల్లె ఎంఎస్‌ఎంఈ పార్కులో ముగ్గురు, ఇటిక్యాలలో ఒకరు, తంగడంచలో ఒకరు పరిశ్రమలను నెలకొల్పేందుకు ముందుకొచ్చారు.

**ఎగరనున్న డ్రోన్లు**

డ్రోన్ హబ్‌ను ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు 300 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ రూ.వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది.. ఐదువేల మందికి ఉద్యోగాలొచ్చే అవకాశం ఉంది.

**'ఈవీ పార్కు' రయ్.. రయ్**

ఎలక్ట్రిక్ వాహనాలు జిల్లాలో తయారు చేయనున్నారు. ఓర్వకల్లులో 1200 ఎకరాల్లో రూ.13 వేల కోట్లతో 'ఈవీపార్క్'ను ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదిరింది. ఈ పార్కులో దశలవారీగా 25వేల మందికి ఉపాధి లభించనుంది. ఇందులో పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. తొలిదశలో 300 ఎకరాల్లో ఈవీ మొబిలిటీ పార్కును ఏర్పాటు చేయనున్నారు.

**130 ఎకరాలు.. రూ.14 వేల కోట్ల పెట్టుబడి**

జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, దేశానికి చెందిన హైడ్రెస్ గ్రూప్, బీఎన్ గ్రూప్‌లు సంయుక్తంగా రూ.14 వేల కోట్లతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను ఓర్వకల్లులో నెలకొల్పనున్నారు. 130 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ వల్ల రెండు వేల మందికి ప్రత్యక్షంగా, 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

**బెవరేజెస్ యూనిట్**

రూ.1,622 కోట్ల పెట్టుబడులతో బెవరేజెస్ యూనిట్ ఏర్పాటుకు ఫార్చ్యూన్-500 జాబితా కంపెనీ రిలయన్స్ ఆసక్తి కనబరుస్తోంది. కర్నూలు జిల్లాలో ఏర్పాటుకు డీపీఆర్‌ను ప్రభుత్వానికి సమర్పించింది. అందులో ప్యాకేజ్డ్ కార్బొనేటెడ్ సాఫ్ట్‌డ్రింక్‌లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారు చేయనున్నారు.


**టమాటా శుద్ధి... రైతు వృద్ధి**

పత్తికొండ సమీపంలోని దూదెకొండలో రూ.11 కోట్లతో టమాటా ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. దీన్ని మరో నాలుగు నెలల్లో పూర్తి చేయనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలో 25 వేల ఎకరాల్లో టమాటా పండించే రైతులకు మేలుచేకరూనుంది.

**గ్రీన్‌కో కాంతులు**

ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా సౌర, వాయు, జలవనరులను ఉపయోగించి ఒకేచోట ఏకంగా ఆరువేల మెగావాట్ల విద్యుత్తును జిల్లాలో ఉత్పత్తి చేయనున్నారు. ప్రపంచంలోనే తొలి 'సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు' (ఐఆర్‌ఈపీ)ను గ్రీన్‌కో సంస్థ పిన్నాపురంలో నిర్మిస్తోంది. ఏకంగా రూ.24వేల కోట్లతో చేపడుతున్న ప్రాజెక్టు పనులు చివరి దశకొచ్చాయి.

# అక్రమం.. చేయి తడిపితే సక్రమం



నెల్లూరు : 'జీ+2కు అనుమతి తీసుకుంటారు. మూడు, నాలుగు అంతస్తులు నిర్మిస్తారు. ఇదో పద్ధతి. మరికొందరు అనుమతులు తీసుకున్నా ప్లాన్‌కు సంబంధమే ఉండదు.. ఆ మాటకొస్తే సెట్‌బ్యాక్ కూడా వదలరు. కొందరు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లే(ఎల్‌టీపీ) సొంత లాభం చూసుకుంటూ.. సలహాలు ఇచ్చి మరీ యజమానులను అక్రమ నిర్మాణాల దిశగా ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు నిదర్శనం.. ఒక్క నెల్లూరు నగరంలోనే 250 అక్రమ నిర్మాణాలను గుర్తించడం.. ఇప్పటి వరకు 40 మందికి నోటీసులు ఇవ్వడమే'

**రోజుల్లోనే ఇప్పిస్తామంటూ..**

నగర, పట్టణాల్లో భవన నిర్మాణాల అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తాజాగా ఈసీ, స్థల ఛాయాచిత్రం, పన్ను రసీదు, భవన నిర్మాణ ప్రణాళిక, యాజమాన్య వాంగ్మూలం, స్థల వివరాలు తెలిపే దస్తావేజులు, ఆటో క్యాడ్ ద్వారా తయారు చేసిన ఇంటి నిర్మాణ ప్రణాళిక అప్‌లోడ్ చేయాలి. అన్నీ సక్రమంగా సమర్పించినా.. అనుమతులకు నెల రోజుల సమయం పడుతుంది. కానీ, వారం రోజుల్లో అనుమతి పత్రాలు వచ్చేలా చేస్తామని మోసగించేవారి సంఖ్య.. మోసపోతున్న వారి సంఖ్య ఎక్కువైంది. ఆన్‌లైన్ దరఖాస్తు అనుమతికి కొంత, ఎల్‌ఆర్‌ఎస్‌లో రెగ్యులరైజ్ చేసేందుకు మరికొంత అంటూ దోచుకుంటున్నారు. **పనికో ధర నిర్ణయించి..**పన్నుకు, పేరు మార్పునకు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదుకు, దరఖాస్తుపై ఆమోదముద్రకు, దాన్ని పరిశీలించి ఉన్నతాధికారికి పంపేందుకు, పైస్థాయి అధికారుల పేరు చెప్పి.. ఇలా ఒక్కోదానికి ఓ ధర నిర్ణయించి దోచుకోవడం మామూలైంది. అదే బహుళ అంతస్తుల భవనమైతే.. యజమాని స్థోమతను బట్టి.. ఆ మొత్తాలు ఉంటాయి. దరఖాస్తుల్లో పేర్కొన్న అంశాలన్నీ సక్రమంగా? కాదా? అన్నది ఎల్‌టీపీలు పరిశీలించాలి. ఇదే అదనుగా కొందరు దరఖాస్తుదారులను ఇబ్బంది పెడుతున్నారు. దీనిపై కమిషనర్ వైవో నందన్ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇస్తాం. ఇప్పటికే ఆ మేరకు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం అని తెలిపారు.

# వనం మనం ఒక్కటై.. వన్యప్రాణికి ఛత్రమై



నెల్లూరు : పెనుశిల నరసింహ వన్యప్రాణి అభయారణ్యం బఫర్‌జోన్(ఎకో సెన్సిటివ్) ఏర్పాటుపై అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, డెవలప్‌మెంట్ సంస్థ తోడ్పాటు తీసుకుని.. ఇప్పటికే మూడు దఫాలుగా కీలక సమావేశాలు నిర్వహించారు. ఈ నెలాఖరులోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసి.. పూర్తిస్థాయి నివేదికను కేంద్రానికి పంపేందుకు సమాయత్తమవుతున్నారు.

**గతంలోనే పచ్చజెండా**

కర్నూలు జిల్లాలోని టైగర్ ఫారెస్ట్ తరహాలో... ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నేలపట్టు పక్షు కేంద్రం తీరులో.. నెల్లూరు- కడప- అన్నమయ్య జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న వన్య ప్రాణుల సంరక్షణకు కేంద్రం ఈ ప్రాంతాన్ని పెనుశిల నరసింహ అభయారణ్యంగా తీర్చిదిద్దాలని కేంద్రం గతంలోనే రాష్ట్ర అటవీశాఖకు ఆదేశాలిచ్చింది. దాంతో ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**విహార కేంద్రంగానూ..**

బఫర్ జోన్ పరిధిలోని అయిదు కి.మీ.లలో రాత్రి 6 నుంచి ఉదయం 6 గంటల వరకు ఇతరుల ప్రయాణంపై నిషేధం విధిస్తారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే నివాసం ఉండేవారు కొత్తగా భవనాలు నిర్మించుకోవాలంటే.. అటవీశాఖ అనుమతి తప్పనిసరి. వన్య ప్రాణులకు ఇబ్బందిలేని పక్షంలోనే అనుమతి లభించే అవకాశం ఉంది. అభయారణ్యం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకుంటే.. జిల్లాతో పాటు అంతరాష్ట్ర ప్రజలకు విహార కేంద్రంగా నిలుస్తుందని అధికారులు చెబుతున్నారు.

**ఏమిటీ బఫర్ జోన్**

అభయారణ్యం చుట్టూ 2 నుంచి 5 కి.మీ. మేర బఫర్ జోన్ ఏర్పాటు చేయనున్నారు. దీని పరిధిలో అత్యధికంగా జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు ఉండగా- తర్వాత అన్నమయ్య, కడప జిల్లాలోని ఉంటాయి. ఈ రెవెన్యూ గ్రామాల్లోని ప్రజలకు సంబంధించిన పూర్తి వివరాలను అటవీశాఖ సేకరిస్తోంది. దీనిపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

**నెలాఖరులోగా నివేదిక** – మహబూబ్‌బాషా, జిల్లా అటవీశాఖ అధికారి, నెల్లూరు


బఫర్‌జోన్ ఏర్పాటు ప్రణాళికను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తాం. దాన్ని రాష్ట్ర అటవీశాఖ ద్వారా కేంద్రానికి పంపుతాం. దీని ఏర్పాటుతో వన్య ప్రాణుల సంరక్షణతో పాటు అక్కడ నివాసాలు ఉండే నెల్లూరు, అన్నమయ్య, కడప జిల్లాల ప్రజలకూ అంతే రక్షణ ఉంటుంది.

# దోచుకున్నా.. దాచేస్తున్నారు!

తిరుపతి : చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లిలో ఆప్షన్-3 కింద 713 ఇళ్లను గుత్తేదారు నిర్మించాల్సి ఉండగా.. గృహ నిర్మాణ సంస్థలోని ఓ డీఈఈ.. అతని భార్య, తల్లి పేరిట పనులు దక్కించుకున్నారు. ఇదేవిధంగా రేణిగుంట మండలం జీపాళ్యం, వడమాలపేట మండలం కల్లూరులోనూ ఆ సంస్థ సిబ్బందే పనులు చేశారు. నిబంధనలు ఉల్లంఘించారని విజిలెన్స్ అధికారులు గుర్తించినా ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు.

పుంగనూరు నియోజకవర్గంలోనూ గతంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన ఇళ్లకు వైకాపా హయాంలో బిల్లులు చేసుకున్నారు. ఇది వాస్తవమేనని జగన్ పాలనలోనే గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సంస్థ అధికారులు, విజిలెన్స్ బృందాలు నిర్ధారించినా బాధ్యులపై చర్యలు లేవు.

వైకాపా హయాంలో గృహ నిర్మాణ సంస్థలో అవినీతి రాజ్యమేలింది. కొందరు అధికారులు, ఆ పార్టీ నాయకులు నిబంధనలకు యథేచ్ఛగా తూట్లు పొడిచారని ఆనాడే అక్రమాలన్నీ వెలుగు చూసినా ఉన్నతాధికారుల వరకు అంతా చోద్యం చూశారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత అప్పటి బాగోతాలపై విజిలెన్స్ యంత్రాంగం విచారణ జరిపింది. అక్రమాలు నిజమేనని తేల్చింది. అయితే ఆ నివేదికలను ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేయడంపై విస్మయం



వ్యక్తమవుతోంది. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు నిధులు రాబడితే భవిష్యత్తులో తప్పులు చేయాలంటే ఎవరైనా భయపడతారు. సొంతంగా ఇల్లు కట్టుకోలేని పేదలకు గృహాలు నిర్మించేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి వైకాపా ప్రభుత్వం టెండర్లు పిలిచింది. వీటిని ఆప్షన్- 3 ఇళ్లుగా పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో 16,393 గృహాలున్నాయి. వాస్తవంగా ఇవి గుత్తేదారులు కట్టాలి. ఇందుకు భిన్నంగా 2,180 ఇళ్లను గృహ నిర్మాణ సంస్థలోని ఇద్దరు డీఈఈలు, వార్డు సచివాలయ ఉద్యోగి, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒకరు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. మొత్తంగా రూ.12.05 కోట్లు వారికి బిల్లుల రూపేణా చెల్లించారు. సిమెంట్, స్టీల్, నిర్మాణ సామగ్రి పేరుతో మరో రూ.4.04 కోట్లు.. వెరసి రూ.16.09 కోట్లు సమర్పించారు.

**ప్రారంభంలో హడావుడి చేసి**

ఈ బాగోతంపై రెండు నెలల క్రితం గృహ నిర్మాణ సంస్థలోని విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. అంతకుముందు కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే రాష్ట్ర విజిలెన్స్ యంత్రాంగం సైతం ఆప్షన్-3 గృహాల నాణ్యత, చెల్లింపుల గురించి ఆరా తీసింది. బాధ్యులెవరో గుర్తించి క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. ప్రజాధనం ఎంత దుర్వినియోగమైందో స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఆ నివేదిక ప్రకారం ఎవరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.


రోజుల వ్యవధిలోనే పూర్తయ్యాయంటూ..: పుంగనూరు నియోజకవర్గంలో అవినీతి కొత్త పుంతలు తొక్కింది. 2014- 19 మధ్య తెదేపా హయాంలో నిర్మించిన, అర్ధంతరంగా ఆగిపోయిన గృహాలకు కూడా ఇక్కడ బిల్లులు చేశారు. రోజుల వ్యవధిలోనే గోడల దశ నుంచి ఇంటి నిర్మాణం పూర్తయిందంటూ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారు. అధికారులు, సిబ్బంది వాటాలు తీసుకొని వైకాపా అనుకూల వ్యక్తుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. దీనిపై సైతం ప్రభుత్వానికి నివేదిక అందింది. ఇదే తరహాలో వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ కాలనీలోనూ రూ.13.75 లక్షల అవినీతి జరిగిందని తేటతెల్లమైంది. 53 ఇళ్లు పూర్తి చేయకుండానే పూర్తి బిల్లులు చెల్లించేశారు.

**ఏ అవకాశాన్ని వదలకుండా దోచి..**

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2020 డిసెంబరులో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద గృహాలు మంజూరు చేశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ రెండు వ్యవహారాల్లోనూ అవినీతి జరిగింది. వీటితోపాటు స్థలాల కొనుగోలు, చదునులోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు వెదురుకుప్పం మండలంలోని కొండ కింద ఉన్న ఓ లే అవుట్‌ను చదును చేసేందుకు రూ.80 లక్షలు ఖర్చు చేశారు. ఇదే ఖర్చుతో అనువైన ప్రాంతంలో మంచి స్థలం కొనుగోలు చేయవచ్చని తెలిసినా ఆ దిశగా అడుగులు పడలేదు. ఇలా అడుగడుగునా వైకాపా నేతలు ప్రభుత్వ సొమ్మును దోచేశారు. సందట్లో సడేమియా అన్నట్టు పలువురు అధికారులు సైతం చేతివాటం ప్రదర్శించారు.

# ఇంతెందుకు.. తగ్గిద్దాం!

తిరుపతి : తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాల స్థానం లో శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల నిర్మాణాలకు వైకాపా హయాంలో ఏకకాలంలో రూ.600 కోట్లకు టెండర్లు ఖరారు చేయడాన్ని విజిలెన్స్ విభాగం గతేడాది ఇచ్చిన నివేదికలో తప్పు పట్టింది. ఎక్కువ కొటేషన్ల టెండర్లు ఆమోదించారని పేర్కొంది. తితిదే గణాంక అధికారి, ఇంజినీరింగ్ విభాగం ఏకకాలంలో రూ.300 కోట్లు అచ్యుతం, రూ.300 కోట్లు శ్రీపాదం వసతి భవనాలకు అనుమతులు ఇవ్వడంలో గత పాలకుల అవినీతి మరకలు ఉన్నాయంటూ నివేదిక సమర్పించింది. ఈ విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈ రెండు సముదాయాల పనులు 2024 మార్చి 15 నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు వసతి కేంద్రాలకు సంబంధించి రూ.300 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు వసతి



గృహాలకు సంబంధించి నిర్మాణ వ్యయం తగ్గించే అవకాశాలు ఉన్నాయంటూ ఇటీవల జరిగిన తితిదే పాలక మండలి సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో కొన్ని అంశాల్లో వ్యయం తగ్గించేందుకు ఇంజినీరింగ్ విభాగం నివేదికలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

**సదుపాయాలు ఇలా..**శ్రీపాదం, అచ్యుతం తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు ఉంటాయి. ఒకటో అంతస్తులో పార్కింగ్, 2వ అంతస్తులో రిసెప్షన్, అన్నదాన కేంద్రం ఉంటాయి. 3, 4 అంతస్తుల్లో 48 డార్మెటరీలు, 5 నుంచి 9 అంతస్తుల్లో 532 గదులు నిర్మిస్తున్నారు.

# వినియోగం పెరిగి.. సరఫరా తగ్గి

పి.గన్నవరం: ఎండలు మండిపోతున్నాయి. వేసవిలో సాధారణంగా తాగునీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ పథకాల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కాకపోవటంతో ప్రజలు ప్రయివేటు ఆర్వో ప్లాంట్ల నుంచి తెచ్చుకుంటున్నారు. ఏప్రిల్ 27న కాలువలు కట్టేశారు. జూన్ 1న నామమాత్రంగా తెరిచారు. పంట కాలువలకు పూర్తిస్థాయిలో నీరు రాకపోవటంతో సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు, గ్రామ పంచాయతీలు నిర్వహించే పథకాల నుంచి కొళాయిలకు నీరందడం లేదు.

**జిల్లాలో 31 పథకాలు..**

జిల్లాలో 31 సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు ఉన్నాయి. ఒక వ్యక్తికి 40 లీటర్ల శుద్ధ జలాలు అందించే విధంగా పథకాలను నిర్మించారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టే పథకాలను ఒక వ్యక్తికి రోజుకు 55 లీటర్లు సరఫరా చేసేవిధంగా రూపకల్పన చేశారు. ఇవి కొన్నిచోట్ల అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఉన్న సమ్మర్ స్టోరేజి ట్యాంకులను



55 లీటర్ల సామర్థ్యంతో విస్తరించాలి. రూ.1,650 కోట్లతో చేపట్టే వాటర్‌గ్రిడ్ పథకం అందుబాటులోకి వస్తే సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.

**రోజు విడిచి రోజు..**

ముంగండలోని పథకంపై 10 గ్రామాలకు చెందిన 25 ఆవాసప్రాంతాల్లో సుమారు 36 వేల మంది జనాభా ఆధారపడి ఉన్నారు. రోజూ 14 లక్షల లీటర్ల శుద్ధజలాలు సరఫరా చేస్తున్నారు. వేసవిలో సుమారు నాలుగు లక్షల లీటర్ల వినియోగం పెరిగింది. మానేపల్లిలోని పథకం ద్వారా ఆరుగ్రామాల్లో 22 ఆవాస ప్రాంతాలకు చెందిన సుమారు 25 వేల మందికి రోజుకు తొమ్మిది లక్షల లీటర్ల శుద్ధజలాలను సరఫరా చేస్తున్నప్పటికీ తాగునీటి సమస్య నెలకొంది. పి.గన్నవరంలో రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నారు.

**రూ.200 కోట్లతో పనులు- సీహెచ్‌ఎన్‌వీ కృష్ణారెడ్డి, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్** జల్‌జీవన్‌మిషన్ నిధులు రూ.200 కోట్లతో పనులు చేస్తున్నాం. గుత్తేదారులకు రూ.55 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ పనులు పూర్తయిన తరువాత ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అవుతుంది.

# ఆట.. అవినీతి మేట!

అమలాపురం : వైకాపా పాలనలో 2024 సార్వత్రిక ఎన్నికల ముందు క్రీడాకారులను, యువతను ఆకర్షించేందుకు ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. దీనికి సంబంధించి కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిలో పలు అవకతవకలు జరిగినట్లు కూటమి ప్రభుత్వం గుర్తించింది. వీటిని నిగ్గు తేల్చాలని విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

**అంతా వారిష్టం..**

15 ఏళ్లు పైబడిన వారికి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో డిసెంబరు 2023 నుంచి 2024 ఫిబ్రవరి వరకు క్రీడలు నిర్వహించారు. దీనికి పెద్దఎత్తున క్రీడా సామగ్రి కొనుగోలు చేశారు. అందులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

**నాసిరకం సామగ్రి**

క్రీడా సామగ్రి కొనేందుకు రూ.కోట్లు కుమ్మరించారు. ఉన్నత స్థాయిలో పర్యవేక్షణ లేక పోవడంతో నాసిరకం సామగ్రి సరఫరా చేశారు. కొన్ని చోట్ల ప్రారంభం రోజునే క్రికెట్ బ్యాట్లు విరిగి పోవడం, వాలీబాల్స్ పగిలి పోవడం, నెట్‌లు చిరిగి పోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆటలు ముగిసిన తర్వాత వాటిని పాఠశాలల్లో భద్రపరచాలని



ఆదేశాలు ఉన్నా వైకాపా నాయకులు, కార్యకర్తలు ఇళ్లకు పట్టుకెళ్లిపోయారు.

**ఈ వివరాలపై ఆరా:** అక్రమాలు తేల్చేందుకు విజిలెన్స్ రంగంలోకి దిగింది. అప్పట్లో ఎవరెవరు విధులు నిర్వహించారు..? ఇప్పుడు వారెక్కడ పని చేస్తున్నారు.? ఏ రకం క్రీడా సామగ్రి సరఫరా చేశారు.? ఏ ఆటలో ఎంత మంది క్రీడాకారుల వివరాలు నమోదు చేశారు? ఎంత మంది పాల్గొన్నారు.? ఎన్ని నిధులు కేటాయించారు.? తదితర వివరాలు అందజేయాలని ఆదేశించారు.

**సచివాలయాల వారీగా..**

గ్రామ, వార్డు సచివాలయాల వారీగా జరిగిన అన్ని రకాల ఆర్థిక లావాదేవీల వివరాలను అందించాలని విజిలెన్స్ అధికారులు కోరినట్లు సమాచారం. ఈ క్రీడలు ముగిసిన తర్వాత ఈ సామగ్రిని ఎవరికి అప్పగించారో తెలియజేయాలని సూచించారు.

**విచారణ జరుగుతోంది..-సురేష్‌కుమార్, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి**

గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై విజిలెన్స్ విచారణ జరుగుతుంది. దీంతో సమగ్ర వివరాలు తెలియజేశాం. విచారణ ముగిసిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడించే వీలు కలుగుతుంది.

# బడులు తెరిచే వేళ.. బాధ్యత మరిచారేల?



పుట్టపర్తి: వేసవి సెలవుల అనంతరం ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈసారి ప్రభుత్వ బడుల్లో పిల్లలకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. దాదాపు 50 రోజులపాటు మూతపడటంతో ఆవరణలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. కొన్నిచోట్ల అపరిశుభ్రత నెలకొంది. ప్రారంభానికి వారం రోజుల ముందు నుంచే తరగతి గదులు, ఆవరణలు శభ్రం చేయించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. పాఠశాలల ప్రారంభానికి ముందే సంసిద్ధతా కార్యక్రమం ప్రకటించారు. ఉపాధ్యాయుల బదిలీలు, ఇతరత్రా కారణాలతో కార్యక్రమాన్ని వాయిదా వేశారు. దీంతో పరిశీలించేవారు లేకపోవడం సమస్యగా మారింది. నీటి నిల్వతో ఇబ్బందులుఅనంత నగరంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ ఇది. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. గోడలకు ఆనుకొని చెత్త కుప్పలున్నాయి. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయింది. తాగునీటి కొళాయిల వద్ద అపరిశుభ్రత నెలకొంది. ఇక్కడ 388 మంది విద్యార్థులున్నారు. బాలికలకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. **బదిలీల ప్రక్రియలో నిమగ్నమై..**

గడచిన పది రోజుల నుంచి ఉపాధ్యాయుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఎవరికి ఏ ప్రాంతం దక్కుతుందోనని ఉపాధ్యాయులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో సహా అందరూ బదిలీల ప్రక్రియలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో చాలావరకు ఎవరూ బడులవైపు చూడలేదు.

**ప్రమాదాలు జరగకముందే..**

బడుల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో విషపురుగులు తిరుగుతున్నాయి. చెన్నేకొత్తపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విష సర్పం కనిపించింది. ఇక పలుచోట్ల నాడు-నేడు కింద చేపట్టిన పనులు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. అసౌకర్యాల నడుమ ఉపాధ్యాయుల పాఠాలు చెప్పాల్సి రావడం.. విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాధ్యమైన మేరకు కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# చదువుల గుడి.. వసతుల ఒడి



కర్నూలు : ఉచిత విద్యకు నిలయాలైన ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన వసతులతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. ఇక్కడ సుశిక్షితులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పాఠాలు చెబుతారు. రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంది. దీంతోపాటు తల్లికి వందనం పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఇన్ని సౌకర్యాలు, ప్రయోజనాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**రూ.135.76 కోట్లతో ఏకరూప దుస్తులు, పుస్తకాలు**

ఉమ్మడి జిల్లాలోని 5,95,722 మంది విద్యార్థులకు పుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.2,279 విలువ చేసే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకిట్లను అందజేస్తున్నారు. ఇందులో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్కుబుక్స్, బెల్టులు, బ్యాగులు, నిఘంటువులు అందించనున్నారు. వీటితో పాటు ఏకరూప దుస్తులను కూడా ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీటికయ్యే రూ.137,76,50,438 ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

**నిపుణులైన ఉపాధ్యాయులు**

నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సాగుతోంది. నంద్యాలలో ప్రాథమిక పాఠశాలల్లో 3,590, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1,699, ఉన్నత పాఠశాలల్లో 6,004 మంది, కర్నూలు జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో 4,077, ప్రాథమికోన్నత బడుల్లో 2,046, ఉన్నత పాఠశాలల్లో 5,387 మంది పనిచేస్తున్నారు.

**పరిశుభ్రతకు ప్రాధాన్యం**

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల శుభ్రతకు విద్యార్థుల సంఖ్యను బట్టి 3245 మంది ఆయాలను నియమించారు. వీరికి నెలకు రూ.6 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.1,94,70,000 గౌరవ వేతనం చెల్లిస్తున్నారు.

**స్మార్ట్ తెరలపై డిజిటల్ బోధన**

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో 1108, కర్నూలు జిల్లాలో 1287 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. 10,321 గ్రీన్‌చాకో బోర్డులను ఏర్పాటు చేశారు.

**మధ్యాహ్న భోజనానికి నిత్యం రూ.41.90 లక్షలు**

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి 100 గ్రాముల చొప్పున అన్నం అందిస్తున్నారు. ఇందుకు రూ.5.88 వ్యయం చేస్తున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రోజుకు 150 గ్రాముల ఆహారం ఇస్తున్నారు. ఇందుకు రూ.8.57 ఖర్చవుతోంది.

ఈ లెక్కన రెండు జిల్లాల్లో కలిపి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు 1,95,475 మందికి రోజుకు రూ.11,49,393, ప్రాథమికోన్నత విద్యార్థులు 1,05,316 మందికి రూ.11,80,406, ఉన్నత పాఠశాలల విద్యార్థులు 2,17,132 మందికి రూ.18,60,821 వ్యయం చేస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో సగటున మధ్యాహ్న భోజనానికి రోజుకు రూ.41,90,620 ఖర్చవుతోంది. భోజనం కాకుండా ఒక్కో విద్యార్థికి వారానికి ఐదు కోడిగుడ్లు ఇస్తున్నారు. వారంలో మూడు రోజులు 450 మిల్లీగ్రాములు చొప్పున రాగి జావ ఇస్తున్నారు.

# రూ.99 కోట్లతో ప్రగతి ప్రణాళిక

గుంతకల్లు : గుంతకల్లు మున్సిపాలిటీలో ఏ కాలనీకి వెళ్లినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. శివారు కాలనీల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఈక్రమంలో 20 రోజుల పాటు ఎమ్మెల్యే గుమ్మనూరు, తెదేపా నాయకులు ఆయా కాలనీల్లో పర్యటించి పలు ప్రధాన సమస్యల్ని గుర్తించారు. ఆ వివరాలన్నీ పురపాలక కమిషనర్‌కు అందజేశారు. తద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.



**పురపాలక మంత్రి దృష్టికి సమస్యలు**

అన్ని కాలనీల్లోని సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ అధికారులు సమగ్ర ప్రణాళికను రూపొందించి దాన్ని ఎమ్మెల్యే జయరాంకు అందజేశారు. ఎమ్మెల్యే నిధుల మంజూరు కోసం పురపాలక శాఖామంత్రి నారాయణకు అందజేశారు. కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు, తాగునీటి పైప్‌లైన్, విద్యుత్తు దీపాల సౌకర్యం తదితర 454 పనులకు రూ.99 కోట్లు ఖర్చు అవుతుందన్న అంచనాతో ప్రణాళికను రూపొందించారు. పురపాలికకు ఇంటి పన్నులు, నీటి పన్నులు, వాణిజ్య సముదాయాల నుంచి లభిస్తున్న అద్దెలు విద్యుత్తు ఛార్జీలు, పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులకు జీత భత్యాలు చెల్లించడానికే సరిపోతోంది. అభివృద్ధి పనులు చేపట్టడానికి సాధారణ నిధులు లేని కారణంగా ప్రభుత్వ గ్రాంట్ల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారుల పక్కన మురుగు కాలువలు లేని కారణంగా పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటిలోనే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే అందజేసిన ప్రణాళికకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసే నిధుల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు.

**నిధులు విడుదలైతేనే పనులు** పురపాలక సంఘం రూపొందించిన ప్రణాళికను ఎమ్మెల్యేకు అందజేశాం. ఆయన ప్రభుత్వానికి సమర్పించారు. నిధుల విడుదల విషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. నిధులు రాగానే పనులు పూర్తి చేస్తే పట్టణ ప్రజల సమస్యలు అన్నీ పరిష్కారమవుతాయి. నయీం అహమ్మద్, కమిషనర్

# కూరగాయలు దరిచేరవా..?

పుత్తూరు : ఉద్యోగ, ఉపాధి కోసం పిల్లల చదువుల నిమిత్తం పట్టణాలకు వచ్చి నివసిస్తున్న, స్థిరపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా సరిపడా రైతుబజార్లు అందుబాటులో లేవు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, పలమనేరు, గూడూరులో తప్ప మరెక్కడా ఇవి లేవు. గత ప్రభుత్వ హయాంలో పుత్తూరు, నగరి, పలమనేరు, తిరుచానూరు, చంద్రగిరిలో వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పలమనేరులో పూర్తిచేసి ప్రారంభించారు. తిరుచానూరులో నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించ లేదు. ప్రస్తుతం వాటి ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. చంద్రగిరిలో పునాదుల దశలోనే వదిలేశారు. పుత్తూరులో స్థల పరిశీలన చేశారు. నగరిలో స్థలం కూడా చూపలేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

**ప్రజలకు ఒనగూరే మేలు..**

మార్కెటింగ్ శాఖ నిధులతో నిర్మించే ఈ రైతుబజార్లలో నామమాత్రపు అద్దెలకు రైతులు, స్వయం సహాయక సంఘాలకు దుకాణాలు కేటాయిస్తారు. వీటి నిర్వహణకు ఎస్టేట్ ఆఫీసర్, ఒక అటెండర్ ఉంటారు. జేసీ, డీఎస్వో, మార్కెటింగ్, ఉద్యానశాఖల అధికారులతో కమిటీ ఉంటుంది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే కిలోకి రూ.5 నుంచి రూ.10 తక్కువ ధరకు ఇక్కడ కూరగాయలు లభ్యమవుతాయి.



టమాటా, ఉల్లిపాయలు తదితరాల ధరలు పెరిగినపుడు రాయితీపై ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించే వెసులుబాటు ఉంటుంది.

**నిధుల కొరతతోనే..**

ప్రభుత్వం మార్కెట్ యార్డుల నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. అయితే సీఎంఎఫ్ ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో మంజూరు అయినా నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఈ నేపథ్యంలో వీటి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తేనే ఆయా ప్రాంతాల్లో రైతుబజార్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

ఉమ్మడి జిల్లాలో నగరపాలక సంస్థలు: 2

పురపాలికలు: 10

ప్రస్తుతం ఉన్న రైతుబజార్లు: 4

నిత్యం వినియోగదారులు: 2 వేలకు పైచిలుకు

అవసరమైన ప్రదేశాలు: శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కుప్పం, పుంగనూరు, పుత్తూరు, నగరి

# ఉపాధి.. సంతృప్తి

కర్నూలు : నలుగురు మహిళా సభ్యులను ఒక యూనిట్‌గా ఏర్పాటుచేసి తృప్తి క్యాంటీన్లు అప్పగిస్తారు. దీనిని నడిపేందుకుగాను 20 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో కంటెయినర్‌ను ప్రభుత్వం సమకూరుస్తుంది. వంట, నిర్వహణ అంశాలపై శిక్షణ ఇస్తుంది. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ ఎలక్ట్రిక్ పరికరాలు అందిస్తారు. సౌరశక్తిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం విపణిలో ఆహార పదార్థాలకు మంచి డిమాండు ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజూ రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు ఉపాధి చూపేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో 'తృప్తి' క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఏపీ మెప్మా, ఓ సంస్థ ఉమ్మడి భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు పురపాలక సంఘాలతోపాటు బేతంచెర్ల నగర పంచాయతీలో కలిపి 25,300 స్వయం సహాయక పొదుపు సంఘాలున్నాయి. 2,58,823 మంది మహిళలున్నారు.

**ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున..**

క్యాంటీన్ నిర్వహణకు పెట్టుబడి రూ.16.40 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కో క్యాంటీన్‌కు సంబంధించి నలుగురు స్వయం సహాయక సంఘాల సభ్యులుంటే ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున రూ.12.40 లక్షలు పెట్టుబడి పెట్టాలి. మిగతా పెట్టుబడి మొత్తం.. కంటెయినర్, యంత్ర పరికరాలు, సౌర విద్యుత్తు, ఇతర అవసరాల రూపంలో మెప్మా, ఓ



సంస్థ ప్రతినిధులు చేయూతనిస్తారు. ఒక్కో క్యాంటీన్ నెలవారీ టర్నోవర్ రూ.6.39 లక్షలు ఉండేలా.. ప్రతినెలా లాభం రూ.2.46 లక్షలు వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

**కాలుష్య రహితంగా..**

వంట కోసం వంద శాతం ఎలక్ట్రిక్, పీఎం సూర్యఘర్ కింద సౌర విద్యుత్తు వినియోగిస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన సదుపాయం ఉంటుంది. అనుభవజ్ఞులైన చెఫ్‌లు, ఎప్పటికప్పుడు అధికారుల ఆహార తనిఖీలు నిర్వహించి పలు సూచనలు అందిస్తారు. ఎప్పటికప్పుడు ఖాతాదారుల అభిప్రాయాలు తెలుసుకుని క్యాంటీన్లను సమర్థంగా నడిపిస్తారు. సంతృప్తి చెందేలా ఆహారం అందిస్తారు.

**24 గంటలు పనిచేసేలా..**

ఈ ఏడాది మార్చి 8 నుంచి జూన్ 8వ తేదీలోగా కర్నూలులో 10, ఆదోని 02, ఎమ్మిగనూరు 01 తృప్తి క్యాంటీన్లను స్వయం సహాయక పొదుపు మహిళలతో ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలోనూ పది వరకు ఏర్పాటు చేయనున్నారు. వీటిని నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లోని ముఖ్యమైన ప్రధాన కూడళ్లు, హైవేను ఆనుకుని ఉన్న ప్రదేశాలను ఎంపిక చేయడంతోపాటు 24 గంటలు పనిచేసేలా చూస్తారు.

# వేసేయ్.. దొంగ మస్టర్లు

సూళ్లూరుపేట : దొరవారిసత్రం మండలంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, అపాచీ కార్మికులు పనులు చేసినట్లు మస్టర్లలో నమోదు చేసి నిధులు పక్కదారి పట్టించారు. సూళ్లూరుపేట మండలంలో గ్రామంలో లేనివారు హైదరాబాద్, చెన్నైలో ఉద్యోగాలు చేసేవారి పేరుతో మస్టర్లలో నమోదు చేసి పంచుకుతిన్నారు. డివిజన్‌లో కొందరు ఎంపీడీవోలు క్షేత్ర సహాయకుల నుంచి నెలవారీ మామూళ్ల రూపంలో తీసుకుంటున్నారనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందడం గమనార్హం. నారాయణవనంలో ఓ క్షేత్ర సహాయకుడు గత ప్రభుత్వంలో రోజువారీ దొంగ మస్టరు వేసి రూ. 20 వేలు కాజేశారు. నెలకు రూ. 6 లక్షలు సంపాదించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు కప్పం కట్టాడు. ఇటీవల అక్రమాలు వెలుగు చూడటంతో సస్పెండ్ చేశారు. పుత్తూరు మండలంలో 2023–24లో రూ. 8.67 కోట్లకు సంబంధించి ఉపాధి హామీ, పంచాయతీరాజ్ శాఖలో పనులు చేపట్టారు. ఫిబ్రవరి 11న సామాజిక తనిఖీ నిర్వహించారు. కేవలం రూ. 1,705 మాత్రమే రికవరీకి ఆదేశించడం గమనార్హం.

పలమనేరు మండలంలో ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలో గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన నలుగురు క్షేత్ర సహాయకులపై వేటు చేశారు. రూ. 70 వేలు కాజేసినట్లు గుర్తించారు. జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు కొందరికి సిరులు కురిపిస్తున్నాయి. పనులకు రాకపోయినా వచ్చినట్లు హాజరు వేసి స్వాహా చేస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం క్షేత్ర సహాయకులు, ఏపీవోలు, సాంకేతిక నిపుణుల కనుసన్నల్లో జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా విచారణ జరిపి సరిపెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటికీ గత ప్రభుత్వ హయాంలో ఉన్న క్షేత్ర సహాయకులు కొనసాగుతున్నారు. వీరిని కొనసాగించేందుకు రూ. లక్షలు వసూలు చేసిన నాయకులు ఉన్నారు. దీంతో క్షేత్ర సహాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల యంత్రాలతో పనిచేసి నిధులు మెక్కేస్తున్నారు. ఎవరికివారు ఉపాధి నిధులను పక్కదారి పట్టిస్తున్నట్లు ఉపాధి శ్రామికులు ఆరోపిస్తున్నారు. యర్రావారిపాలెం మండలంలో ఓ క్షేత్ర సహాయకుడు పదేళ్లు పైగా



పనిచేసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. చేసిన పనులకే మళ్లీ బిల్లులు చేసుకోవడం, దొంగ మస్టర్లు వేయడం వంటివాటితో రూ. కోట్లలో సంపాదించినట్లు ఆరోపణలున్నాయి. డీకేటీ భూముల్లో పాగా వేయడంతోపాటు తిరుపతి పరిధిలో పెద్దఎత్తున ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ మండలంలో అవినీతి తారస్థాయికి చేరడంతో క్షేత్ర సహాయకులు మొదలు ఏపీవో వరకు అందరినీ తొలగించారు.

**సామాజిక తనిఖీలు తెలియకుండా..**

ఏటా ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీల బృందం ప్రతి మండలంలోని పంచాయతీల వారీగా చేపట్టిన పనులు, చెల్లించిన కూలీల నగదు దస్త్రాలు పరిశీలించడంతో పాటు అక్కడ జరిగిన పనులు పర్యవేక్షిస్తుంటారు. వీటికి సంబంధించి ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలి. అయితే ఎవరికీ చెప్పకుండా ముగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు తరచూ తనిఖీ చేయడం, మస్టర్లు, వచ్చిన కూలీలు లెక్కల తీస్తే అక్రమాలు అరికట్టే అవకాశం ఉంది. ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# అక్కడ రాలి.. ఇక్కడ పండుతోంది

పుత్తూరు : ఆరుగాలం కష్టంచి పండించిన మామిడి పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు.. సీజన్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల శ్రమ దోచేస్తుండగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారులు ఏటా కళ్లప్పగించి చూడటం తప్ప పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.05 లక్షల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. అందులో తోతాపురి 55 వేల హెక్టార్లలో సాగవుతుండగా.. బేనీషా, చందూర, ఖాదర్, నీలం, రుమాని రకాలు సాగవుతున్నాయి. ప్రస్తుతం తిరుచానూరు, పుత్తూరు మార్కెట్ యార్డులో సీజన్ ప్రారంభమైంది. నిత్యం 20 లారీల మామిడి కాయలను రాజస్థాన్, ఢిల్లీ, జైపూర్, మహారాష్ట్ర, గుజరాత్ తదితర ప్రాంతాలకు పంపుతున్నారు. సిందూర్ ఉద్రిక్తత నేపథ్యంలో ఉత్తర భారత వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. తోతాపురి రకం జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీలకు తరలిస్తారు. ధరలు ఆశించినట్లు లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పుత్తూరు మార్కెట్ యార్డులో మూడ్రోజుల



క్రితం తోతాపురి టన్ను రూ. 10 వేల నుంచి రూ. 14 వేలు పలికింది. బేనీషా రూ. 30 వేల నుంచి రూ. 35 వేలు ఉంది. చందూర టన్ను రూ. 9వేలు, ఖాదర్ టన్ను రూ. 26 వేలు ఉంది. ఇటీవల గాలి, వానకు రాలిన కాయలు టన్ను రూ. 4వేల నుంచి రూ. 6 వేలకు కొనుగోలు చేస్తున్నారు. తమిళనాడులోని కృష్ణగిరి, కర్ణాటక రాష్ట్రంలోని శ్రీనివాసపురం నుంచి రాలిన కాయలు జిల్లాకు తెచ్చి విక్రయిస్తున్నారు. అక్కడా పూర్తి స్థాయిలో మరో వారం, పది రోజుల్లో సీజన్ ప్రారంభమవుతుంది. ఆ కాయలు వస్తే మన జిల్లాలోని రైతులు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది. సీజన్ ప్రారంభం కాగానే గుజ్జు పరిశ్రమ వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారు. ఈ నేపథ్యంలో తోతాపురి రకం ఎక్కడ తక్కువకు వస్తే అక్కడ కొనుగోలు చేస్తారు. దీంతో జిల్లా రైతులకు ఏటా నష్టం తప్పడం లేదు.

**కలెక్టర్లు చొరవ అవసరం**ఉమ్మడి జిల్లాలోని మామిడి రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఇరువురు కలెక్టర్లు సమావేశాలు నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. రైతులకు అన్యాయం జరగకుండా వ్యాపారులకు, పల్ప్ ఫ్యాక్టరీ యజమానులకు ఆదేశాలు ఇవ్వాలి. ఇతర రాష్ట్రాల నుంచి కాయలు రాకుండా చూడాలి.

# నిగనిగ.. నిజంగా దగా!



ఎలమంచిలి : వేసవి అంటే ఆహార ప్రియులకు ముందుగా గుర్తుకు వచ్చేవి నోరూరించే మామిడి పండ్లు. ఎక్కడ చూసిన ఇవి ఇప్పుడు కంటికి ఇంపుగా కనిపిస్తున్నాయి. ఏడాదికి ఒకసారి వచ్చే మధుర ఫలమని ధర ఎక్కువైనా కొనేందుకు తొందర పడుతుంటారు. తీరా ఇంటికి తెచ్చి రుచి చూస్తే చప్పగా, పుల్లగా ఉండడంతో కంగు తింటున్నారు. సహజంగా కాకుండా రసాయనాలతో మగ్గించడమే దీనికి కారణం. నిగనిగలాడే రంగు చూసి మోసపోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో ఏటా మామిడి పండ్ల వ్యాపారం రూ. 2 కోట్ల నుంచి నుంచి రూ. 3 కోట్ల వరకూ ఉంటుంది. ఈ ఏడాది స్థానికంగా పంట బాగా దెబ్బతినడంతో రాజమహేంద్రవరం, నూజివీడు, రావులపాలెం నుంచి పండ్లు దిగుమతి అవుతున్నాయి. పూర్వం పండ్లను పక్వానికి వచ్చాక కోసి సహజసిద్ధంగా ఎండుగడ్డిలో వేసి ముగ్గబెట్టేవారు. ఇవి చూడటానికి అందంగా లేకపోయినా రుచికరంగా ఉండేవి, ఆరోగ్యానికి మేలు చేసేవి. మారుతున్న కాలంలో కాయలు పక్వానికి రాకుండానే కోస్తున్నారు. గాలులకు రాలిపోయిన కాయలనూ రసాయనాలు వేసి మగ్గిస్తున్నారు. ప్రమాదకర రసాయనాలను గుర్తించి 2011లో ప్రభుత్వం నిషేధించింది. అయినా వ్యాపారులు వీటినే ఉపయోగిస్తున్నారు. ఇవి ఆకర్షణీయంగా ఉండటం వల్ల కొనుగోలుదారులు వీటినే ఎక్కువగా కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. స్థానికంగా రైతులు సహజ పద్ధతిలో పండించి మార్కెట్‌కి తెచ్చినా వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.

అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, పరవాడ, చోడవరం, పాయకరావుపేట ప్రాంతాల్లో మామిడి పండ్ల హోల్‌సేల్ మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడికి రోజూ లారీల్లో మామిడి పండ్లు నుంచి వస్తుంటాయి. వీటిపై అధికారులు నిఘా వేసి నమూనాలు సేకరిస్తే రసాయనాలతో మగ్గబెట్టడానికి అడ్డుకట్ట వేయడం సాధ్యపడుతుంది.

**గుర్తించడం ఇలా...** ప్రమాదకర రసాయనాలు వాడి మగ్గించిన పండ్లపై నల్లమచ్చలు ఏర్పడతాయి. రంగు మాత్రం బాగుంటుంది. ఇవి తింటే రసాయనాల ప్రభావం వల్ల విరోచనాలు, వాంతులు అవుతాయి. తలతిరిగినట్టు ఉంటుంది. ఇటువంటి కాయలు విక్రయిస్తే కేసులు పెడతాం. వీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతాం. నేరం రుజువైతే ఏడేళ్ల జైలుశిక్ష పడుతుంది.

శ్రీజ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఉప్పునీటితో కడిగి వాడాలి.. మార్కెట్‌లో కొన్న మామిడి పండ్లను ఉప్పునీటిలో నానబెట్టి కడగాలి. ఇలా చేసిన తరవాత తినడం మంచిది. స్థానికంగా పండిన పండ్లనే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసుకోవడం మంచిది. రసాయనాలు వాడినవి తినడం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. పిల్లలకు చాలా హానికరం. దీనిని తల్లిదండ్రులు గుర్తించాలి.

నిహారిక, వైద్యులు, ప్రభుత్వ ఆసుపత్రి, ఎలమంచిలి

22 నమూనాలు తీశాం.. జిల్లాలో గత నెలలో 22 వరకు మామిడి పండ్లు నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాం. వీటి నివేదిక రావాల్సి ఉంది. జిల్లా సంయుక్త కలెక్టర్ జాహ్నవి ఇటీవల సమావేశంలోనూ ఈ విషయమై గట్టిగా ఆదేశాలు జారీ చేశారు. ఎలమంచిలి, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం తదితర ప్రాంతాల్లో నమూనాలు సేకరించాం. నర్సీపట్నం తదితర చోట్ల సేకరిస్తాం. పండ్లపై అనుమానాలు ఉన్నవారు 95732 95662 ఫోను నంబరుకు తెలియజేయవచ్చు. కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

బి.రవికుమార్, ఆహార భద్రత తనిఖీ అధికారి

# 'కట్టు'కథలతో.. కాలయాపన!!



విశాఖపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగుపరిచేందుకు మన బడి–మన భవిష్యత్తు (నాడు–నేడు) పేరిట చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో 'నాడు–నేడు' పనుల పేరిట హడావుడి చేశారు. 2021లో ప్రారంభించిన రెండో విడత పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే సిమెంటు, ఇసుక, మెటీరియల్, ఇతర సామగ్రికి సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారు. మరో నెల రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈలోగా పనులు పూర్తి చేసి, విద్యార్థులకు ఇబ్బందులేకుండా చూడాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

20 గదులకు నాలుగే పూర్తి: చంద్రంపాలెం పాఠశాలలో 20 అదనపు తరగతి గదులు మంజూరు చేశారు. అందులో నాలుగు పూర్తికాగా.. మరో ఎనిమిది అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఏటా అక్కడ ఆరో తరగతిలో దాదాపు 1200 మంది ప్రవేశాలు పొందుతారు. తరగతి గదులు సరిపోక వారంతా ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. తోటగరువు ఉన్నత పాఠశాల, చినగదిలి సంతపాలెంలోని ప్రాథమిక పాఠశాలల్లోనూ అదే పరిస్థితి నెలకొంది.

**స్పష్టత కరవై..:** మొదట్లో ఆయా పనులకు ప్రభుత్వమే సిమెంటు, ఇసుక, పెయింట్..తదితర సామగ్రి సరఫరా చేసేది. 2023 ఫిబ్రవరి నుంచి సిమెంటు, ఇసుక సరఫరా నిలిచిపోయింది. బయట కొనుగోలు చేసి పనులు చేయమని లేదా త్వరలో సరఫరా చేస్తామని.. ఇలా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రావట్లేదు.

విశాఖలో 300కు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు మంజూరు కాగా.. గతేడాది ఫిబ్రవరి (గడువు)లోగా పూర్తయినవి 20 లోపే. ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేదు. బకాయిలు విడుదల చేస్తేనే పెయింటింగ్ పనులు చేస్తామని గుత్తేదారులు తేల్చి చెప్పేస్తున్నారు. అధికారిక వెబ్‌సైట్‌లోని సమాచారం ప్రకారం రెండో విడతలో భాగంగా 315 పాఠశాలల్లో 2,191 పనులు మంజూరయ్యాయి. దాదాపు రూ. 122.84 కోట్లతో పనులు చేపట్టారు. ఇప్పటికీ 1,555 పనులు కొనసాగుతున్నాయి.

**త్వరలో పూర్తి చేస్తాం**

కొన్ని పాఠశాలల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో నిలిచిన పనులను సమగ్ర శిక్ష విభాగానికి అప్పగించారు. చిన్న చిన్న పనులను పెండింగ్ జాబితాలో చేర్చి, చేయిస్తున్నాం. వాటిని పాఠశాలలు పునఃప్రారంభించేలోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

డా. జె. చంద్రశేఖర్‌రావు, ఏపీసీ, సమగ్ర శిక్ష

# అనధికార లేఅవుట్లు.. ఖజానాకు తూట్లు



పెద్దవడుగూరు : పెద్దవడుగూరుతోపాటు జాతీయ రహదారి, ఇతర ప్రాంతాల్లో కొందరు అనధికారికంగా లేఅవుట్లు వేసి పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి ఇతరులకు దర్జాగా విక్రయిస్తున్నారు. వాస్తవానికి పంచాయతీ, రెవెన్యూశాఖలకు పదిశాతం పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇవేవీ జరగడం లేదు.

**అన్నీ వ్యవసాయ భూములే..**

పెద్దవడుగూరులోని మిడుతూరు, చిన్నవడుగూరు, లక్షుంపల్లి, తెలికి రోడ్లతోపాటు ఆశ్రమం వెనుక భాగంలో కొందరు అక్రమంగా లేఅవుట్లు వేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇక్కడున్నవన్నీ వ్యవసాయ భూములే కావడం గమనార్హం.

**జాతీయ రహదారి పక్కనే..**

టోల్‌ప్లాజా, క్రిష్టిపాడులోని 67వ జాతీయ రహదారుల సమీపాన అడ్డగోలుగా లేఅవుట్లు వేసి విక్రయించేస్తున్నారు. పెద్దవడుగూరులోని 1.84ఎకరాల పొలంలో ప్లాట్లు వేసి విక్రయించారు.

లక్షుంపల్లి రోడ్డులో రెండేళ్ల కిందట వ్యవసాయ పొలాన్ని కొందరు కొనుగోలు చేసి ప్లాట్లు వేసి అధిక ధరలకు అమ్మేశారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

–ఉషారాణి, తహసీల్దారు, పెద్దవడుగూరు

క్రిష్టిపాడు జాతీయ రహదారి సమీపాన ప్లాట్లు వేస్తున్నట్లు మాదృష్టికి రావడంతో నోటీసులు జారీ చేశాం. మిగిలిన ప్రాంతాల్లో వేసిన ప్లాట్ల సమాచారం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

# రైతులపై అప్పుల టమోత

టమాటా రెండేళ్ల కిందట రైతులకు లాభాలు తెచ్చిపెట్టింది. అప్పట్లో సాధారణ సాగు లక్ష్యం నమోదవగా దిగుబడులు సైతం ఆశాజనకంగా రాలేదు. అయినా పంటకు అధిక డిమాండ్ ఉండటంతో కొంతమంది లక్షాధికారులుగా మారారు. ఈ ఏడాది వేసవి సీజన్‌లో వాతావరణం అనుకూలించింది. సాగు విస్తీర్ణం రెట్టింపైంది. దిగుబడులు సైతం గణనీయంగా పెరిగాయి. దీంతో ధరలు పతనమై.. రైతులపై అప్పుల మోత పడింది.

**కర్ణాటకకు వెళ్లినా.. ప్చ్**

ఇక్కడ ధర లేదని కర్ణాటకలోని మార్కెట్లకు తీసుకెళ్లా. అక్కడా బాక్సు గరిష్ఠంగా రూ. 70 పలికింది. రవాణా ఖర్చులు సైతం చేతి నుంచి పెట్టుకున్నా. నాలుగు ఎకరాల్లో రూ. 6 లక్షలు ఖర్చుచేశా. ఈ ధరల ప్రకారం పంట మొత్తానికి రూ. 2.5 లక్షలు వస్తుంది. మిగిలింది నష్టమే. రవీంద్రారెడ్డి, కూర్మాయి

**అప్పు తెచ్చి సాగు చేశా**

ఐదెకరాల్లో సాగుచేశా. ఎకరాకు రూ. 2 లక్షల చొప్పున రూ. 10 లక్షలు పెట్టా. ఇందులో రూ. 9 లక్షలు అప్పు తెచ్చిందే. ప్రస్తుతం తోటలో



మొత్తం కాయలే. కూలీలు, రవాణా ఛార్జీలు పెట్టుకోలేక వదిలేశా. కనీసం ఇతర కూరగాయల పంటలకు ప్రోత్సాహం అందించాలి. మునిరెడ్డి, మద్దలకుంట

**కిలో రూ. 20కి ప్రభుత్వమే కొనాలి**

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం స్పందించాలి. ఇప్పటి పరిస్థితుల ప్రకారం రూ. 20కి కొనుగోలు చేస్తేనే పెట్టుబడి వస్తుంది. ఆ మేరకు పాలకులు చొరవ చూపాలి. ఎకరాన్నరలో రూ. 4.5 లక్షలు పెట్టుబడి అయింది. ఇందులో రూ. 3 లక్షలు అప్పే. 1200 బాక్సుల కాయలు వదిలేశా. మల్లికార్జున, కమ్మపల్లె

**బంగారానికి వడ్డీ కట్టలేం**

మూడు ఎకరాల్లో సాగుచేశా. మల్చింగ్, 7 అడుగుల కర్రలు నాటా. మొత్తం 6 లక్షలు ఖర్చయింది. బంగారం తాకట్టు పెట్టి నగదు తెచ్చా. రోజుకు 300–400 బాక్సులు మార్కెట్‌కు తరలిస్తున్నా. నెల రోజులుగా రూ. 55–70 మధ్య ఉంటోంది. ఖర్చులు పోగా రూ. 10–20 మిగులుతోంది. వడ్డీ కూడా కట్టలేని దుస్థితి. ప్రభుత్వం ఆదుకోవాలి. గోవిందప్ప, బైరెడ్డిపల్లె

**ధరల స్థిరీకరణ అవసరం**

టమాటా రైతుల పరిస్థితి దారుణం. గతంలో మామిడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కొంత మొత్తం ఇచ్చింది. టమాటా రైతులను ఆదుకోవాలి. పది శాతం కమిషన్ రద్దు చేయాలి. ధరల స్థిరీకరణ చేయాలి.

టి.జనార్దన్, జిల్లా అధ్యక్షుడు ఏపీ రైతు సంఘం

నష్టం అంచనా

ఎకరాకు దిగుబడి: 2800

బాక్సులు (15 కిలోల చొప్పున)

బాక్సు ధర: రూ. 50

రైతుకు వచ్చే మొత్తం: రూ. 1.40 లక్షలు

కోత, రవాణా, కమిషన్: రూ. 60 వేలు

రైతుకు మిగిలేది: రూ. 80 వేలు

ఎకరాకు నష్టం: రూ. 1.70 లక్షలు

మొత్తం: రూ. 116.87 కోట్లు

జిల్లా గణాంకాలు

సాధారణ సాగు : 3400 ఎకరాలు

ఈ ఏడు సాగైంది: 6875 ఎకరాలు

రైతుల సంఖ్య: 2500

ఎకరాకు పెట్టుబడి: 2.5 లక్షలు (సగటు)

మొత్తం వ్యయం: రూ. 171.87 కోట్లు

# గిర్రున.. గరిష్ఠాలకు

చిత్తూరు : వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 42–43 డిగ్రీలకు చేరుతున్నాయి.. వడగాలుల సెగలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు.. అధిక శాతం మంది ఇళ్లకే పరిమితమవుతున్నారు.. ఈ ప్రభావంతో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగి మీటరు గిర్రున తిరిగి బిల్లుల మోత మోగుతోంది.

**మరింతగా పెరుగుదల..**

వేసవి రాక ముందు ఉమ్మడి జిల్లాలో సగటు వినియోగం రోజుకు 19–20 మిలియన్ యూనిట్లలోపే ఉంటుంది. ప్రస్తుతం ఏసీ, కూలర్లు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్లు ఎక్కువగా వాడుతున్నారు. దీంతో ఈ వారం రోజుల్లో వినియోగం బాగా పెరిగింది. వారం కిందట 22.25 ఉన్న



వినియోగం బుధవారానికి 25.01 ఎంయూకి చేరింది. గతేడాది మేలో విద్యుత్తు వినియోగం 22–23 ఎంయూ ఉండగా.. ఈ ఏడాది రెండు మిలియన్ యూనిట్లు అధికంగా ఉంది. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్య గరిష్ఠంగా వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఏసీల వాడకంతో బిల్లు మోత మోగుతోంది.

**28 యూనిట్ల వరకు అవసరం** ఈ ఏడాది గరిష్ఠ వినియోగం 28 ఎంయూ వరకు వెళ్లే అవకాశం ఉన్నట్లు విద్యుత్తు శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నడూలేనంతగా వినియోగం పెరిగినా ఆ మేరకు కొరత లేకపోయినా ఫ్యూజులు, జంపర్‌లు కాలిపోతున్నాయి. నియంత్రికలు వేడెక్కి మొరాయిస్తున్నాయి. దీంతో స్థానికంగా సమస్యలు ఎదురవుతున్నాయి. సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు చర్యలు చేపట్టామని విద్యుత్తు శాఖ తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్ఈలు సురేంద్ర నాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

# లోపాలపుట్ట

అనకాపల్లి : జిల్లాలో నకిలీ పేర్లతో రుణాలు స్వాహా చేసి బురిడీ కొట్టించిన ఘటనలపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించడం లేదు. అనకాపల్లిలో నకిలీ పొదుపు సంఘాలతో బ్యాంకుల నుంచి రూ. కోట్ల సొమ్ములు పక్కదారి పట్టించారు. ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరపలేదు.. రికవరీలు చేయలేదు. దిగువ స్థాయిలో ముగ్గురు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలతో చేతులు దులిపేసుకున్నారు. తాజాగా కశింకోట మండలంలో పాలప్రగతి కేంద్రాల పేరిట సిబ్బందే రూ. లక్షలు స్వాహా చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. దశాబ్దం క్రితమే ఈ రుణాలు పక్కదారి పట్టినా అధికారులు ఇప్పటివరకు గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బయట వ్యక్తి ఫిర్యాదు చేసిన తర్వాత హడావుడిగా విచారణ జరిపించారు. వెలుగులో పనిచేసి మానేసిన ఓ ఉద్యోగిని బాధ్యునిగా చూపించి మిగతా అధికారుల పర్యవేక్షణ లోపాలను కప్పిపుచ్చాలని చూస్తున్నారు. పొదుపు మహిళలు పాల ప్రగతి కేంద్రాల పేరుతో డెయిరీ యూనిట్ ఏర్పాటుకు ముందుకొస్తే బ్యాంకులు రుణాలు ఇచ్చేవి. వీటికి ప్రభుత్వం రాయితీలు ఇచ్చేది. అప్పట్లో కొంతమంది వెలుగు సిబ్బంది డ్వాక్రా సభ్యులకు తెలియకుండానే వారి పేరుతో రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలను వాడుకున్నారు. కశింకోట మండలంలో ఎనిమిది సంఘాల పేర్లతో రుణాలు రాయితీలు కలిపి రూ. 45 లక్షల వరకు పక్కదారి పట్టించారు. వాటిలో నాలుగు సంఘాల రుణాలు తిరిగి చెల్లించగా మరో నాలుగు సంఘాలు బ్యాంకుకు టోకరా వేశాయి. జిల్లాలో చాలాచోట్ల ఈ తరహా అక్రమాలు జరిగినా విచారణ ఈ ఒక్క మండలానికే పరిమితం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బోగస్ సంఘాలతో బురిడీ.....**

సెర్ప్ ఐబీ (ఇనిస్టిట్యూషనల్ బిల్డింగ్) పోర్టల్‌లో నమోదైన మహిళలనే డ్వాక్రా సభ్యులుగా గుర్తిస్తారు. వారికి మాత్రమే బ్యాంకులు రుణాలు ఇస్తాయి. కాని కొంతమంది వెలుగు సిబ్బంది డ్వాక్రా మహిళలకు తెలియకుండానే ఇతర అవసరాల కోసమంటూ సంతకాలు తీసుకుని



వారి పేరుతోనే రుణాలు పొందుతున్నారు. ఐబీ పోర్టల్‌లో నమోదుకాని వారి పేర్లను చేర్చి బోగస్ సంఘాలను తయారు చేస్తూ వాటితో బురిడీ కొట్టిస్తున్నారు. కశింకోట మండలంలో పాల ప్రగతి కేంద్రాలకు బ్యాంకులు ఒక్కో సంఘానికి రూ. 5 లక్షలు రుణంగా ఇచ్చాయి. ప్రభుత్వం రూ. 1.25 లక్షల నుంచి రూ. 1.75 లక్షల వరకు రాయితీ ఇచ్చింది. వీటిలో సుమారు రూ. 20 లక్షల మేర బ్యాంకులకు చెల్లించకుండా ఎగవేశారు. మరో రూ. 20 లక్షలకు సంబంధించి వడ్డీ, రాయితీ లబ్ధిని పొందారు. ఇటీవల ఒకరు ఫిర్యాదు చేసిన తర్వాత విచారణ చేపట్టగా ఆయా సంఘాల్లో సభ్యులు ఈ రుణాల గురించి మాకేమీ తెలీదని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పట్లో వెలుగు సీసీ పిలిచి ఫోటోలు, సంతకాలు తీసుకున్నారు తప్ప ఈ రుణాల్లో పైసా సొమ్ము కూడా తమకు ఇవ్వలేదని అధికారుల ఎదుట చెప్పారు. వారు చెప్పిన సీసీ గతంలోనే వెలుగు ఉద్యోగం మానేసి వెళ్లిపోయారు. ఈ బోగస్ రుణాలకు అతనే బాధ్యుడిగా తేల్చారు. అయితే ఆ సమయంలో పనిచేసిన ఏపీఎం, ఏరియా సమన్వయకర్తల బాధ్యత గురించి విచారణ నివేదికలో ప్రస్తావించనేలేదు. సంస్థ నుంచి బయటకు వెళ్లిపోయిన వ్యక్తి నుంచి రికవరీ ఎలా చేయాలన్నది సూచించకపోవడం విశేషం.

# స్కేటింగ్ అభిమానులకు పండగే

విశాఖపట్నం : ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ).. 2026లో స్కేట్ బోర్డింగ్ జాతీయ పోటీలు విశాఖలో నిర్వహించాలను కుంటోంది. అలాగే 2027లో ఆసియా ఛాంపియన్‌షిప్‌నకు నగరం వేదిక కానుంది. ఇందుకోసం స్కేట్ బోర్డింగ్ పార్క్ నిర్మించే యోచన చేస్తున్నారు. విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో దీన్ని చేపట్టాలని ఏపీఆర్ఎస్ఏ కోరిన నేపథ్యంలో ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. పోటీల నిర్వహణ సమయానికి అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక చేస్తున్నారు.

నగరంలో: బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్, శివాజీ పార్క్, స్టీల్‌ప్లాంట్, మురళీనగర్, మధురవాడల్లో రోలర్ స్కేటింగ్ రింక్‌లున్నాయి. వీటిల్లో 2 వేల మందికిపైగా సాధన చేస్తున్నారు. అలాగే 50 మందికిపైగా కోచ్‌లున్నారు. గతంలో నిర్వహించిన ఆసియా ఛాంపియన్‌షిప్, జాతీయ పోటీల్లో విశాఖ క్రీడాకారులు విజేతలుగా నిలిచి స్ఫూర్తిచాటారు. స్కేటింగ్‌లో 11 రకాల పోటీలు



ఉంటాయి. వీటన్నింటి నిర్వహణకు పూర్తిస్థాయి పార్క్ అవసరం.

ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ పార్క్‌లో 200 మీటర్ల స్పీడ్ స్కేటింగ్ ట్రాక్ ఉంది. రోలర్ హాకీ అందుబాటులో ఉంది. శివాజీపార్క్‌లో ఆర్టిస్టిక్ స్కేటింగ్ రింకుంది. అయిదెకరాలు అవసరం రోలర్ హాకీ, ఆర్టిస్టిక్ స్కేటింగ్, రోలర్ ఫ్రీ స్టైల్, ఇన్ లైన్ ఫ్రీస్టైల్ రింకు, స్కేట్ బోర్డుకు నిర్ణీత కొలతల్లో పార్క్ అవసరం. వీటన్నింటికి అయిదెకరాల స్థలం కావాలి. ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ పార్క్‌లో ఉన్న రింకును అలానే ఉంచి దానికి అదనంగా మరికొన్నింటిని నిర్మించాలనుకుంటున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు తాత్కాలిక పార్కులే తప్ప పూర్తిస్థాయి నిర్మాణాలు ప్రత్యేకంగా ఎక్కడా లేవు. ఇది అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోనే మొదటి పార్క్‌గా నిలుస్తుంది. ఆకృతులు, నిర్మాణ వ్యయం, ఇతర పనులపై కసరత్తు సాగుతోంది. సుమారు రూ. 1.50 కోట్ల వరకు అవుతుందని ప్రాథమికంగా భావిస్తున్నారు.

# అరకొర వైద్యం.. నిర్వహణ అధ్వానం



అనంతపురం : అల్లోపతికి బదులుగా ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యసేవలు పొందడానికి రోగులు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా ఆయుష్ పేరిట ప్రభుత్వం వైద్యశాలలు ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే క్షేత్రస్థాయిలో రోగులకు సేవలు అందడం లేదు. వాటి నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆయుర్వేద, హోమియో, యునాని ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది లేకపోవటంతో కొన్నింటిని మూసివేయడం గమనార్హం. వైకాపా పాలనలో పోస్టులను భర్తీ చేయకపోవటంతో ఆయుష్ సేవలు అందని ద్రాక్షలా మారాయి.

**సిబ్బంది లేకపోవడంతో..**

హవగళి, పామిడి, తరిమెల, కిరెకెర, చారుపల్లి, చిలమత్తూరు, గోరంట్ల, కరుకుంట, నూతిమడుగు, రాయదుర్గం, పుట్టపర్తి, తవలం, డి.హీరేహాళ్, ధర్మవరం, గాండ్లపెంట ఆసుపత్రుల్లో వైద్యులు మాత్రమే పని చేస్తున్నారు. కాంపౌండర్, స్వీపర్ లేకపోవటంతో వైద్యశాల నిర్వహణను వైద్యులే చూసుకుంటున్నారు.

**ఇక్కడ స్వీపర్లే దిక్కు..**

పుట్లూరు, కంబదూరు, బెళుగుప్పలో వైద్యులు, కాంపౌండర్లు లేకపోవటంతో స్వీపర్లే ఆసుపత్రులు తెరుస్తుండటం గమనార్హం.

**రెండేళ్లుగా మూత ఉరకొండ**

ఉరవకొండలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఆయుర్వేద వైద్యశాల ఉంది. ఇది మూతపడి రెండేళ్లు అయింది. గతంలో
సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి సేవలు బంద్ అయ్యాయి. గతంలో రోజుకు 50 నుంచి 80 మంది సేవలు పొందేవారు.

వజ్రకరూరు మండలం గడే హోతూరు పీహెచ్‌సీలో ఉన్న ఆయుర్వేద ఆసుపత్రిలో ఏడాదిన్నరగా వైద్యుడు లేరు.

**ఖాళీలు భర్తీ చేయక..**

: కొన్నేళ్ల కిందట జూటూరులో యునాని వైద్యశాలను ఏర్పాటు చేశారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో పెద్దపప్పూరు పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా నిర్మించిన వైద్యశాలలోకి మార్చారు. సిబ్బంది ఉద్యోగ విరమణ చేయగా... కొత్తవారిని నియమించకపోవడంతో మూడేళ్లుగా మూతపడింది.

**ఖాళీ పోస్టులు భర్తీ చేస్తాం- డాక్టర్ శేఖర్‌రాజు, ఆయుష్, ఆర్‌డీడీ, కడప**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యశాలల్లో ఖాళీ పోస్టుల వివరాలను కమిషనర్‌కు పంపాం. త్వరలోనే భర్తీకి చర్యలు తీసుకుంటాం. యూనాని వైద్యశాలలో మినహా ఎక్కడా మందుల కొరత లేదు. పోస్టుల భర్తీ తరువాత మూసివేసిన వాటిని తెరిచేందుకు చర్యలు తీసుకుంటాం.

పంపుహౌస్‌లో ఆసుపత్రి

తాడిపత్రిలో వైద్యవిధాన పరిషత్తు ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న తాగునీటి పంప్‌హౌస్ గది హోమియో వైద్యశాల నిర్వహిస్తుండటం గమనార్హం.

ఇక్కడ గత మూడేళ్లుగా కాంపౌండర్ మాత్రమే ఉన్నారు. నిత్యం 15 మంది వరకు వస్తుంటారు.

నాలుగు నెలల నుంచి మందుల కొరత ఉంది.

# రోజంతా నీరు.. ఎప్పటికి చేరు!



విశాఖపట్నం : మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో 24 గంటల నీటి సరఫరా ప్రాజెక్టుకు గతంలో శ్రీకారం చుట్టారు. ఏడీబీ (ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్) నిధులతో చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా దీన్ని చేపట్టారు. రెండేళ్ల క్రితమే పూర్తికావాల్సి ఉన్నా ఆలస్యమైంది.

రైవాడ నుంచి ప్రధాన పైపులైను 50 కిలోమీటర్లు వేయాలి. కోర్టు వివాదంతో ఒక కిలోమీటరులో పని నిలిచిపోయింది. తాజాగా వివాదం కొలిక్కిరావడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది.

**15,000 పూర్తి:** నగరంలో ఉత్తరం, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో దాదాపు మూడు లక్షల మందికి ప్రయోజనం కలిగేలా 65 వేల కనెక్షన్లు ఇవ్వడానికి ప్రాజెక్టులో ప్రతిపాదించారు. ఇప్పటి వరకు 15 వేల కనెక్షన్లు ఇచ్చి 24 గంటలు నీరు అందిస్తున్నారు. మరో 25 వేల కనెక్షన్లకు ప్రస్తుతం 4 నుంచి 5 గంటల పాటు నీరు అందేలా పనులు పూర్తి చేశారు. మొత్తం 320 కిలోమీటర్ల అంతర్గత పైపులైన్ల నిర్మాణానికి ఇప్పటి వరకు 296.56 కిలోమీటర్లు పూర్తి చేశారు.

**తుది దశకు రిజర్వాయర్ల నిర్మాణం**: రైవాడ నుంచి 15 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ ఫర్ డే) నీటిని సేకరించి, అందులో 4 ఎంజీడీల నీరు పరిశ్రమలకు ఇస్తారు. మిగిలిన 11 ఎంజీడీల నీరు నిల్వకు అనువుగా ఆరు ప్రాంతాల్లో భారీ ట్యాంకుల నిర్మాణానికి ప్రణాళికలు చేశారు. మాధవధార, అబిద్‌నగర్, రామ్మూర్తిపంతులుపేట, నరసింహనగర్, పద్మనాభపురం, మురళీనగర్‌లలో వీటిని ప్రతిపాదించారు. వీటిలోపద్మనాభపురం, రామ్మూర్తిపంతులుపేట వద్ద నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి.

గోపాలపట్నం నుంచి కంచరపాలెం, ఎన్ఎస్‌టీఎల్ మురళీనగర్, మాధవధార నుంచి హెచ్‌బీ కాలనీ, కేఆర్ఎంకాలనీ వరకు ఉన్న గృహాలకు ఈ ఏడాది డిసెంబరు నుంచి 24 గంటలు నీటిని అందించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీరు కేవీఎన్ రవి పేర్కొన్నారు. కేఎల్ (కిలో లీటరు)కు రూ.7లు వసూలు చేయనున్నారు. ఒక్కో ఇంటికి నెలకు రూ.120–150 వరకు ఛార్జీలు వసూలు చేసే అవకాశం ఉంది.

**రూ.30కోట్ల చెల్లింపునకు పచ్చజెండా..**

ఈ ప్రాజెక్టును రూ.447 కోట్లతో చేపట్టారు. నిధుల్లో 78.50 శాతం ఏడీబీ నుంచి, మిగిలినది రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ప్రాజెక్టు పూర్తయితే పది సంవత్సరాల నిర్వహణ బాధ్యత గుత్తేదారుదే. గుత్తేదారుకు ఇప్పటికి రూ.250 కోట్లు చెల్లించినట్లు సమాచారం. తాజాగా మరో రూ.30 కోట్లు ఇవ్వడానికి అనుమతులు లభించాయి. పాత పైపుల స్థానంలో కొత్తవి వేయడం వల్ల 2.80 మిలియన్ లీటర్ల నీరు ఆదా అవుతుందని అంచనా. వినియోగించే నీటికి కచ్చితమైన లెక్క ఉండేలా ప్రత్యేక సాంకేతిక విధానాన్ని ఈ ప్రాజెక్టులో అమలు చేస్తున్నారు. ఇళ్లకు ఇచ్చే ప్రతి కనెక్షన్‌కు మీటరు అమర్చుతారు. నీటి సరఫరాతో పాటు..పొదుపుపైనా దృష్టి సారిస్తారు.

# అడంగల్ అందితేనే నవీకరణ!



అనంతపురం : జిల్లాలో ఖరీఫ్ పంట రుణాల నవీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. కొత్తపంట రుణాలకు, బంగారంపై రుణం తీసుకోవాలన్నా.. పాత రుణాలు నవీకరణ చేసుకోవాలన్నా వన్‌బీ, అడంగల్ పత్రాలు తప్పనిసరి. మీసేవా కేంద్రాల్లో రుసుం చెల్లిస్తే తహసీల్దారు డిజిటల్ సంతకంతో కూడిన పత్రాలు పొందవచ్చు. కేంద్రం నిర్వాహకుల వద్దకు వెళ్తే వన్‌బీ వస్తోంది. కానీ అడంగల్ రావడం లేదు. దీంతో నవీకరణకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.10,200 కోట్ల పంట రుణాలు**

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో జిల్లాకు వ్యవసాయ పంట రుణాల కోసం రూ.10,200 కోట్లు ప్రకటించారు. జిల్లాలో 3.50 లక్షల మంది రైతులు ఉన్నారు. ఖరీఫ్ జూన్ ఒకటో తేదీ నుంచి మొదలవుతుంది. విత్తనాలు, ఎరువులు, భూములు దుక్కులు చేసుకునేందుకు బ్యాంకు రుణాలపై రైతులు ఆధారపడి ఉన్నారు. ఏప్రిల్, మే నెలల్లో రుణాలు నవీకరణ జరిగితే సేద్యంతోపాటు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటారు. గత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్తగా పంట రుణాలు, పాత రుణాల నవీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 38 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ 10 శాతం రుణాలు కూడా నవీకరణ జరగలేదు.

**తగిన చర్యలు తీసుకుంటాం..– వసంతబాబు, ఆర్డీవో (కళ్యాణదుర్గం డివిజన్)**

మీసేవ కేంద్రాల్లో అడంగల్ రాలేదన్నది మా దృష్టికి రాలేదు. అడంగల్ ఏపీ సేవ పోర్టల్‌లో వస్తుంది. నిర్వాహకులు యూజర్ ఐడీ పాస్‌వర్డ్ ఏపీ సేవ పోర్టల్‌కు అనుసంధానం చేసుకుంటేనే పత్రాలు ఆన్‌లైన్‌లో వస్తాయి. తప్పకుండా రైతులకు అందేలా చర్యలు తీసుకుంటాం.

**అవస్థలు పడుతున్నాం – రామన్న, రైతు ఇట్లంపల్లి, కళ్యాణదుర్గం మండలం**కళ్యాణదుర్గంలోని మీసేవ కేంద్రానికి వెళ్లా. అడంగల్ అడిగితే నిర్వాహకులు రాలేదంటున్నారు. బ్యాంకుకు వెళ్తే అది తీసుకోస్తేనే రెన్యువల్ చేస్తామంటున్నారు. దిక్కుతోచక 10 రోజులు నుంచి మీసేవ కేంద్రం చుట్టూ తిరుగుతూనే ఉన్నా.

# బైపాస్ కూడళ్లలో రక్షణేదీ..?

పుత్తూరు : తిరుపతి–చెన్నై జాతీయ రహదారి నగరి నియోజకవర్గంలోని వడమాలపేట, పుత్తూరు, నగరి మండలాల పరిధిలో బైపాస్ రోడ్డు నిర్మించారు. ప్రధానంగా కూడళ్లలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణంగా రహదారి వెంబడి గ్రామాలు ఉండటంతో ప్రజలు పట్టణాల్లోకి రావాలన్నా, గ్రామాలకు వెళ్లాలన్నా కచ్చితంగా బైపాస్ రోడ్డు దాటాల్సిందే. ఇటీవల బైపాస్ రోడ్డులకు ఆనుకుని విపరీతంగా టీ దుకాణాలు, హోటళ్లు వెలిశాయి. వీటి వద్ద కనీసం సూచికలు లేవు. ఇక్కడ వాహనాలు అడ్డదిడ్డంగా రహదారులపైనే నిలుపుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

విద్యుత్తు దీపాలు లేవు. సూచిక బోర్డులు కనిపించవు. మితిమీరిన వేగం వెరసి 205 బైపాస్ అంటేనే ప్రమాదాలకు నిలయంగా మారుతోంది.. పలువురు మృత్యువాత పడుతున్నా, మరెందరో క్షతగాత్రులవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడంలేదు.

**రోడ్డు దాటాలంటే..**రాత్రి సమయాల్లో బైపాస్‌లో చీకటి రాజ్యమేలుతోంది. ముఖ్యంగా గ్రామాలకు వెళ్లే కూడళ్లు వద్ద ఎలాంటి విద్యుత్తు దీపాలు అందుబాటులో లేవు. దీంతో రాత్రి సమయాల్లో ఇక్కడ రోడ్డు దాటాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణ సమయంలో ప్రధానంగా కూడళ్లలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది.



అయితే గత పుష్కరకాలంగా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులతో మాట్లాడారు. అనంతరం పాదిరేడు క్రాస్, కదిరిమంగళం, పున్నమి బైపాస్ రోడ్డు వద్ద విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. మిగిలినచోట్ల ఎక్కడా ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడ సైతం తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సోలార్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో గ్రామాల వద్ద రోడ్డు క్రాస్ చేసి చోట్ల విధిగా సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తే అటు ప్రజలకు సౌలభ్యంతో పాటు ప్రమాదాలు నియంత్రించవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు.

**వడమాలపేట వద్ద..** తిరుపతి–చెన్నై జాతీయ రహదారి నుంచి మండల కేంద్రమైన వడమాలపేటకు వెళ్లేందుకు తిరుపతి నుంచి పుత్తూరుకు వచ్చే సమయంలో కొద్దిదూరం వచ్చి మలుపు తిరిగి వెళ్లాలి. అక్కడ విద్యుత్తు దీపాలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గోవిందపాళెం, తడుకు వద్ద, గొల్లపల్లి తదితర ప్రాంతాల్లో లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇవి ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ప్రమాదాలు తగ్గాయి. బైపాస్ రోడ్డు వెంబడి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయని ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# విత్తనశుద్ధికి శ్రీకారం..

శ్రీకాళహస్తి : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) వాటాదారులైన రైతుల నుంచి సేకరించిన విత్తనాలు శుద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన వరి వంగడాలను అందుబాటులో ఉంచాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించింది. విత్తన సేకరణ తగ్గడం, దీనికితోడు శుద్ధి చేసి విక్రయించే ఉత్పత్తులు తగ్గడం యాజమాన్యాన్ని, ఏపీసీడ్స్‌ను నమ్ముకున్న రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.రబీ సీజన్‌లో 20 వేల క్వింటాళ్ల మేరకు విత్తనాలు సేకరించాలని ఏపీసీడ్స్ లక్ష్యం పెట్టుకుంది. నెలరోజులుగా విత్తన సేకరణ చేపడుతున్నా ఇప్పటి వరకు 8 వేల క్వింటాళ్ల మేరకు మాత్రమే సేకరించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యంలో ఈ దఫా ఎక్కువ మోతాదులో కేళీలు (ఇతర ధాన్యం రకాలు) ఉండటంతో చాలా వరకు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 50 శాతం మేర లక్ష్యం పూర్తవుతుందన్నది ప్రశ్నార్థకమే.

ధరల ప్రభావం.. ఆశలు గల్లంతు

మార్కెట్ పరంగా ధరలు ఆశించిన మేర లేకపోవడం, ఏపీసీడ్స్ యాజమాన్యం ధాన్యం తిరస్కరిస్తుండటంతో పలువురు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రైవేటు మార్కెట్‌లో అమ్ముకోలేకపోవడం, అమ్ముకున్నా ఆశించిన రీతిలో ఆదాయం ఉండటం లేదని వారు వాపోతున్నారు. ఎలాగైనా తమ ధాన్యం ఆమోదించాలని పలువురు ఏపీసీడ్స్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

**మరిన్ని వంగడాలు తేవాలి**

ఏటా ఏపీసీడ్స్ ద్వారా శుద్ధి చేసిన విత్తనాలకు అంతర్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంటోంది. అదే దిశగా ప్రస్తుతం తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్ర రైతుల కోసం ఏపీసీడ్స్ ప్రస్తుతం ఉమ, జ్యోతి రకాలను శుద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాసెసింగ్ ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆశించిన మేరకు ధాన్యం సేకరించకపోవడంతో విక్రయాలు అంతంతమాత్రంగా ఉంటాయని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా రైతులకు మరిన్ని వంగడాలను అందుబాటులోకి తెచ్చి ఏపీసీడ్స్ పురోభివృద్ధికి పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

# కొండమట్టి.. కొల్లగొట్టి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన కైలాసగిరుల్లో మళ్లీ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వైకాపా హయాంలో రాత్రీపగలూ తేడా లేకుండా కొండమట్టిని కొల్లగొట్టారు. దాదాపుగా ఎకరాల విస్తీర్ణంలో నెలల తరబడి ఈ అక్రమ తరలింపు సాగుతూ వచ్చింది. దీనిపై అప్పట్లో విమర్శలు గుప్పుమన్నాయి. ప్రస్తుతం రాత్రివేళల్లో గిరిప్రదక్షిణ మార్గంలో మళ్లీ మట్టి తవ్వకాలు ప్రారంభమయ్యాయి.అర్ధరాత్రిన.. గుట్టుగాగిరి ప్రదక్షిణ మార్గంలో రాత్రివేళలో ఈ అక్రమ తరలింపు ఎక్కువగా సాగుతోంది. జేసీబీతో పాటు పదుల సంఖ్యలో ట్రాక్టర్లను తీసుకెళ్లడం, ఉదయం వరకు ఎంత వీలైతే అంతగా కొండలను తవ్వేసి మట్టిని ఊడ్చేస్తున్నారు. ప్రస్తుతం గిరి ప్రదక్షిణ మార్గం అనువుగా ఉండటంతో వీలైనంత మేర మట్టిని తవ్వి అక్రమంగా తరలించేస్తున్నారు. రాళ్లను పక్కకు జరిపి మట్టిని తవ్వేయడం ద్వారా వర్షాకాలంలో తవ్వేసిన మట్టి కరిగిపోయి భారీ రాళ్లు మళ్లీ రోడ్ల మీదకు వచ్చే అవకాశముంది. అంతేకాకుండా భారీ వేగంతో మట్టి తరలింపు వాహనాల రాకపోకలతో రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డు గుల్లగా మారిపోతోంది.

## సోనాక్షి రేసులో ఇలా వెనుకబడితే ఎలా?

బాలీవుడ్ లెజెండరీ నటుడు శత్రుఘ్న సిన్హా వారసురాలిగా సోనాక్షి సిన్హా తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. దబాంగ్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు హీరోయిన్గా చాలా సినిమాలు చేసింది. స్పెషల్ అప్పిరియన్స్ లతోనూ అలరించింది. సోనాక్షి ఇప్పటికే 15 ఏళ్ల కెరీర్ ను పూర్తి చేసుకుంది. మరి బాలీవుడ్ హీరోయిన్లలో సోనాక్షి స్థానం ఎన్నవది? అంటే చెప్పడం కష్టం. అమ్మడు మంచి పెర్ఫార్మర్. కొన్ని యూనిక్ క్వాలిటీస్ ఉన్నాయి. కానీ స్టార్ హీరోయిన్ గా మాత్రం ఫేమస్ కాలేకపోయింది. దీపికా పదు కొణే, కరీనా కపూర్ , అలియాభట్ లా ఇండస్ట్రీలో రాణించలేకపోతుంది? అన్నది వాస్తవం. 15 ఏళ్ల కెరీర్ అంటే సోనాక్షి ఇప్పటికే స్టార్ లీగ్ లో చేరిపోయావాలి.



హీరోయిన్ గా ఓ బ్రాండ్ లా వెలిగిపోవాలి. భారీగా పారితోషిక అందుకోవాలి. బ్రాండ్ అంబాసిడర్ గా ఫుల్ బిజీగా ఉండాలి. ఇండస్ట్రీలో తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని సృష్టించుకోవాలి. కానీ సోనాక్షి వీటిన్నింటికి దూరంగానే ఉంది. వచ్చిన అవకాశాలు చేసుకుంటూ వెళ్లడం తప్ప! తన బ్రాండ్ మాత్రం వేయలేకపోయింది. తండ్రికి తగ్గ తనయగా బాలీవుడ్ లో ఎదగలేకపోయింది. స్టార్ హీరోలతో పనిచేసింది కూడా చాలా తక్కువ సినిమాల్లోనే. ఈ మధ్యనే ఓ తెలుగు సినిమాలో కూడా నటిస్తోంది. సోనాక్షి రేంజ్ మూవీ కాదది. కానీ వచ్చిన అవకాశాన్ని కాదనకుండా సద్వినియోగం చేసుకుంటుంది. ఈ విషయంలో సోనాక్షిని మెచ్చుకోవాలి. అమ్మడు ఎంతో డౌన్ టూ ఎర్త్. తండ్రి పెద్ద స్టార్ అయినా? తాను మాత్రం ఎంతో సింపుల్ లైఫ్ ని లీడ్ చేస్తుంది. సోనాక్షి పెళ్లి చేసుకుంది కూడా ఓ సినిమా రైటర్ ని. అయితే కెరీర్ పరంగా మాత్రం సోనాక్షి చేరాల్సిన గమ్యం ఇంకా చేరలేదు. మరి నవ నాయికల మధ్య పోటీని తట్టుకుని ఆ రేంజ్ కు చేరుతుందా? లేదా? అన్నది చూడాలి.

## రష్మిక 'చెన్నై' పోస్ట్.. కన్నడిగులు ఫీల్ అయ్యారా?

స్టార్ హీరోయిన్ రష్మిక.. ఇప్పుడు కెరీర్ లో ఓ రేంజ్ లో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. నార్త్ టు సౌత్ వరుస సినిమాలతో అలరిస్తున్నారు. నాన్ స్టాప్ గా షూటింగ్స్ తో బిజీగా గడుపుతున్నారు. ఇప్పుడు కుబేర మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. జూన్ 20వ తేదీన వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా రిలీజ్ కానుందీ చిత్రం.కుబేరలో కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, టాలీవుడ్ కింగ్ నాగార్జున లీడ్ రోల్స్ పోషించగా.. రష్మిక ఫిమేల్ లీడ్ లో కనిపించనున్నారు. అయితే పాన్ ఇండియా మూవీ కనుక.. మేకర్స్ సినిమాను అంతే విధంగా ప్రమోట్ చేస్తున్నారు. అదే సమయంలో రష్మిక.. ప్రమోషన్స్ లో చురుగ్గా పాల్గొంటున్నారు. తన వంతు న్యాయంగా ప్రమోట్ చేస్తున్నారు. రీసెంట్ గా చెన్నైలో జరిగిన ఈవెంట్ లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారని చెప్పాలి. ప్యాస్టల్ కలర్ సూపర్ డ్రెస్ లో తళుకుమన్న భామ.. తన గ్లామర్ తో మెప్పించారు. ఇప్పుడు ఆ పిక్స్ ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అమ్మడు.. లాంగ్ నోట్ ను రాసుకొచ్చారు. చెన్నైతో తనకున్న అనుబంధాన్ని షేర్ చేసుకుంటూ, టీమ్ కోసం మాట్లాడారు. "కుబేరా ప్రమోషన్లను చెన్నైలో ప్రారంభించాం. మీలో చాలా మందికి తెలిసినట్లుగా చెన్నైలోనే నా



బాల్యం గడిచింది. దీంతో నా హృదయంలో చెన్నై ప్రియమైన స్థానాన్ని కలిగి ఉంది. ఎంత అద్భుతమైన సాయంత్రం అది!" అంటూ రాసుకొచ్చారు రష్మిక. కుబేర టీమ్ క్రియేట్ చేసిన మ్యాజిక్ కోసం వెయిట్ చేయండని కోరారు. అయితే చెన్నైకి తన హృదయంలో ప్రత్యేక స్థానమని పెట్టిన రష్మిక పోస్ట్.. కొందరు కన్నడిగులకు ఆగ్రహం తెప్పించిదట. ఆమెది చెన్నై అన్నట్లే పోస్ట్ పెట్టారని కొందరు అభిప్రాయపడుతున్నారు. పుట్టి పెరిగి స్కూల్ చదువుకున్నదంతా కర్ణాటకలో అయితే.. చెన్నైలో బాల్యం గడవడం ఏంటని ఇప్పుడు కన్నడ నెటిజన్లు అంటున్నారు. రష్మిక ఏ ఉద్దేశ్యంతో పెట్టారో గానీ.. ఇప్పుడు ఆ పోస్ట్ మాత్రం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కొద్ది రోజుల ముందు కన్నడ సూపర్ హిట్ కాంతార మూవీ చూడలేదని అనడంతో అనేక మంది ట్రోల్స్ చేశారు. ఆ తర్వాత హైదరాబాద్ తనకు ఇల్లు లాంటిదని వ్యాఖ్యానించడంతో విమర్శించారు. ఇప్పుడు చెన్నైలో బాల్యం గడిచిందని అనడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి దీనిపై రష్మిక స్పందిస్తార వేచి చూడాలి.




## ఒక్క పూట భోజనం.. డైట్ తో పవన్ 10 కిలోల లాస్!



టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు తన పెండింగ్ లో ఉన్న సినిమాలను పూర్తి చేసే పనిలో ఉన్న విషయం తెలిసిందే. మొన్నటి వరకు రాజకీయాలతో బిజీగా ఉన్న ఆయన.. ఇప్పుడు తనను నమ్ముకున్న నిర్మాతలకు, దర్శకులకు టైమ్ కేటాయిస్తున్నారు. లైనప్ లో ఉన్న సినిమాలు ఒక్కొక్కటిగా కంప్లీట్ చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం హరిహర వీరమల్లు మూవీని పవన్ పూర్తి చేయగా.. ఇప్పుడు రిలీజ్ కు సిద్ధమవుతోంది ఆ చిత్రం. మరికొద్ది రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ తర్వాత గ్యాంగ్ స్టర్ డ్రామా ఓజీ మూవీని ఫినిష్ చేశారు పవన్. త్వరలో డబ్బింగ్ వర్క్ ను కంప్లీట్ చేయనున్నారు. ఇప్పుడు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై ఫోకస్ పెట్టారు. రీసెంట్ గా ఆ మూవీ సెట్స్ లోకి అడుగుపెట్టారు. అయితే వరుస సినిమాల షూటింగ్స్ తో బిజీగా ఉన్న పవన్.. స్పెషల్ డైట్ ను ఫాలో అవుతున్నట్లు సమాచారం. దీంతో 10 కిలోల బరువు తగ్గారని తెలుస్తోంది. కేవలం ఒక్క పూట మాత్రమే భోజనం చేస్తున్నారట. మిగతా సమయాల్లో స్నాక్స్, బ్లాక్ కాఫీ తీసుకుంటున్నారని టాక్. ఎక్సర్ సైజెస్ కూడా చేస్తున్నారని తెలుస్తోంది. మొత్తానికి సీక్రెట్ డైట్ ఫాలో అవుతున్నారు పవన్. రీసెంట్ గా ఆయన ఓ సెలూన్ ప్రారంభోత్సవంలో సందడి చేసిన విషయం తెలిసిందే. షార్ట్, టీ షర్ట్ తో వచ్చిన పవన్ ను అప్పుడు చూసి అంతా షాకయ్యారు. ఏంటి ఇంత ఫిట్ నెస్ గా ఉన్నారని మాట్లాడుకున్నారు. అయితే డైట్ వల్లే స్లిమ్ అయ్యారని అర్థమవుతుంది. అంతకుముందు.. కొన్ని నెలల క్రితం ఉత్తరప్రదేశ్ లో జరిగిన కుంభమేళాకు పవన్ కళ్యాణ్ వెళ్లారు. అప్పుడు ఒంటిపై షర్ట్ లేకుండా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అందుకు సంబంధించిన ఫోటోలు ఒక్కసారిగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఆయన పొట్ట పెరిగిందని కొందరు నెటిజన్లు ట్రోల్ చేశారు. నెలలు తిరగకముందే ఇప్పుడు సీన్ కట్ చేస్తే మళ్లీ స్లిమ్ గా దర్శనమిచ్చిన పవన్ కళ్యాణ్.. తన ఫిట్ నెస్ తో ట్రోలర్స్ కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. వన్ టైమ్ మీల్ డైట్ తో తన ఓల్డ్ లుక్ కు వచ్చారు. ఆయన ఇప్పటికే నటించిన తమ్ముడు, ఖుషి సినిమాల్లోని లుక్ లో పవన్ ఇప్పుడు కనిపిస్తుండడంతో ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీగా ఫీలవుతున్నారు.

## విదేశీయులతో శిల్పాశెట్టి భర్త గొడవకు కారణం?



సాగర కన్య శిల్పాశెట్టి, ఆమె భర్త ఇటీవల కొన్ని వివాదాల కారణంగా వార్తల్లో నిలిచారు. అయితే అంతా సద్దుమణిగింది అనుకుంటుండగానే, విదేశీయులతో రాజ్ కుంద్రా ఘర్షణ కారణంగా మరోసారి వార్తల్లోకి వచ్చారు. కుంద్రా – శిల్పాశెట్టి జంట క్రొయేషియా పర్యటనలో ఈ వివాదం తలెత్తింది. ఈ వివాదానికి సంబంధించిన వీడియో ఇంటర్నెట్ లో జోరుగా వైరల్ అయింది. అయితే ఈ వివాదానికి కారణమేమిటి? అన్నది ఆరా తీస్తే కుంద్రా చెప్పిన సంగతులు ఆశ్చర్యపరిచాయి. నేను నా భార్య 50వ పుట్టినరోజు కోసం ఘనంగా ప్లాన్ చేసుకున్నాను. శిల్పా, కొందరు అతిథులతో క్రొయేషియాలోని హోటల్ లో టేబుల్ ను చాలా ముందుగా(సంవత్సరం క్రితం) బుక్ చేసుకున్నాను. కానీ ఏజెంట్ కారణంగా డబుల్ బుక్ అయింది. అదే టేబుల్ ని వేరొకరు బుక్ చేసుకున్నారు. దీంతో మా మధ్య ఘర్షణ మొదలైంది! అని రాజ్ కుంద్రా చెప్పారు. అంతేకాదు.. ఇలా జరగడానికి కారణాన్ని ప్రశ్నించగా, వారు %–%వెయిట్ చేయండి%–% అంటూ నిర్లక్ష్యంగా జవాబిచ్చారని, దీంతో నిరాశ మరింత పెరిగిందని కుంద్రా వాపోయాడు. నేను నా భార్య, పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులు, అత్తగారు సహా 20 మంది అతిథులతో ఆ హోటల్ వద్ద వెయిట్ చేయాల్సి వచ్చింది. ఎదురు చూస్తూ విసిగిపోయాము.. ఏజెంట్ తప్పిదాన్ని ప్రశ్నించాను.. అని రాజ్ కుంద్రా వెల్లడించాడు. కుటుంబం అతిథులతో ఆనందంగా జరగాల్సిన కార్యక్రమం తీవ్ర ఒత్తిడిని పెంచిందని కుంద్రా అన్నారు. బిజినెస్ మేన్ రాజ్ కుంద్రా వ్యాపారాల్లో తలమునకలుగా ఉన్నా కానీ, అతడు ఫ్యామిలీ మ్యాన్. కుటుంబానికి తగిన సమయం కేటాయించడానికి వెనకాడరు. ఇంతకుముందు పలు కోర్టు వివాదాల్లో శిల్పాశెట్టి తన భర్త కుంద్రాకు బలమైన అండగా నిలిచింది. ప్రస్తుతం క్రొయేషియాలో వెకేషన్ నుంచి శిల్పాశెట్టి ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తుండగా అవి వైరల్ గా మారాయి.

## దటీజ్ అనుష్క అనిపించిందిగా!

స్వీటీ అనుష్క 'బాహుబలి' తరువాత సెలెక్టీవ్గా సినిమాలు చేస్తూ వస్తోంది. తన ఇమేజ్కు తగ్గ సినిమాలని ఎంచుకుంటూ వరుసగా లేడీ ఓరియెంటెడ్ సినిమాలకే ప్రధాన్యత నిస్తూ వస్తోంది. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' తరువాత అనుష్క నటించిన లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్ 'ఘాటి'. క్రిష్ జాగర్లమూడి డైరెక్ట్ చేసిన ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. జూలై 11న భారీ స్థాయిలో పాన్ ఇండియా సినిమాగా రిలీజ్కు రెడీ అవుతోంది. ప్రస్తుతం ఈ దీనికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చివరి దశకు చేరుకుంది. సినిమా రిలీజ్కు సరిగ్గా నెల రోజులు టైమ్ ఉండటంతో టీమ్ త్వరలో ప్రమోషన్స్ని ప్రారంభించాలని ప్లాన్ చేస్తోంది. వరుసగా లిరికల్ ఆడియోలని రిలీజ్



చేస్తూ ప్రమోషన్స్ని ఓ రేంజ్లో చేయబోతున్నారు. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. గంజాయి స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే ఈ మూవీలో అనుష్క పవర్ ఫుల్ క్యారెక్టర్లో కనిపించనుందని గ్లింప్స్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే సినిమా రిలీజ్ దగ్గరపడుతున్ననేపథ్యంలో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఏర్పడినట్టుగా తెలుస్తోంది. గ్లింప్స్ ఆకట్టుకోవడం, అనుష్క మరో సారి శివాలెత్తే క్యారెక్టర్లో కనిపించనుండటంతో 'ఘాటి'కి సంబంధించిన నాన్ థియేట్రికల్ బిజినెస్కు భారీ క్రేజ్ ఏర్పడింది. క్రిష్ మరోసారి అనుష్కతో కలిసి చేసిన సినిమా కావడంతో ఈ సినిమా నాన్ థియేట్రికల్ రైట్స్ రికార్డు స్థాయిలో రూ.36 కోట్లకు అమ్ముడు పోయినట్టుగా తెలిసింది. లేడీ ఓరియెంటెడ్ మూవీకి ఈ ప్రైజ్ దక్కడం ఓ రికార్డ్గా చెబుతున్నారు. ఈ డీల్తో మేకర్స్ పెట్టిన ఇన్వెస్ట్ మెంట్ దాదాపు వచ్చేసిందని, ఇక మిగతా వచ్చేది అదనంగా మారి లాభాలని అందిస్తుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఈ సినిమా మొత్తం బడ్జెట్ రూ.45 కోట్లు. నాన్ థియేట్రికల్ బిజినెస్ పరంగా రూ.36 కోట్లని రాబట్టింది. అంటే పెట్టుబడిలో 90 శాతం రికవరీ అయినట్టే. ఇక థియేట్రికల్ బిజినెస్ పూర్తయితే %–%ఘాటి%–% రిలీజ్కు ముందే లాభాల్లోకి వెళుతుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ థియేట్రికల్ బిజినెస్ని క్లోజ్ చేయబోతున్నారట. ఈ మూవీలోని కీలక పాత్రల్లో తమిళ నటుడు విక్రమ్ ప్రభు, రమ్యకృష్ణ, జగపతిబాబు నటించారు. విద్యాసాగర్ సంగీతం అందించగా ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్పై వై. రాజీవ్రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. త్వరలో ప్రారంభం కానున్న ప్రమోషన్స్లో అనుష్క పాల్గొనబోతోంది.

## ఈ ఏడాదితో పూజ ఫ్యూచర్ తేలిపోనుందా?

టాలీవుడ్ టాప్ స్టార్ హీరోల్లో దాదాపు అందరితోనూ హీరోయిన్గా నటించిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే ప్రస్తుతం తెలుగు సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈమె జోరు కొన్నాళ్లకే మసకబారింది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో నాలుగు.. ఐదు సినిమాలు ఉన్నాయి. అన్నీ కూడా హిందీ, తమిళ్ సినిమాలు కావడం విశేషం. తెలుగులో ఈ అమ్మడు మళ్లీ నటిస్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెలుగులో ఒకప్పుడు మోస్ట్ బిజీ హీరోయిన్గా ఉన్న ఈ అమ్మడు ఇప్పుడు ఒక్క తెలుగు సినిమా ఆఫర్ చేతిలో లేకపోవడంతో ఫ్యాన్స్ తెగ ఫీల్ అవుతున్నారని తెలుస్తోంది. ముందు ముందు అయినా ఈమె టాలీవుడ్లో రీ ఎంట్రీ ఇచ్చేనా అనేది అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఈమె చేస్తున్న సినిమాలు వరుసగా బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకోవడంతో పాటు, ఇండస్ట్రీ హిట్గా నిలిస్తే తప్పకుండా తెలుగు ఫిల్మ్ మేకర్స్ మరోసారి ఈమె వైపు తిరిగి చూసే అవకాశాలు ఉన్నాయి. ఇండస్ట్రీలో సక్సెస్లు ఉన్న వారికే ఆఫర్లు వస్తాయి. అదే ఫార్ములా ఖచ్చితంగా పూజా హెగ్డేకు వర్కౌట్ అవుతుంది. రాబోయే



ఏడాది కాలంలో పూజా హెగ్డే నుంచి కూలీ, హై జవానీ తో ఇష్క్ హోనా హై, జన నాయగన్, కాంచన 4 సినిమాలు రానున్నాయి. ఈ నాలుగు సినిమాలు సూపర్ హిట్ కావడంతో పాటు, ఆ సినిమాల్లో ఈమె పాత్రకు మంచి గుర్తింపు దక్కడంతో పాటు, ఆమె నటన గురించి మాట్లాడుకుంటే అప్పుడు కోలీవుడ్లో ఛాన్స్ దక్కవచ్చు. టాలీవుడ్లోనే కాకుండా కోలీవుడ్, బాలీవుడ్లో ఈ అమ్మడు కంటిన్యూ కావాలన్నా కూడా ఆ సినిమాలు మంచి విజయాలను సొంతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఈ అమ్మడి కెరీర్ ఊగిసలాటలో ఉంది. ఆ సినిమాల ఫలితాలపైనే ఈమె యొక్క సినిమా కెరీర్ ఆధారపడి ఉంటుంది అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేస్తున్న అందమైన ఫోటోలను అభిమానులు తెగ ఇష్టపడుతున్నారు. కానీ సినిమాల్లో ఈమె పాత్రలను సైతం ఇష్టపడితేనే కెరీర్లో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. రాబోయే ఏడాది కాలం పాటు ఈమెకు గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536